తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

సోమవారం 29.09.2025 | సంపుటి : 12 సంచిక : 71 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

## ప్రపంచ మేటి నగరాలకు దీటుగా

# ఫ్యూచర్‌సిటీ

## పదేళ్లలో న్యూయార్క్‌ను మరిపించే మహానగరం కడతా : సీఎం రేవంత్



- ప్రతిష్టాత్మక నగరం గురించి కొందరు దుష్ప్రచారాలు చేస్తున్నారు
- అభివృద్ధి పనుల వల్ల నష్టపోయేవారిని అన్నివిధాలా ఆదుకుంటాం
- డిసెంబర్ నుంచి ముఖ్యమైన కార్యక్రమాలు ఎఫ్‌సీడీఏ నుంచే..
- రంగారెడ్డిలో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** ఫ్యూచర్ సిటీపై కొందరు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తనకు ఇక్కడ భూములున్నందు వల్లే ఫ్యూచర్ సిటీ కడుతున్నారని అంటున్నారని పేర్కొన్నారు.తన కోసం కాదు.. భవిష్యత్తు తరాల కోసమే ఫ్యూచర్ సిటీ అని వివరించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అంబర్‌పేటలో 14.16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బతుకమ్మకుంటను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కుంట వద్దకు చేరుకున్న సీఎంకు మహిళలు బతుక మ్మలతో మిగతా 2లో..

"70 ఏళ్ల తర్వాత కూడా మన గురించి ప్రపంచంమాట్లాడుకునే పనులు చేయొద్దా? భారత్ ఫ్యూచర్ సిటీకి ఏం తక్కువ? అన్ని అవకాశాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి చెన్నైకి బుల్లెట్ ట్రైన్(వయా అమరావతి)కి కేంద్రం ఒప్పుకొంది. ఇక్కడ 500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువు తీరాలన్నది నా స్వప్నం. హైదరాబాద్‌లో ప్రస్తుతం 80 ఫార్చ్యూన్ కంపెనీలే ఉన్నాయి. ఫ్యూచర్ సిటీ విషయంలో సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటాం. కోర్టులకు వెళ్లి ఇబ్బంది పడవద్దు. అభివృద్ధి పనుల వల్ల నష్టపోయేవారిని అన్నివిధాలా ఆదుకుంటాం. దక్షిణ భారతంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. అందుకే ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నానికి 12 లేన్ల రోడ్డు వేయబోతున్నాం. ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ, స్కిల్ వర్సిటీలను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. డిసెంబర్ నుంచి ముఖ్య మైన కార్యక్రమాలు ఎఫ్‌సీడీఏ నుంచే చేపడతాం. సింగరే ణికి పదెకరాల భూమి ఫ్యూచర్ సిటీలో కేటాయిస్తాం. ఏడాది తిరిగే లోగా సింగరేణి కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలి" - సీఎం రేవంత్

# గ్రూప్-2 ఫలితాలు విడుదల

## 783 పోస్టుల భర్తీకి జనరల్ ర్యాంకులు ప్రకటించిన టీజీపీఎస్సీ


**హైదరాబాద్(జనంసాక్షి):** గ్రూప్-2 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. మొత్తం 783 పోస్టులకుగానూ ఎంపికైన 782 మంది జాబితాను వెల్లడించింది. ఒక్క పోస్టు ఫలితాన్ని పెండింగ్‌లో పెట్టింది.783 పోస్టులకు గతేడాది నవంబర్‌లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు నిర్వహించింది. 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసిన టీజీపీఎస్సీ.. 2024 డిసెంబరులో రాత పరీక్ష నిర్వహించింది. ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకుల జాబితాను వెల్లడించింది. ఇప్పటికే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసింది.




# బతుకమ్మకుంటకు పునరుజ్జీవనం

- హైదరాబాద్‌కు చెరువులు, మూసీ గొప్పవరం
- 2 సెం.మీ వర్షం పడితే నగరమంతా అస్తవ్యస్థం
- వరద నీటిని నియంత్రించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరముంది
- బతుకమ్మకుంటను ప్రారంభించిన సీఎం రేవంత్

2లో..





# శాంతించిన మూసీ

- సాధారణ స్థితికి చేరిన నదీ ప్రవాహం
- పునరావాస కేంద్రాల నుంచి సొంతింటికి బస్తీ వాసులు
- ప్రారంభమైన ఎంజీబీఎస్ నుంచి బస్సు సర్వీసులు



2లో..

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

## ముగ్గురు మావోయిస్టులు మృతి



**కాంకేర్(జనంసాక్షి):** ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. కాంకేర్, గరియాబంద్ జిల్లాల సరిహద్దులోని రావాస్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో డీఆర్‌జీ బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఉదయం నుంచి ఇరువైపుల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మృతుల్లో మిగతా 2లో..

## కాంగ్రెస్ గ్యారంటీల మోసాన్ని బాకీ కార్డులతో

# ఎండగడతాం

## తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి:కేటీఆర్


**కల్వకుర్తి(జనంసాక్షి):** కాంగ్రెస్, భాజపా జాయింట్ వెంచర్ నడుపుతున్నాయని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. మంత్రి పొంగులేటి నివాసంలో ఈడీ సోదాలు జరిగి ఏడాదైనా చర్యలు లేవన్నారు.కాంగ్రెస్, భాజపా ఒకటేనని, రాష్ట్ర ప్రయోజనాలను ఆ రెండు పార్టీలూ కాపాడలేవని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి మండలం కడ్తాల్‌లో కేటీఆర్ పర్యటించారు. కడ్తాల్‌లో దీక్ష చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. మాట ఇచ్చి.. తప్పిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడినంత హీనంగా ఏ సీఎం మాట్లాడలేదని అన్నారు."రాష్ట్రం దివాళా తీసిందని సీఎం అంటే ఎవరు నమ్ముతారు? పాలమూరు, రంగారెడ్డిలో మిగిలిన 10శాతం పనులు పూర్తి చేయలేదు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 చొప్పున రూ.55 వేలు బకాయిలు మిగతా 2లో..



# చర్చలు లేవు.. కాల్పుల విరమణ లేదు

## మావోయిస్టులతో కాల్పుల ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాం

## కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఆయుధాలు వదిలేసి చర్చలకు వచ్చే విషయంలో మావోయిస్టుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టుల కాల్పుల విరమణ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామన్నారు. భద్రతాదళాలు వారిపై ఒక్క బుల్లెట్ కూడా ప్రయోగించబోవని హామీ ఇచ్చారు. దిల్లీలో 'నక్సల్ రహిత భారత్'పై నిర్వహించిన సెమినార్ ముగింపు సమావేశంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు."గందరగోళం సృష్టించేందుకే మావోయిస్టుల నుంచి ఇటీవల ఓ లేఖ బయటకు వచ్చింది. ఇప్పటివరకు జరిగింది పొరపాటు అని, కాల్పుల విరమణ ప్రకటించాలని, తాము లొంగిపోవాల నుకుంటున్నామని అందులో పేర్కొన్నారు. ఒకవేళ మావోయిస్టులు లొంగిపోవాలనుకుంటే.. కాల్పుల విరమణ అవసరం లేదు. ఆయుధాలను వీడి ముందుకు రండి. ఒక్క బుల్లెట్ కూడా పేలదు. రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతాం. మిగతా 2లో..

# ఈ ఏడాది చివర్లో భారత్‌కు పుతిన్



- రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ ప్రకటన
- భారత్ విషయాల్లో జోక్యం చేసుకోమని వెల్లడి

**బీజింగ్(జనంసాక్షి):** ఈ ఏడాది చివర్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం భారత విలేకరులతో మాట్లాడారు. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారని లవ్రోవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య విస్తృతమైన ద్వైపాక్షిక అజెండా ఉందన్నారు. వాణిజ్యం, సైనిక, సాంకేతికత, కృత్రిమ మేధ వంటి కీలక విషయాల్లో మిగతా 2లో..

## పాక్ ప్రపంచ తీవ్రవాదానికి

# కేంద్రబిందువు

## విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్

**న్యూయార్క్(జనంసాక్షి):** పాకిస్థాన్ దశాబ్దాలుగా ప్రపంచ తీవ్రవాదానికి కేంద్ర బిందువుగా ఉందని, స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచీ భారత్ సీమాంతర ఉగ్రవాదం రూపంలో దాని నుంచి సవాళ్లు ఎదుర్కొంటూనే ఉందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ సమావేశంలో పేర్కొన్నారు. ఇందుకు తాజా ఉదాహరణ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలకు మద్దతునిచ్చే మిగతా 2లో..

# అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం

- ఘటనలో ముగ్గురి మృతి
- మరికొంత మందికి తీవ్రగాయాలు

9లో..

# అక్టోబర్ 2న ఖాదీ వస్త్రాలే ధరించండి

- భారత పుత్రికలు ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగలరు
- మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందుకోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులే విక్రయించాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన్‌కీ బాత్ 126వ కార్యక్రమంలో ఆదివారం మోదీ మాట్లాడుతూ.. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి.. ధరించాలని కోరారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారన్నారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ.. గత 11 ఏళ్లుగా మళ్లీ ఖాదీ ఉత్పత్తి పెరిగిందని అన్నారు. ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని



ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు మిగతా 2లో..

# మా గురించి మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

- అమెరికా ప్రయోజనాలకు హానీ కలిగించే విధానాలను వెంటనే రద్దు చేసుకోవాలి
- ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలయ్యాకే భారత్ రష్యా నుంచి రాయితీపై ముడి చమురు కొనుగోళ్లు పెంచింది
- భారత్‌పై మరోసారి నోరుపారేసుకున్న అమెరికా

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హెూవార్డ్ లుట్నిక్ మరోసారి భారత్‌పై నోరుపారేసుకున్నారు. అమెరికాతో వాణిజ్య భాగస్వాములైన భారత్, బ్రెజిల్ వంటి దేశాలు తమ గురించి మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.వారు తమ మార్కెట్లను తెరిచి.. అమెరికా ప్రయోజనాలకు హానీ కలిగించే విధానాలను వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్, భారత్ వంటి దేశాలను అగ్రరాజ్యం మరింత సరిచేయాల్సిన అవసరం ఉందని ఓ ఇంటర్వ్యూలో ప్రేలాపనలు చేశారు. ఆయా దేశాలు తమతో ఆలోచించి మాట్లాడాలని అన్నారు. రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలుపెట్టాకే భారత్ రాయితీపై రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లు పెంచిందని హెూవార్డ్ లుట్నిక్ ఆరోపించారు. ఇప్పటికైనా ఎవరివైపు



ఉండాలనే విషయంపై మోదీ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు.లుట్నిక్ గతంలోనూ ఇదే విధంగా భారత్‌పై నోరుపారేసుకున్నారు. భారత్, కెనడా, బ్రెజిల్ వంటి దేశాలు అమెరికాలో విక్రయాలు చేపడుతూ.. ప్రయోజనాలు పొందుతున్నారని.. కానీ, తమను మాత్రం ఆయా దేశాల్లో విక్రయాలు చేపట్ట కుండా మిగతా 2లో..



# ఆరని యుద్ధ జ్వాలలు

## గాజాలో నానాటికీ పెరుగుతున్న మృతుల సంఖ్య

**గాజాస్ట్రిప్(జనంసాక్షి):** అంతర్జాతీయంగా తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదురవుతున్నప్పటికీ.. గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపడం లేదు. దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం కారణంగా గాజాలో మృతుల సంఖ్య 66 వేలు దాటింది. మరో 1.68 లక్షల మంది గాయపడ్డారని స్థానిక ఆరోగ్యశాఖ వెల్లడించింది. మృతుల్లో దాదాపు సగం మంది మహిళలు, చిన్నారులేనని అంచనా వేసింది. శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నట్లు భావిస్తోంది. గత 24 గంటల్లోనే 79 మంది మరణించినట్లు తెలిపింది. అయితే.. మొత్తం మృతుల సంఖ్యలో సామాన్య పౌరులు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. మిగతా 2లో..

# చర్చలు లేవు.. కాల్పుల విరమణ లేదు

పునరావాసం కల్పిస్తాం” అని అమిత్ షా తెలిపారు. అభివృద్ధి లేకపోవడమే మావోయిస్టు హింసకు దారితీసిందనే వామపక్షాల వాదనలను తోసిపుచ్చారు. ఈ హింస కారణంగానే దేశంలోని అనేక ప్రాంతాలు దశాబ్దాల తరబడి అభివృద్ధికి దూరంగా ఉండిపోయాయన్నారు.

మావోయిస్టుల్లో తీవ్ర విభేదాలు!

“దేశంలో నక్సలిజం సమస్య ఎందుకు తలెత్తింది? వారికి సైద్ధాంతిక, ఆర్థిక, చట్టపరమైన మద్దతును ఎవరు అందిస్తున్నారు? వీటన్నింటినీ అర్థం చేసుకోనంత వరకు.. నక్సలిజంపై పోరాటం ముగియదు. మావోయిస్టుల హింసపై మౌనం వహించిన వామపక్ష పార్టీలు.. ‘ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్’ను ప్రారంభించినప్పుడు మాత్రం మానవ హక్కుల గురించి మాట్లాడటం ప్రారంభించాయి. మావోయిస్టులను ఆ పార్టీలు ఎందుకు రక్షించాలి? గిరిజన బాధితుల హక్కులను కాపాడేందుకు నక్సల్ సానుభూతిపరులు ఎందుకు ముందుకు రారు?” అని అమిత్ షా ప్రశ్నించారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తామని పునరుద్ఘాటించారు.

# కాంగ్రెస్ గ్యారంటీల మోసాన్ని బాకీ కార్డులతో ఎండగడతాం




ఇవ్వాలి. ఓట్ల కోసం వచ్చిన కాంగ్రెస్ నేతలను బకాయిలపై నిలదీయాలి. ఓట్ల కోసం డబ్బులు ఇస్తే తీసుకొని.. మిగతా బకాయిల గురించి అడగాలి. ఆల్మట్టి ప్రాజెక్టును ఆపే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా? లేదంటే గులాబీ దండు కదలాలా? ఆల్మట్టి ఎత్తు పెంపుపై రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి” అని కేటీఆర్ అన్నారు.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రచారం చేసేది టూరిస్టు మంత్రులు: కేటీఆర్**

కాంగ్రెస్ గ్యారంటీల మోసాన్ని బాకీ కార్డులతో ఎండగడతామని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ పరిధి షేక్‌పేటలో ఆయన పర్యటించారు.ఇంటింటికీ వెళ్లి ‘కాంగ్రెస్ బకాయి కార్డు’ను పంపిణీ చేశారు. ప్రతి వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బాకీ ఉందో అందులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే అవకాశం ఉపఎన్నిక, స్థానిక ఎన్నిక రూపంలో వచ్చిందన్నారు. వీటిలో ఆ పార్టీకి గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు ప్రచారం చేసేది టూరిస్టు మంత్రులని ఎద్దేవా చేశారు. ఎన్నికలు అయిపోగానే మంత్రులు, సామంతులు అందరూ గాయబ్ అవుతారని చెప్పారు.


# మా గురించి మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

అడ్డుకుంటున్నాయని అన్నారు. ఏళ్ల తరబడి తాము ఈ సమస్యను ఎదుర్కొన్నాం కాబట్టే సుంకాలు విధించామన్నారు. తమతో వాణిజ్యం చేసే దేశాలు దీనిని అంగీకరించక తప్పదని అన్నారు. ఇరుదేశాల మధ్య సుంకాల వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. భారత్–అమెరికా మధ్య సుంకాల వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై టారిఫ్‌లను 50 శాతానికి పెంచారు. గత నెల నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. అమెరికా అదనపు సుంకాలు సహేతుకం కాదని భారత్ ఇప్పటికే ఖండించింది. ఈ విషయంలో దేశ ప్రయోజనాలకు కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే.. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించడం అంత తేలికైన విషయం కాదని, రష్యాపై చర్యల కోసం దిల్లీతో విభేదానికి సిద్ధమయ్యామని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నట్లు గుర్తించామన్నారు. కాల్పులు ముగిసిన తర్వాతే మృతులపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముందన్నారు. ప్రస్తుత ఆపరేషన్‌తో కలిపి.. ఈ ఏడాది చత్తీస్‌గఢ్‌లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 252 మంది మావోయిస్టులు హతమయ్యారని తెలిపారు.

# పాక్ ప్రపంచ తీవ్రవాదానికి కేంద్రబిందువు



వారు చివరికి తమనూ ఉగ్రవాద భూతం మట్టుబెడుతుందని గుర్తించాలన్నారు. ఐక్యరాజ్య సమితి ఆశించిన లక్ష్యాలు సాధించిందా అన్నది మనల్ని మనం ప్రశ్నించుకోవాలని సూచించారు. ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక సహకారం పెంపొందాలని పేర్కొన్నారు. భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ పెటల్ గహ్లోత్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ పోరాటం నిలపాలంటూ పాకిస్థాన్ సైన్యం తమను ప్రాధేయపడిందని చెప్పారు. భారత్–పాక్ వ్యవహారాల్లో తృతీయపక్ష జోక్యానికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. “..ఈ ఉదయం పాకిస్థాన్ ప్రధాని ప్రదర్శించిన నాటకీయతను సర్వప్రతినిధి సభ వీక్షించింది. ఒకనాడు ఉగ్రవాదాన్ని ప్రశంసించింది ఈ ప్రధానే. వారి విదేశాంగ విధానానికి కేంద్ర బిందువు ఉగ్రవాదమే” అని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోవడంతో ఆపరేషన్ సిందూర్‌ను భారత్ ప్రారంభించి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిందని తెలిపారు. “భారత్‌పై మరిన్ని దాడులు చేస్తామని పాకిస్థాన్ మే 9 వరకు హెచ్చరించింది. ఆ మరుసటిరోజు.. ఇక పోరాటం ఆపండంటూ ప్రాధేయపడింది” అని పెటల్ గహ్లోత్ వివరించారు

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం

**కాపాడుకోవాలి: ప్రశాంత్ భూషణ్**

**హైదరాబాద్(జనంసాక్షి:**ఎన్నికల సంఘం, దర్యాప్తు సంస్థలు స్వతంత్రను కలిగి ఉంటేనే ప్రజాస్వామ్యం ప్రాణంతో ఉంటుందని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు.ప్రస్తుతం దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ‘ప్రజాస్వామ్యాన్ని రక్షించండి’ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

## ప్రపంచ మేటి నగరాలకు దీటుగా

# ఫ్యూచర్ సిటీ

“చంద్రబాబు, వైఎస్ఆర్ ముందు తరాల కోసం ఆలోచించారు. అందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ వచ్చాయి. గత పాలకుల నుంచి మంచి ఉంటే నేర్చుకోవాలి. చాలా మంది విదేశాలకు వెళ్లి వచ్చి అద్భుతంగా ఉన్నాయని చెబుతున్నారు. ఎన్నాళ్లు న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ గురించి చెప్పుకొంటాం.. మనం కూడా అలా తయారు కావాలి కదా. నాకు పదేళ్లు సమయం ఇవ్వండి.. న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా అని అన్నారు.”70 ఏళ్ల తర్వాత కూడా మన గురించి ప్రపంచం మాట్లాడుకునే పనులు చేయొద్దా? భారత్ ఫ్యూచర్ సిటీకి ఏం తక్కువ? అన్ని అవకాశాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి చెన్నైకి బుల్లెట్ ట్రైన్(వయా అమరావతి)కి కేంద్రం ఒప్పుకొంది. ఇక్కడ 500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువు తీరాలన్నది నా స్వప్నం. హైదరాబాద్‌లో ప్రస్తుతం 80 ఫార్చ్యూన్ కంపెనీలే ఉన్నాయి. ఫ్యూచర్ సిటీ విషయంలో చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటాం. ఈ విషయాలకు కోర్టులకు వెళ్లి ఇబ్బంది పడవద్దు. అభివృద్ధి పనుల వల్ల నష్టపోయేవారిని అన్నివిధాలా ఆదుకుంటాం. దక్షిణ భారతంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. అందుకే ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నానికి 12 లేన్ల రోడ్డు వేయబోతున్నాం.

ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ, స్కిల్ వర్సిటీలను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. డిసెంబర్ నుంచి ముఖ్యమైన కార్యక్రమాలు ఎఫ్‌సీడీఏ నుంచే చేపడతాం. సింగరేణికి పదెకరాల భూమి ఫ్యూచర్ సిటీలో కేటాయిస్తాం. ఏడాది తిరిగే లోగా సింగరేణి కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలి” అని రేవంత్‌రెడ్డి తెలిపారు. దక్షిణ భారతంలో పోర్టులేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే, అందుకే అమరావతితో ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీకి ఏం తక్కువ అన్ని అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకే ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నానికి 12 లేన్ల రోడ్డు వేయబోతున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ నుంచి చెన్నైకి బుల్లెట్ ట్రైన్ వయా అమరావతికి కేంద్రం ఒప్పుకుందని హర్షించారు. ఫ్యూచర్ సిటీలో 500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువు తీరాలన్నది తన కల అని సీఎం రేవంత్ చెప్పారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 80 ఫార్చ్యూన్? కంపెనీలే ఉన్నాయని గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీ విషయంలో చిన్నచిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటామన్నారు. చిన్నచిన్న విషయాలకు కోర్టులకు వెళ్లి ఇబ్బంది పడొద్దని హితవు పలికారు. ఎలాంటి సమస్య ఉన్నా నేను పరిష్కరిస్తా, దీని కోసం ఓ మెకానిజం ఏర్పాటు చేస్తామన్నారు. ఉప



ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దిగ్గజ కంపెనీలు తెలంగాణ వైపు చూసేలా ప్రపంచంలోని ఇతర నగరాలకు రోల్ మోడల్ గా నిలిచేలా భారత్ ఫ్యూచర్ సిటిని అభివృద్ధి చేయాలన్నదే మా ప్రభుత్వ సంకల్పమని.ఇప్పుడు ప్రణాళికా బద్ధమైన నగరం అనగానే అందరికీ చండీఘర్ గుర్తుకొస్తుందని, రాబోయే రోజుల్లో ప్రణాళికాబద్ధమైన నగరం అంటే భారత్ ఫ్యూచర్ సిటీ గుర్తుకొస్తుందన్నరు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ లివ్–లెర్న్ వర్క్%–%ప్లే అనే కాన్సెప్ట్ తో పరిశ్రమలు, ఆసుపత్రులు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్ అన్ని ఒకే చోట ఉండేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేయబోతున్నాం. భావితరాల కోసం మన బిడ్డల కోసం వారి బంగారు భవిష్యత్తు కోసం ఈ రోజు మనందరం కలిసి వేస్తున్న పునాదే ఈ భారత్ ఫ్యూచర్ సిటీ అని తెలిపారు. ఇది ‘నెట్ జీరో కార్బన్ సిటీ’. ఇక్కడ పచ్చదనం ఉంటుంది, కాలుష్యం ఉండదు. పరిశ్రమలు వస్తాయి, కానీ పర్యావరణానికి ఎలాంటి హాని జరగదు. రేపటి తరాల కోసం తెలంగాణ కోసం చిత్తశుద్ధితో నిరంతరం కృషి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వంతో కలిసి నడవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. మమ్మల్ని ఆశీర్వదించాలని కోరుతున్నా. భారత్ ఫ్యూచర్ సిటి నిర్మాణంలో పాలు పంచుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మన్, ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్పర్సన్ నిర్మల,ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమీషనర్ కె.శశాంక, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులు, వివిధ సంస్థల ఛైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు

# బతుకమ్మ కుంటకు పునరుజ్జీవనం



కబ్జాకు గురైన బతుక మ్మకుంటలో ఆక్రమణలు తొలగించిన హైడ్రా.. రూ.7.15 కోట్ల వ్యయంతో చెరువును పునరుద్ధరిం చింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైడ్రాపై రూపొందించిన పాటను సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కనుమరుగైన బతుకమ్మకుంటను పునరుద్ధరించిన హైడ్రాను అభినందించారు. “హైడ్రా ఆలోచన చేసినప్పుడు ప్రారంభంలో నన్ను విమర్శించారు. ఒక గొప్ప పనికి శ్రీకారం చుట్టినప్పుడు విమర్శలు సహజం. హైదరాబాద్‌కు చెరువులు, మూసీ నది గొప్పవరం. కానీ, చెరువులు, మూసీ నది కబ్జాకు గురై వరద సమస్య పెరిగింది. మూసీ అంటే.. మురికికూపం అన్నట్లుగా తయారైంది. మూసీ పరివాహకంలోని పేదల పట్ల నాకు అవగాహన, సానుభూతి ఉంది. పేదలకు మేలు చేయాలనే భావిస్తాను కానీ, నష్టం చేసే వ్యక్తిని కాదు. పేదల జీవితాల్లో మార్పు కోసం కృషి చేస్తున్నాం. మీరంతా సహకరిస్తేనే.. మీరు, మేము కోరుకున్నది సాధ్యం అవుతుంది. హైటెక్ సిటీ ప్రాంతంలో తుమ్మడికుంట కూడా ఆక్రమణకు గురైంది. తెలిసో ..తెలియకో.. హీరో నాగార్జున చెరువున్న భూమిలో కన్వెన్షన్ హాల్ కట్టారు. హైడ్రా కూల్చిన తర్వాత, వివరాలు చెప్పిన తర్వాత నాగార్జున వాస్తవం గ్రహించారు” అని రేవంత్‌రెడ్డి అన్నారు. హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, విమలక్క, కార్పొరేషన్ ఛైర్మన్లు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ రోహిన్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఉన్నతాధికారులు.

**మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం**

అంబర్‌పేట్‌లో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని కేంద్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. నగరవ్యాప్తంగా రూ.4,739 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం 45 ఎస్‌టీపీల నిర్మాణం చేపడుతోంది. ఈ మేరకు డీపీఆర్‌లు రూపొందించింది. ఇప్పటికే పూర్తయిన ఆరు ఎస్‌టీపీలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. మరో 39 కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మురుగునీటి శుద్ధి వ్యవస్థ గురించి జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సీఎంకు వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మళ్లీ వానలే..

- తీరం దాటిన అల్పపీడనం
- తెలంగాణలో మరో రెండు రోజుల పాటు వర్షాలు

**హైదరాబాద్(జనంసాక్షి):**బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఒడిశాలోని గోపాల్‌పుర్ తీరాన్ని శనివారం ఉదయం దాటింది. ఇది దక్షిణ ఒడిశా ఛత్తీసగఢ్ ప్రాంతంలో ఆదివారం తీవ్ర అల్పపీడనం మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. వాయుగుండం కేంద్రం నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్ర, గోవా వరకు 4.5 కి.మీ ఎత్తులో ఏర్పడిన ఉపరితల ద్రోణి కారణంగా ఆది, సోమ వారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపారు. ఉరుములు మెరుపులతో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయి. శుక్రవారం ఉదయం 8 నుంచి శనివారం ఉదయం 8గంటల వరకు పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 15.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వానలతో మూసీనదికి వరద పోటెత్తింది. శనివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు 12 గంటల వ్యవధిలో అత్యధికంగా లింగాయిపల్లి(మెదక్)లో 10.4 సెం.మీ. వర్షం కురిసింది. మానూరు(సంగారెడ్డి)లో 9.2, మేడిపల్లి(వరంగల్)లో 9.1, ఆసిఫాబాద్‌లో 6.1 సెం.మీ. వర్షం పడింది. మరోవైపు ఈ నెల 30 నాటికి ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చని, దీని ప్రభావంతో అక్టోబరు 1 నాటికి మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వివరించింది.

**ఏటూ చూసిన వరద నీరే :**

నాలుగురోజులుగా కురుస్తున్న వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి దూకుతున్నాయి. ఏకధాటి వర్షానికి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు నిండుకుండలా మారి అలుగు పారుతుంది. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను వరుణుడు వీడలేదు. జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. పండుగ వేళ నర్సంపేటలో వీధులన్నీ చిత్తడిగా మారాయి.మహబూబాబాద్ జిల్లా రామన్నగూడెంలో నాలుగు రోజులైతే చేతికొచ్చే మొక్కజొన్న నేలవాలడంతో రైతులు శోకసంద్రంలో మునిగారు. ఇంటిల్లిపాది కష్టం చేసి సాగుచేసిన పంట మంచి దిగుబడి వస్తుందనుకుంటే నేల వాలిందని బాధపడ్డారు. పెట్టుబడులు రావని ఆవేదన వ్యక్తం చేశారు.



# శాంతించిన మూసీ

**సాధారణ స్థితికి చేరిన ప్రవాహం**

**పునరావాస కేంద్రాల నుంచి సొంతింటికి బస్తీ వాసులు**

**ప్రారంభమైన ఎంజీబీఎస్ నుంచి బస్సు సర్వీసులు**

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్‌ను హడలెత్తించిన మూసీ నది ప్రవాహం సాధారణ స్థితికి చేరుకుంది. మూసీ నది పరివాహకంలోని చుట్టు పక్కల ఉన్న బస్తీల ప్రజలు పునరావాస కేంద్రాల నుంచి సొంతిళ్లకు చేరుకుంటున్నారు. వరదలో మునిగిన తమ ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ఇళ్లలోని సామగ్రి, ఫర్నీచర్ ధ్వంసం అయ్యాయి. చాదర్‌ఘాట్‌లో లెవల్ వంతెనపై భారీగా బురద, చెత్తా చెదారం పేరుకుపోయింది. మూసారాంబాగ్ వద్ద లోయర్ బ్రిడ్జిపైనా మూసీ వరద సృష్టించిన బీభత్సం కళ్లకు కడుతోంది. చాదర్ ఘాట్ బ్రిడ్జి రెయిలింగ్ తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోగా, అధికారులు పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. మూసారాంబాగ్ వద్ద సైతం ఇదే పరిస్థితి ఉండగా పెద్ద ఎత్తున మరమ్మతులు చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పర్యటించారు. శానిటేషన్ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఉప్పల్ భగాయత్ సమీపంలో మూసీ ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పట్టింది. వాటర్ ప్రెజర్‌తో క్లీనింగ్ చేయిస్తూ దోమలు, అంటువ్యాధుల నివారణకు




శానిటేషన్ చేశారు. ఇంకా కొన్ని ప్రాంతాలు మురికిలోనే ఉన్నాయి. శనివారం మూసీ వరదలో చిక్కుకున్న ఎంజీబీఎస్ తేరుకుంది. బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన బురదను పారిశుధ్య కార్మికులు తొలగించారు. త్వరితగతిన సహాయ చర్యలు చేపట్టి తిరిగి ఆర్టీసీ బస్సు సేవలను అధికారులు ప్రారంభించారు. ప్రయాణికులు ఎవరూ ఇబ్బందులు పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. బస్టాండ్?లో వరద కారణంగా శనివారం ఊర్లకు వెళ్లలేకపోయినా ప్రయాణికులు, తాజా సర్వీసులు ప్రారంభం కావడంతో ప్రయాణికులు సొంతూళ్లకు బయలుదేరి వెళుతున్నారు. దసరా పండక్కి ఊరెళ్లే ప్రయాణికులతో ఎంజీబీఎస్ కళకళలాడుతోంది

మూసీ నదికి 35 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం : శనివారం కురిసిన వర్షానికి మూసీ నదికి ఒకేసారి 35 వేల క్యూసెక్కుల వరద రావడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. భారీ వరద ముంచెత్తడంతో మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు అంతా బిక్కుబిక్కుమన్నారు. ఉస్మాన్‌సాగర్ 12, హిమాయత్‌సాగర్ 9 గేట్లను ఎత్తి 35 వేల క్యూసెక్కులకు పైగా నీరు మూసీ నదిలోకి వరద నీటిని విడుదల చేశారు. దీంతో ఒకేసారి అంత పెద్ద మొత్తంలో నదిలోకి ప్రవాహం పోటెత్తడంతో పరివాహక ప్రాంతాల్లోని రోడ్లు, వంతెనలు, కాలనీలు అన్నీ నీట మునిగాయి.ఈ ప్రభావం బాపూఘాట్ నుంచి మూసారాంబాగ్ వరకు తీవ్రంగా కనిపించింది. మూసానగర్, రసూల్‌పురా, వినాయక వీధి, శంకర్‌నగర్‌లలో వందల ఇళ్లు నీట మునిగి నానా ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని 600 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ వంతెనలపై వాహన రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. వరద ప్రవహించే క్రమంలో మూసీ బ్రిడ్జిలను తాకుతూ వరద ప్రవహించింది. వంతెనపై స్లాబ్? వేసేందుకు ఏర్పాటు చేసిన ఇనుప సెంట్రింగ్? భారీ శబ్దాలతో కొట్టుకుపోయింది. ఇప్పుడు కాస్త మూసీ నదిలో వరద తగ్గుముఖం పట్టడంతో జనాభాలు ఒక్కొక్కరు సొంతిళ్లకు వెళుతున్నారు.

# అక్టోబర్ 2న ఖాదీ వస్త్రాలే ధరించండి

కూడా విభేదాలను పక్కన బెట్టి దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగిం చాలని, కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులనే కొనుగోలు చేయాలన్నారు. భారత నావికాదళానికి చెందిన ఇద్దరు అధికారిణు లు, లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూపల ధైర్య సాహసాలను ప్రధాని మోదీ ప్రశంసించారు. సముద్ర గ`ర్భంలో వారు చూపుతున్న తెగువను కొనియా డారు. భారత పుత్రికలు కఠినమైన పరిస్థితు లను సైతం సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. మన్‌కీ బాత్‌లో భాగంగా వారిరువురితో ఫోన్‌లో సంభాషించారు.స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ భారతరత్న, ప్రముఖ గాయని లతా మంగేష్కర్ ల జయంతి సందర్భంగా ప్రధాని మోదీ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ ఉరికంబం ఎక్కారని..దానికి ముందు ఆయన ఆంగ్లేయులకు లేఖ రాశారని అన్నారు. ఇందులో తమను ఉరి కంబాలకు బదులు తూటాలతో చంపాలని భగత్‌సింగ్ కోరినట్లు తెలిపారు. ఆ లేఖ ఆయన సాహసానికి నిదర్శనమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భగత్ సింగ్ ఎప్పుడూ ముందుండే వారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని యువతకు సూచించారు. ప్రముఖ గాయని లతా మంగేష్కర్ పాడిన దేశభక్తి గీతాలు ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయన్నారు. భారతీయ సంస్కృతి, సంగీతంపై ఆసక్తి ఉన్న ఎవరైనా ఆమె పాటలను విని మంత్రముగ్ధులైపోతారని కొనియాడారు.

# ఈ ఏడాది చివర్లో భారత్‌కు పుతిన్



సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య జరిగే సాధారణ దౌత్య చర్చల్లో భాగంగా ఈ ఏడాదిలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాస్కోలో పర్యటించే అవకాశం ఉందని, తాను కూడా భారత్‌లో పర్యటిస్తానని తెలిపారు. వాణిజ్యం, ఇంధన సంబంధిత అంశాల్లో భారత్ చర్యల్లో తాము జోక్యం చేసుకోమని లవ్రోవ్ స్పష్టం చేశారు. వీటిపై స్వయంగా నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం ఆ దేశానికి ఉందన్నారు. చమురు వాణిజ్య విధానాలపై భారత వైఖరిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చమురు కొనుగోళ్లపై ఇంతకుముందు జైశంకర్ పేర్కొన్న విషయాలను లవ్రోవ్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా తన చమురును అమ్మాలనుకుంటే.. దీనికి సంబంధించిన నిబంధనలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని జైశంకర్ పేర్కొన్నట్లు తెలిపారు. కానీ, యూఎస్‌తో కాకుండా రష్యా లేదా ఇతర దేశాలతో వాణిజ్యం కొనసాగించడం అనేది తమ సొంత విషయమని ఆయన తెలిపినట్లు వెల్లడించారు. దీనిని ఉదహరిస్తూ భారత్‌కు ఆత్మగౌరవం ఉందని లవ్రోవ్ వ్యాఖ్యానించారు.

# ఆరని యుద్ధ జ్వాలలు

2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు మెరుపుదాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా హమాస్ నెట్‌వర్క్ అంతమే లక్ష్యంగా టెల్‌అవీవ్ విరుచుకుపడుతోంది. ఫలితంగా గాజా జనాభాలో దాదాపు 90 శాతం మంది నిరాశ్రయులుగా మారారు. మరణాలతోపాటు పెద్దఎత్తున విధ్వంసం, మానవతా సంక్షోభం, కరవుతో పరిస్థితులు మరింత దుర్భరంగా మారాయి. కొన్నిరోజులుగా గాజా సిటీ లక్ష్యంగా ఇజ్రాయెల్ తన దాడులను ముమ్మరం చేసింది. మరోవైపు.. ప్రపంచ దేశాలు నెతన్యాహు సర్కారు తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఇటీవల ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తించాయి.

# యువతకు మెండుగా ఉన్నత విద్యా అవకాశాలు

- విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ
- సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయం గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క




ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 28(జనంసాక్షి). : యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని, విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం లో జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న సాయిబాబా టెంపుల్ రోడ్ వద్ద సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయం కోసం 24 కోట్ల నిధులతో 8.4 కిలోమీటర్ల సమ్మేళనం గోడ నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జి నాగేష్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవ లభిస్తుందని, గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఇది బలమైన వేదిక అవుతుందని తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ గిరిజన సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులను సమకూర్చుతామని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని, విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ సృష్టిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఆధునిక లైబ్రరీలు, ల్యాబరేటరీలు, హాస్టల్స్, తరగతి గదులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు వల్ల విద్యా రంగం, జిల్లా అభివృద్ధికి సహకారం ఏర్పడుతుందని విద్యార్థులు, యువత, స్థానికులు అందరూ ఈ యూనివర్సిటీ ద్వారా అద్భుత ఫలితాలను రాణిస్తారన్నారు. ప్రజా ప్రభుత్వం గిరిజన సంక్షేమం, విద్యా అవకాశాలను ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, యూనివర్సిటీ ఏర్పాటు ములుగు జిల్లాకు గౌరవాన్ని కలిగించడమే కాక, విద్యా రంగంలో కొత్త మైలురాయిని సృష్టిస్తుందన్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు కాబోతున్న సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీలో 80 శాతం స్థానిక విద్యార్థులకు ప్రవేశ అవకాశాలు కల్పించడం జరుగుతుందని యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా ప్రాంతీయ ప్రతిభను వెలికి తీయడానికి ముఖ్యమైన వేదికగా మారుతుందని తెలిపారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని గిరిజన యూనివర్సిటీ అన్ని అవకాశాలు అందుబాటులో వస్తాయని అన్నారు. అన్ని హంగులతో ఆధునిక లైబ్రరీలు, ల్యాబరేటరీలు, హాస్టల్స్, తరగతి గదులు ఏర్పాటుచేసి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ద్వారా, యువత సుస్థిరమైన భవిష్యత్తుకు పునాది వేసినట్లు అవుతుందని సమాజానికి, జిల్లా అభివృద్ధికి, గిరిజన సంక్షేమానికి అభివృద్ధిలో మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి.నాగేష్ మాట్లాడుతూ 24 కోట్ల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలోని గిరిజనుల విద్యాభివృద్ధి కోసం వారి సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసేలా, ఆర్థిక అభివృద్ధిలో కూడా యూనివర్సిటీ ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. త్వరలోనే క్యాంపస్ నిర్మాణం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో యూనివర్సిటీ నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి సెంట్రల్ గిరిజన యూనివర్సిటీని మంజూరు చేసినందుకు దేశ ప్రధాని, స్థానిక కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలియజేశారు. యూనివర్సిటీ వేగవంతంగా ఏర్పాటు చేసే విషయంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ తో కలిసి ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ లో రాబోయే ఐదు సంవత్సరాలలో 3000 నుంచి 5000 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించనున్నారని అన్నారు. శ్రీ సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ కి కేర్ టేకర్ గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ కు అదనపు బాధ్యతలు అందించడం జరిగిందని తద్వారా యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో పనులు త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారామ్ నాయక్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఫిల్మ్ మేకింగ్ ఎంట్రీలకు గడువు పొడిగింపు

హైదరాబాద్ (జనంసాక్షి) : "బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజర్స్ కాంపిటీషన్" కోసం ఎంట్రీల సమర్పణ గడువును అక్టోబర్ 5, 2025 వరకు పొడిగించాలని తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్ణయించింది. ఇప్పటికే ఈ పోటీకి అత్యంత సానుకూల స్పందన వచ్చిందని, ఈ పొడిగింపు 40 ఏళ్లలోపు యువ చిత్రనిర్మాతలకు అదనపు అవకాశాన్ని కల్పిస్తుందని ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎం.డీ ప్రియాంక తెలిపారు. ఆసక్తిగల చిత్రనిర్మాతలను ఈ పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత సమయానికి తమ ఎంట్రీలను సమర్పించాలని ఒక ప్రకటనలో కోరారు.

## నిండుకుండలా గణప సముద్రం చెరువు



### పూర్తిస్థాయి నీటిమట్టంతో జలకళ

గణపురం, సెప్టెంబర్ 28 (జనం సాక్షి): కాకతీయుల నిర్మించిన గణప సముద్రం సరస్సు నిండుకుండలా దర్శనమిస్తుంది. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలతో సరస్సుకు జలకళ సంతరించుకుంది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి నీటిమట్టం 29 అడుగులకు చేరింది. మరో అడుగు నీరు చేరితే మత్తడితో సరస్సు కనువిందు చేయనుంది. గత సంవత్సరం కూడా సరస్సు నీటిమట్టం 30 అడుగులకు చేరినప్పటికీ వర్షాలు నిలిచిపోవడంతో మత్తడి పడలేదు. గత వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలకు రేగొండ మండలం బాగిర్తిపేట రామన్నగూడెం చెరువు బుద్దారం వంగపల్లి వాణి చెరువులు మత్తడి పోస్తుండడంతో భారీగా వరద నీరు గణపసముద్రం సరస్సులోకి చేరుతుంది. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి 30 అడుగుల నీటిమట్టానికి చేరుకునే అవకాశం ఉంది.

# బీఆర్ఎస్‌లో చేరిన కోనప్పకు ఘనస్వాగతం

- పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే కోనప్ప




కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : బిఆర్ఎస్ పార్టీ లో చేరి కాగజ్నగర్ కు వచ్చిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాతం పలికారు. ఆదివారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్నగర్ రైల్వే స్టేషన్లో కోనప్పకు నాయకులు, కార్యకర్తలు డోలు వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి పట్టణంలోని వినయ్ గార్డెన్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో కోనప్ప మాట్లాడుతూ కెసిఆర్ నాయకత్వంలో తిరిగి రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తేవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి అనంతరం మాజీ ఎమ్మెల్యే కోనప్ప కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం కొంతకాలం స్తబ్దంగా ఉండిపోయారు. రాష్ట్ర అభివృద్ధి కెసిఆర్ నాయకత్వం లోనే సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ కోనేరు కోనప్ప తిరిగి బిఆర్ఎస్ పార్టీలో చేరడం వల్ల సిర్పూర్ నియోజకవర్గం లో పార్టీ బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, సిపి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్ట్రియా తెలుగు సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ బతుకమ్మ సంబరాలు



హైదరాబాద్ (జనంసాక్షి) : ఆస్ట్రియాలోని వియన్నాలో వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను తెలుగు సంగం ఆస్ట్రియా ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు వియన్నా నగరంలో ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ పండుగ వాతావరణాన్ని అలరించారు. పూల సోయగం, సాంప్రదాయ గీతాల మాధుర్యం, తాళం పట్టి వేసిన ఆటలు వేదికను తెలంగాణ ఊరితనంతో నింపేశాయి. కార్యక్రమానికి భారత రాయబార కార్యాలయం ఐఎఫ్ఎస్ అధికారి నిధి ధిమన్ ముఖ్య అతిథిగా హాజరై, మహిళలతో కలిసి బతుకమ్మ చుట్టూ ఆడుతూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఇంత దూరం దేశంలో కూడా భారతీయులు తమ మూలాలను గుర్తుంచుకుంటూ పండుగలు జరుపుకోవడం నిజంగా అభినందనీయం. ఇది తెలంగాణ సంస్కృతి వైభవానికి అద్దం పడుతోంది" అని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి విన్నపం



మహబూబ్‌నగర్ (జనంసాక్షి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రులు దామోదర్ రాజనర్సింహ ,జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరిలను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నగర్ కర్నూలు జిల్లా జనరల్ సెక్రెటరీ మునగాల సతీష్ కుమార్ కలిసారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల ఉపాధ్యాయ హెల్త్ కార్డ్స్ గురించి.. ముఖ్యంగా 317 జీవోలో డిప్యూటేషన్‌పై వచ్చిన 190 జీవోను పూర్తిస్థాయిగా సవరిస్తూ తాత్కాలిక ప్రతిపాదికన కాకుండా 317 జీవో ద్వారా ఇబ్బంది పడుతున్న చివరి ఉపాధ్యాయ ఉద్యోగి శాశ్వత స్థానికత అర్హత జీవో 190 ద్వారా పొందేలా శాశ్వతమైన..పరిష్కారం చూడాలని కోరారు. తప్పకుండా ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఆ సానుకూలతలో భాగంగానే 317 కు డిప్యూటేషన్‌కు 190 జీవో తీసుకొచ్చామని, సబ్ కమిటీ మెంబర్ రాష్ట్ర మంత్రి దామోదర్ రాజ నర్సింహ,వైద్యఆరోగ్య కుటుంబ శాఖ మాత్యులు తెలిపారు. సాధ్యమై తొందరగా తెలంగాణలో ఉన్నటువంటి ప్రతి ఒక్క ఉద్యోగ ఉపాధ్యాయునికి శాశ్వత స్థానికత 317 జీవో పరిష్కారం అయ్యేంతవరకు తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ఉద్యోగ ఉపాధ్యాయ తరపున పోరాడుతూనే ఉంటుందని మంత్రులకు తెలపడం జరిగింది.. వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు కూడా సానుకూలంగా స్పందించారు. 317 -గత ప్రభుత్వం చేసినటువంటి వాంఛి తపూర్వకమైనటువంటి, మేధావి,వర్గాన్ని చీల్చే ప్రయత్నంలో భాగంగా ఇష్టారాజ్యంగా 317 జీవోను చేయడం జరిగిందని విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యోగ ఉపాధ్యాయులు ఇప్పటికీ రుణపడి ఉంటారని ఇదేవిధంగా తొందరగా శాశ్వతంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామం, కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి 317 బాధితులకు ఇచ్చినటువంటి వారి మాటను మంత్రులు గుర్తు చేశారు.

# ఆర్టీసీలో అప్‌గ్రేడేషన్

- డిపోలు, బస్‌స్టేషన్ల ఆధునీకరణకు నిధులు మంజూరు



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం కోసం తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కొత్త డిపో నిర్మాణం, బస్ స్టేషన్ అప్‌గ్రేడేషన్, పునరుద్ధరణ, బస్ స్టేషన్ల ఆధునీకరణ కోసం 108.02 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు మంజూరైనట్టు తెలిపారు. పరిపాలన అనుమతులు భాగంగా మద్దుల్ బస్ స్టేషన్, నాగర్ కర్నూల్ బస్ డిపో, మహబూబ్ నగర్ బస్ స్టేషన్, రెగొండ బస్ స్టేషన్, వేములవాడ బస్ స్టేషన్, గంగాధర బస్ స్టేషన్, నిజామాబాద్ బస్ స్టేషన్, ఘన్‌పూర్ బస్ స్టేషన్, పాల్వంచ బస్ స్టేషన్, మునుగోడు బస్ స్టేషన్, చండూర్ బస్ స్టేషన్, చౌటుప్పల్ బస్ స్టేషన్, ఐజా బస్ స్టేషన్, వనపర్తి బస్ స్టేషన్, పెబ్బేర్ బస్ స్టేషన్, కొల్లాపూర్ బస్ స్టేషన్, పెంట్లవెల్లి బస్ స్టేషన్, దమ్మపేట బస్ స్టేషన్, మండలపల్లి బస్ స్టేషన్, అశ్వరావుపేట బస్ డిపో, హుస్నాబాద్ బస్ డిపో, కథలాపూర్ బస్ స్టేషన్, గోదావరిఖని బస్ స్టేషన్, గూడూరు బస్ స్టేషన్, మర్రిగూడ బస్ స్టేషన్, నెక్కొండ బస్ స్టేషన్, నర్సంపేట బస్ స్టేషన్, వలిగొండ బస్ స్టేషన్, నర్సంపేట బస్ స్టేషన్ (గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ షాపింగ్ కాంప్లెక్స్), నెక్కొండ బస్ స్టేషన్ (షాపింగ్ కాంప్లెక్స్)లకు మంజూరు దృష్ట్యా, ఆమోదించబడిన పనుల అమలుకు అవసరమైన అన్ని చర్యలను ప్రారంభించి, చేపట్టాలని సివిల్ ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. 10 సంవత్సరాలు ఆర్టీసీ నిర్వీర్యం అయి ఇబ్బందుల నుండి మహా లక్ష్మీ పథకం ద్వారా నూతన బస్సుల కొనుగోలు, కొత్త బస్సు డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్ల అభివృద్ధి ఆధునీకరణ చేయడం ఉద్యోగుల సంక్షేమం పై ఆర్టీసీ దృష్టి సారించింది.సంస్థ పరిరక్షణ ,ప్రయాణికుల భద్రత ,ఉద్యోగుల సంక్షేమం మూడు విధానాలతో ఆర్టీసీ మరింత ముందుకు పోతుందని తెలిపారు.

## ఖిలా వరంగల్‌లో బతుకమ్మ సంబరాలు

- హాజరైన మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్పాయ్



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 28( జనం సాక్షి) : వరంగల్ జిల్లా యంత్రాంగం, మహా నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ లో ఆదివారం నిర్వహించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిధిగా రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ హాజరు కాగా, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు, మహిళ ఉద్యోగులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని తంగేడు పూలు, గునుగు పూలు, బంతిపూలు, చామంతులతో అందంగా పేర్చి మహిళలందరితో ఒక చోట కూడి చప్పట్లతో నృత్యాలు చేస్తూ సందడి బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మహిళలతో కలిసి స్వయంగా బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు.తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక విశిష్టతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను, రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాల్లో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు, ఈ వేడుకలు మన వరంగల్ పట్టణంలో చారిత్రక వెయ్యి స్తంభాల గుడి నుండి ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు.

మన ఘనత ప్రపంచం మొత్తం తెలిసేలా, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు అయ్యేలా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించబోయే బతుకమ్మ పండుగను ప్రభుత్వం తరపున నిర్వహిస్తున్నామని ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా పూలను పూజించి దేవతలుగా చూసుకొని గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బైరబోయిన ఉమా, భోగి సువర్ణ, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, పోశాల పద్మ, డిఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జిల్లా అధికారులు, తహశీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ మెప్మా సిబ్బంది, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# సమృద్ధిగా యూరియా నిల్వలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : జిల్లాలో పంట సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ కుమారి దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని చెన్నూరు మండలం సుద్దాల గ్రామంలో గల ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి యామిని, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి ఆకస్మికంగా సందర్శించి యూరియా నిల్వలు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యవసాయ శాఖ, సంబంధిత శాఖల సమన్వయంతో జిల్లాలోని రైతులందరికీ పంట సాగుకు అవసరమైన యూరియా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, సాగుకు అవసరమైన యూరియా తీసుకొని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ముందస్తు సాగుకు, అవసరానికి మించి యూరియా తీసుకోకూడదని, యూరియా పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సాగు చేస్తున్న రైతులకు సమయానుసారంగా యూరియా అందించడం జరుగుతుందని, ఈ మేరకు రైతులు సహకరించాలని తెలిపారు. అంతకుముందు చెన్నూరు మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, సర్వే ల్యాండ్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి హాజరయ్యారు. ప్రభుత్వం త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు ఇతర సంబంధిత ఎన్నికల అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు శిక్షణలో అందించిన అంశాలను నేర్చుకుని ఎన్నికల నిర్వహణలో ఖచ్చితంగా వ్యవహరించాలని, ప్రక్రియ నిర్వహణలో అనుమానాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

- ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్,సెప్టెంబర్28(జనం సాక్షి) : హిందూ ధర్మ రక్షకుడు చత్రపతి శివాజీ మహారాజ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.ఆదివారం మామడ మండలం పరిమండల్ గ్రామంలో హిందూ హృదయ సామ్రాట్,ఛత్రపతి శివా జీ మహారాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు, యువకులు భారీ ర్యాలీతో ఎమ్మెల్యే కు స్వాగతం పలికారు. అనంతరం మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, హిందూ ధర్మ రక్షణకు పాటుపడిన మహనీయుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, నాయకులు రావుల రామ నాథ్, మెడిసెమ్మ రాజు, బాపురెడ్డి,సరికేల గంగన్న, జాలం సింగ్, మల్లేష్, లింగారెడ్డి, మల్లయ్య, నవీన్, చిన్నయ్య, రమేష్,సురేష్, సతీష్, ధర్మన్న, సంతోష్, రిత్విక్,యూత్ సభ్యులు, విడిసి సభ్యులు పాల్గొన్నారు .

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
29 సెప్టెంబర్ 2025

# గ్లోబల్ సిటీగా హైదరాబాద్



- ముప్పై వేల ఎకరాల్లో భవిష్యత్తు నగరం
- సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్ నగర అభివృద్ధి ప్రస్థానంలో కొత్త అధ్యాయంగా నిలిచే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు తెలంగాణ భవిష్యత్తును మలిచే మహత్తర ప్రయత్నం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముచ్చర్లలో 30వేల ఎకరాల విస్తీర్ణంలో పునాదిరాయి పడిన ఈ ప్రాజెక్టు గ్లోబల్ ప్రమాణాలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంగా పరిగణించవచ్చు. ఇప్పటికే హైదరాబాదు ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, స్టార్టప్ రంగాల్లో ప్రపంచ స్థాయిలో పేరు తెచ్చుకున్నప్పటికీ జనాభా ఒత్తిడి, రవాణా సమస్యలు, నివాస వసతుల కొరత, మౌలిక సదుపాయాల భారం నగర భవిష్యత్తును సంక్లిష్టం చేస్తున్నాయి. అలాంటి సవాళ్లకు దీర్ఘకాలిక పరిష్కారం చూపించే ప్రణాళికగానే ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది.

మొత్తం 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ రూపకల్పన జరుగుతోంది. ఇది హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ORR) మరియు రీజినల్ రింగ్ రోడ్ (RRR) మధ్య ముచ్చర్ల ప్రాంతం చుట్టూ విస్తరించనుంది. రంగారెడ్డి జిల్లాలో అధికారిక అంచనాల ప్రకారం దాదాపు 150 గ్రామాలు నేరుగా ఈ ప్రాజెక్టు పరిధిలోకి రానున్నాయి. నిర్మాణ పరంగా సుమారు 2 కోట్ల చదరపు మీటర్ల వాణిజ్య స్థలాలు, 1.5 కోట్ల చదరపు మీటర్ల నివాస సముదాయాలు, 50 లక్షల చదరపు మీటర్ల పారిశ్రామిక కేంద్రాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా, వైద్య, క్రీడా వసతులు నిర్మించనున్నట్లు ప్రాథమిక ప్రణాళికలు చెబుతున్నాయి.

ఫ్యూచర్ సిటీలో ప్రధాన ఆకర్షణగా నిలిచేది స్మార్ట్ సిటీ కాన్సెప్ట్ ఆధారంగా రూపుదిద్దుకునే మౌలిక వసతులు. వీటిలో ఐటీ హబ్‌లు, స్టార్టప్ ఇన్నోవేషన్ జోన్‌లు, పరిశోధన కేంద్రాలు, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, హరిత విహార కేంద్రాలు, అంతర్జాతీయ క్రీడా సముదాయాలు, ఎగ్జిబిషన్ సెంటర్లు వంటివి ఉన్నాయి. ఈ వసతులన్నీ ఒకే ప్రాంగణంలో ఉండటంతో జీవన సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు, వినోదం అన్నీ కలిసిన సమగ్ర పట్టణ జీవితం లభిస్తుంది.

ఈ ప్రాజెక్టు విజయానికి రవాణా సౌకర్యాలు కీలకం. రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారి ప్రణాళికలో ప్రధాన స్థానాన్ని పొందింది. 41.5 కిలోమీటర్ల పొడవునా రూ. 4,621 కోట్ల వ్యయంతో నిర్మితమయ్యే ఈ రహదారి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌ను రీజినల్ రింగ్ రోడ్‌తో అనుసంధానిస్తుంది. రెండు దశల్లో నిర్మాణం పూర్తయ్యే ఈ రహదారి ద్వారా పెట్టుబడిదారులు, పరిశ్రమలు, ఉద్యోగులు సులభంగా నగరంలోని విభిన్న ప్రాంతాలను చేరుకోగలరు. నిర్మాణం పూర్తయిన తరువాత ప్రయాణ సమయం కనీసం 40 శాతం తగ్గిపోతుందని అంచనా.

ప్రాజెక్టు అమలు పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (FCDA) ఏర్పాటు చేయబడింది. ఈ అథారిటీ కోసం మీర్‌ఖాన్‌పేటలో 20 ఎకరాల్లో రూ. 19 కోట్లతో కార్యాలయ భవనం నిర్మించ బడుతోంది. అదేవిధంగా ఆధునిక నగర ప్రణాళికకు శాస్త్రీయ మార్గదర్శకత్వం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (NIUIM) కోసం మరో 20 ఎకరాలు కేటాయించారు. దీని ద్వారా ఫ్యూచర్ సిటీ సాంకేతిక, పర్యావరణ, సామాజిక కోణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా ఎదగనుంది.

ఇంతటి మహత్తర ప్రాజెక్టు ముందు భూసేకరణ సవాళ్లు తప్పనిసరి. సుమారు 30వేల ఎకరాల విస్తీర్ణంలో వేలాది మంది రైతులు తమ భూములను కోల్పోవాల్సి ఉంటుంది. ఇప్పటికే రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తూ పునరావాసం, పరిహారం, ఉపాధి హామీలు కోరుతున్నారు. గతంలో దేశంలోని అనేక గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు భూసేకరణ సమస్యల కారణంగా నిలిచిపోయిన దృష్ట్యా ప్రభుత్వం న్యాయమైన పరిహారం, పారదర్శక పునరావాస పథకాలు, రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రజల అంగీకారం లేకుండా ప్రాజెక్టు ముందుకు సాగలేనందున ప్రభుత్వం సామాజిక చర్చలు జరపడం అత్యవసరం.

పెట్టుబడుల పరంగా ఫ్యూచర్ సిటీని నిపుణులు స్వర్ణావకాశంగా భావిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టిన అమెరికా, జపాన్, జర్మనీ, యూకే, సింగపూర్ వంటి దేశాల సంస్థలు ఫ్యూచర్ సిటీలో కూడా ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, విద్య, వైద్య రంగాల్లో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తయ్యే సమయానికి కనీసం 15 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేయబడుతోంది.

ప్రజలలో ఆశాజనక స్పందన కనిపిస్తున్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల నిర్వహణ, చెత్త పారవేత, పచ్చదనం వంటి అంశాలపై ఆందోళనలు కూడా ఉన్నాయి. సౌరశక్తి వినియోగం, వర్షపు నీరు సంరక్షణ, చెత్త నిర్వహణలో ఆధునిక సాంకేతికత, పట్టణ పచ్చదనం ప్రాధాన్యం పొందితేనే ఫ్యూచర్ సిటీ నిజమైన స్మార్ట్ సిటీగా నిలుస్తుంది.

చరిత్రపరంగా గోల్కొండ సుల్తానులు, నిజాములు హైదరాబాద్‌ను నిర్మించినప్పుడు చూపిన దూరదృష్టి ఈ నగరాన్ని ప్రపంచ పటంలో నిలిపింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే దూరదృష్టితో ఫ్యూచర్ సిటీకి శంకుస్థాపన చేసి "400 ఏళ్ల క్రితం హైదరాబాద్ నిర్మించబడింది. ఇప్పుడు 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇది తెలంగాణను ప్రపంచ పటంలో నిలబెట్టే మహత్తర ప్రాజెక్టు" అని స్పష్టం చేశారు.

మొత్తానికి ఫ్యూచర్ సిటీ విజయవంతమైతే అది తెలంగాణకే కాకుండా దేశానికీ ఆదర్శం అవుతుంది. సమగ్ర నగర అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ కలిసిన ఈ ప్రాజెక్టు భవిష్యత్తు తరాలకు కొత్త తెలంగాణ ప్రతీకగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# బడిలో.. బాల్యం ఒడిలో

టెన్త్ పూర్తి చేసి నేటికీ 25 ఏళ్లు అవుతుంది. ఈ సందర్భంగా పాలకుర్తి ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 25 ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను కొన్నింటిని మీతో పంచుకోవాలనుకుంటున్నాను. పాలకుర్తి గ్రామానికి చెందిన నేను మామిండ్ల రమేష్ అలియాస్ రమేష్ రాజా, మా అన్నయ్య శోభన్ రాజ్ ఫస్ట్ టు ఫిఫ్త్ వరకు నవోదయ పబ్లిక్ స్కూల్లో చదివాం. అమ్మా, నాన్న, మా కంటే పెద్దది అక్క కృష్ణవేణి చదువుకో లేదు. అయినప్పటికీ మమ్మల్ని ఆ రోజుల్లో ప్రైవేట్ స్కూల్లో చదివించారు. సిక్స్త్ క్లాస్ కోసం హై స్కూల్లో జాయిన్ అయ్యాం. అప్పటివరకు నిక్కరుతో పాఠశాలకు వెళ్లిన మేము ప్యాంటు వేసుకొని, చెప్పులతో పాఠశాలకు రావడం ఏదో తెలియని నూతన అనుభూతి. అన్నయ్య నేను ఒకటే క్లాస్, బి సెక్షన్, రేకుల షెడ్లలో సిక్స్త్, సెవెంత్ క్లాసులు ముగిశాయి. ఎయిత్ క్లాస్ స్లాబ్ కలిగిన తరగతి గదిలో, నైన్త్ టెంత్ క్లాసులు పెంకులు కలిగిన తరగతి గదులలో పూర్తయింది. రెండు మూడు బెంచ్ లలో నేను కూర్చుంటే అన్నయ్య శోభన్ రాజ్ చివరి బెంచ్ లో కూర్చునేవాడు.

ముఖ్యంగా మాకు విస్నూరుకు చెందిన అల్లంనేని కమలాకర్ రావు ప్రధానోపాధ్యాయులుగా ఉన్నారు. వారి గూర్చి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కొంతకాలం ఆర్మీ ఉద్యోగిగా పని చేశారు కాబట్టి ఆయనే ఫైర్ బ్రాండ్ గానే నిలిచిపోయారు. చాలా విషయాల్లో సీరియస్ నెస్ గా ఉండేవారు. క్రమశిక్షణకు పర్యాయపదంగా ఉన్న ఆయన్నుంచే తెలిసి తెలియని వయస్సులో క్రమశిక్షణ స్వీకరించాం. కమలాకర్ రావు అంటే భయపడని వారు ఉండకపోవచ్చు బహుశా! నేను సిక్స్త్ క్లాస్ లో ఉండగా ఒక రోజు స్కూల్ కి లేటుగా అటెండయ్యాను. చైర్ లో కూర్చుని ఉన్న ఆయన నా రాకను రూమ్‌లో ఉన్న అద్దంలో చూశాడు. పీఈటీతో నన్ను తన ఆఫీస్ కి పిలిపించుకు న్నాడు. చేతి కీళ్లు కందిపోయేలా ఐదు దెబ్బలు కొట్టాడు, ఇలా దెబ్బలు తినడం రెండోసారి, అంతకుముందు నవోదయ స్కూల్లో రూల్ కర్ర బావిలో పడేసారన్న నెపంతో నన్ను అనుమానించి చితకబాదారు. ఆ తర్వాత నిజం తెలిసి బాధపడ్డారు. అక్కడ చేయని నేరానికి దెబ్బలు తింటే.. ఇక్కడ స్కూల్ కి లేటుగా వొచ్చినందుకు ఈ రకమైన శిక్ష పడింది. అదొక అనుభవం!

ఇక్కడ ఇంకో విషయాన్ని గుర్తు చేయాలి. అది కుల వివక్షకు సంబంధించినది. ముదిరాజ్ సామాజిక తరగతి (బిసి – డి) నుండి వచ్చాను, వృత్తి చేపలు పట్టడం. అయితే, ఎంబీసీ తరగతికి చెందిన ఇద్దరు మిత్రులు సమయం దొరికినప్పుడల్లా ర్యాగింగ్ చేసేవారు. " అరేయ్ నీసు ముచ్చోడా.. ఉచ్చులో చేపలు పడతారురా మీరు.." అంటూ హేళనగా మాట్లాడే వారు. షేమ్ గా, ఒక రకమైన అవమానకరంగా ఫీలయ్యే వాడ్ని. కమ్యూనిస్టు నేపథ్యం కలిగిన మా ఇండ్లలో అలాంటి పరిస్థితులేవు. స్కూల్ కి దుమ్మా కొట్టి సినిమాలకు షికార్లకు తిరిగేవాళ్లం, అలా వెళ్లేందుకు స్కూల్ కి ఒక చేతిలో నోట్ బుక్, జేబుకు పెన్నుతో వచ్చేవాళ్ళం. కొన్ని సందర్భాల్లో హాజరు పడిందంటే తప్పించుకొని బయటికి వెళ్లే వాళ్ళం.

సీనియర్లు, జూనియర్లు అందరూ పకృతి రమణీయమైన చిత్రాలు వేశారు. నేను మాత్రం షాహిద్ భగత్ సింగ్ పార్లమెంటులో బాంబు ఎలా విసిరాడు, అల్లూరి సీతారామరాజు విల్లంబులు ఎలా ఎక్కుపెట్టి యుద్ధం చేశాడో.. స్వాతంత్ర్యోద్యమం ఘట్టాలను గుర్తుచేసేలా వేశాను. సూపర్ సీనియర్ కామ్రేడ్స్ సాంబయ్య, తోటి సహచర మిత్రుడు కామ్రేడ్ తిరుమల్ విద్యార్థి పోరాటంలో చురుకుగా పాల్గొనే వాళ్ళు. ర్యాలీలకు ధర్నాలకు వెళ్లేవాడిని.

మొదటినుంచి ఒకరకంగా పుస్తకాల పురుగుని. రోజు హై స్కూల్ కు వచ్చి వెళ్తూ రోడ్డు పక్కనే ఉన్న విప్లవ కవి పాల్కురికి సోమనాథుడు సదనం (శాఖ గ్రంథాలయం)కి వెళ్లి దినపత్రికలను, పుస్తకాలను చదివే వాడిని. ఓ రోజు నాలో సాహిత్యాన్ని గుర్తించిన తెలుగు పండితుడు శౌరి రాజన్ రాయటాన్ని ప్రోత్సహించారు. ' కవి రాజా ' అంటూ రమేష్ ను 'రమేష్ రాజా' గా మార్చారు. మానసికంగా మమ్మల్ని ఆయన దగ్గరికి చేర్చింది సాహిత్యానుబంధం. పదవి విరమణ పొందినప్పుడు వారి ఫోటోను చిత్రంగా మలిచి బహుమతిగా ఇచ్చిన సమయంలో సార్ కళ్ళల్లో ఆనందభాష్పాలు చూశాను. అలా మొదలైన సాహిత్య ప్రస్థానం నేటికీ కొనసాగుతుంది. నా మొదటి రచన 2011లో వికసించని మందారాలు కవిత్వం ప్రముఖ విద్యావేత్త, డాక్టర్ చుక్కా రామయ్య చేతుల మీదుగా ఇదే పాఠశాలలోని ఆవిష్కరణ చేసుకోవడం జీవితంలో ఒక మైలు రాయి. విప్లవ మూర్తి ఐలమ్మ, సామాజిక కిరణాలు, అమ్మా నన్ను పేరు అడిగింది, నాన్నే నా హీరో.. పుస్తకాలు ముద్రించబడ్డాయి. మరో ఐదు పుస్తకాలు రావాల్సి ఉంది.

అప్పటి ఉపాధ్యాయుల్లో కమలాకర్ రావు సార్ తర్వాత ఎం. సోమయ్య సార్ అంటే ఎక్కువగా భయం ఉంటే భక్తి కూడా కొద్దిగా ఉండేది, వారు సబ్జెక్టు చెప్పే విధానం బాగుండేది. శౌరిరాజన్, మహేందర్ రెడ్డి, మహేందర్, సోమయ్య, నారబోయిన యాకయ్య, వినీత, మరికొందరు టీచర్లు వాళ్ళు చెప్పిన పాఠాలు, నేర్పిన విద్యా బుద్ధులు, కొన్ని జ్ఞాపకాలు అప్పుడప్పుడు గుర్తొస్తుంటాయి. ఆ రోజులు మళ్ళీ వొస్తే బాగుండు అనిపిస్తుంది. ఎంతైనా తిరిగిరాని కాలం అది. పవిత్రమైన బంధంగా, కనిపించే దైవాలుగా చూసిన కాలం. విద్యార్థుల్లో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం వైపు నడిపించిన మార్గదర్శకులను ఎందరినో చూశాం. ఆనాడు ఎంతో సామాజిక బాధ్యత కలిగిన ఉపాధ్యాయులను మన తరం చూసింది. అలాంటి మానవీయ విలువలు కలిగిన ఉపాధ్యాయులు నేడు అరుదుగా కనిపిస్తున్నారు. హై స్కూల్ విద్యలో మనకు పాఠాలు చెప్పిన ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల నుంచి మనం అనేకం నేర్చుకున్నాం. ఆధునిక సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో అలాంటి పరిస్థితులు లేవనేది ఆందోళన కలిగిస్తుంది. ఒక్కొక్క గురువు గురించి చాలా రాయాలని తపన, ఆరాటం ఉన్నప్పటికీ ప్రస్తుత పనుల ఒత్తిడి రీత్యా ఈ వ్యాసాన్ని సంపూర్ణం చేయలేకపోతున్నాను. మరోసారి వాటిని మననం చేస్తాను.

(1999 – 2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం సెప్టెంబరు 28న జనగామ జిల్లా పాలకుర్తిలో నిర్వహిస్తున్న సందర్భంగా..)

**- మామిండ్ల రమేష్ రాజా,**
కవి, రచయిత సెల్: 7893230218

# ఎందుకింత వివక్ష?

మన దేశ రాజ్యాంగం పౌరులందరికి సమాన హక్కులు కల్పించినప్పటికీ, కుల ఆధారిత వివక్ష ఇంకా కొన్ని ప్రాంతాల్లో తగ్గకపోవడం విచారకరం. తరాలు మారుతున్నాయి, విద్యా స్థాయి పెరుగుతోంది, సాంకేతికత అభివృద్ధి చెందుతోంది. అయినప్పటికీ, మనసుల్లోని కుల భావజాలం మాత్రం మారడం లేదు.

ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని చిన్న బెండారంలో చోటుచేసుకున్న సంఘటన ఈ వాస్తవాన్ని మరోసారి బహిర్గతం చేసింది. అక్కడ ఒక అంగన్వాడీ టీచర్ బదిలీపై చేరుకున్నాక, ఆమె దళితురాలు అనే కారణంతో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీకి పంపడం మానేశారు. ఇది కేవలం ఒక ఉద్యోగిని అవమానపరచడమే కాకుండా, చిన్నారుల విద్యా హక్కును కూడా హరించడమే. రాజ్యాంగం ఈ తరహా అన్యాయాన్ని స్పష్టంగా నిషేధించింది. ఆర్టికల్ 14 సమానత్వాన్ని హామీ ఇస్తుంది. ఆర్టికల్ 17 అస్పృశ్యతను నిషేధిస్తుంది. ఆర్టికల్ 21A పిల్లలందరికీ ఉచిత, తప్పనిసరి విద్యను హామీ ఇస్తుంది. కానీ ఈ విలువలు గ్రామీణ స్థాయిలో ఇంకా పూర్తిగా ఆచరణలోకి రాలేదు. దళితులు, ఆదివాసీలపై అన్యాయం జరగకుండా కాపాడటానికి SC/ST (Prevention of Atrocities) Act, 1989 అమల్లోకి వచ్చింది. ఈ చట్టంలోని Section 3(1)(s) ప్రకారం కులపరంగా అవమానిస్తే శిక్ష తప్పదు. Section 3(1)(za)(D) ప్రకారం, విద్యాసంస్థలు లేదా సామాజిక కార్యక్రమాల్లో ప్రవేశం అడ్డుకోవడమూ నేరమే. శిక్షలు కూడా కఠినంగా ఉన్నాయి – ఆరు నెలల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా. కానీ సమస్య ఏమిటంటే, ఈ చట్టం ఉన్నా కూడా అమలు సరిగా జరగడం లేదు. బాధితులు న్యాయం కోసం దీర్ఘకాలం పోరాడాల్సిన పరిస్థితి వస్తోంది. సమాజం ఇంతవరకు ఎందుకు మారలేకపోయిందో మనం ఆలోచించాలి. కుల వ్యవస్థ అనే విష వృక్షం శతాబ్దాలుగా మన సామాజిక నిర్మాణంలో బలంగా వేర్లను పరుచుకొని ఉంది. దీనివల్ల కొందరు ఉన్నత స్థితికి చేరుకో గా, మరికొందరు అణగారిపోయారు. రాజ్యాంగం స్పష్టంగా కుల వివక్షను నిషేధించినప్పటికీ, మతపరమైన అహంకారం, సామాజిక మూఢ నమ్మకాలు ఇంకా కొందరిలో మార్పు రానీయకుండా అడ్డుపడుతున్నాయి.

అంగన్వాడీ టీచర్ పరిస్థితి దీనికి ఒక ఉదాహరణ. ఒక మహిళ, తన కృషితో పిల్లలకు విద్య అందించాలనుకుంటోంది. కానీ ఆమె కు లం కారణంగా ఐదేళ్లుగా ఆ గ్రామంలోని చాలా మంది తల్లిదండ్రు లు పిల్లలను పంపడంలేదని ఆమె చెబుతున్నారు. దీనివల్ల ఆ టీచర్ మనస్తాపం చెందడమే కాకుండా, చిన్నారులు విద్య అనే ప్రాథమిక హక్కు కోల్పోతున్నారు. వివక్ష ఎవరికి మేలు చేయదు. సమాజంలో ని ఏ వర్గాన్ని దూరంగా పెట్టిన మొత్తం సమాజం అభివృద్ధి చెందదు. సమానత్వం, సోదరభావం, న్యాయం అనే విలువలు కేవలం పుస్తకాల్లోనే మిగిలిపోతాయి. గ్రామీణ స్థాయిలో ఇటువంటి సంఘటనలు ఎక్కువగా చోటుచేసుకోవడం మన దేశ అభివృద్ధికి పెద్ద అడ్డంకి. మరి పరిష్కారం ఏమిటి? మొదటగా భారత రాజ్యాం గంపై ప్రజలకు అవగాహన అవసరం. పిల్లలకే చిన్న వయసులో సమానత్వం, సోదరత్వం విలువలు నేర్పాలి. విద్య ద్వారా మాత్రమే మనస్తత్వంలో మార్పు వస్తుంది. ప్రభుత్వ అధికారులు ఇటువంటి సంఘటనలకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుని, బాధితురాలికి న్యాయం చేయాలి. గ్రామస్థాయి నాయకులు, సంఘాలు ముందుకు వచ్చి ప్రజల్లో చైతన్యం కల్పించాలి. కుల వివక్షను కొనసాగించడం అనేది ఒక మనిషి గౌరవాన్ని కించపరచడమే కాకుండా, మన రాజ్యాంగానికి విరుద్ధం. మారుతున్న కాలానికి తగినట్లుగా మన ఆలోచనలూ మారాలి. ప్రతి మనిషిని ఒక మనిషిగా గౌరవించే మనస్తత్వం పెరిగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.


తరాలు మారినా, సాంకేతికత పెరిగినా, కుల వివక్ష అనే పాత భావజాలం ఇంకా కొందరిని విడిచిపెట్టడం లేదు. "ఎందుకింత వివక్ష?" అనే ప్రశ్నకు సమాధానం ఒక్కటే – మనసులు మారాలి, మన దృష్టికోణం మారాలి. సమానత్వమే నిజమైన మానవత్వం, అదే సమాజానికి శాశ్వత శ్రేయస్సు.

**-మహేష్ కుర్మ**
6305325021

# మానవ పూర్వ యుగ జీవన విధానం

# ఆధునిక వ్యవహార శైలి!

మానవ చరిత్రపూర్వంలో చాలా మందికి, మనుగడ అంటే స్థిరమైన కదలిక. మన పూర్వీకులు వేటగాళ్ళు -భావించే వారు, ప్రకృతి అందించిన వాటిని బట్టి - పండ్లు, అడవి ధాన్యాలు, మూలాలు జంతువులను బట్టి. జీవితం అనూహ్య మైనది, సీజన్లు మందల వలసలతో ముడిపడి ఉంది. అప్పుడు, సుమారు పదివేల సంవత్సరాల క్రితం, నిశ్శబ్ద విప్లవం ప్రారంభమైంది. సారవంతమైన మట్టిపై చెల్లాచెదురు గా ఉన్న విత్తనాలు పంటలుగా పెరుగుతాయని, జంతువుల ను వేటాడకుండా మచ్చిక చేసుకోవచ్చని మానవులు తెలుసుకున్నారు. ఈ ఆవిష్కరణ వ్యవసాయం యొక్క పుట్టుక ను గుర్తించింది - సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు నాగరికత యొక్క ప్రారంభ దశ.తొలి రైతులు విస్తారమైన పొలాలు లేదా సంక్లిష్ట సాధనాలతో ప్రారంభించలేదు. వారు ప్రకృతిని గమనించారు. ఆహారం ఎక్కడ పడిపోయిందో, జంతువులు సమృద్ధిగా ఆహారంతో ప్రాంతాలకు తిరిగి వస్తాయి. క్రమంగా, వారు సారవంతమైన నెలవంక (ఆధునిక ఇరాక్, సిరియా, టర్కీ), చైనాలో బియ్యం, భారతదేశంలో మిల్లట్లు, పప్పుధాన్యాలు వంటి గోధుమ బార్లీ వంటి మొక్కలను పెంపకం చేయడం ప్రారంభించారు. దానితో పాటు, గొర్రెలు, మేకలు, పశువులు వంటి జంతువులను మచ్చిక చేసుకుని, మాంసం, పాలు , శ్రమను అందిస్తారు.



ఆహార ఉత్పత్తికి ఈ మార్పు విప్లవాత్మకమైనది. ప్రజలు ఇకపై వేట, సేకరణ యొక్క అనిశ్చితిపై పూర్తిగా ఆధారపడలేదు. మొట్టమొదటిసారిగా, సంఘాలు ముందస్తు ప్రణాళికలు, ఆహార సరఫరాను పొందవచ్చు.

శాశ్వత స్థావరాలు, గ్రామాల పుట్టుక వ్యవసాయం మానవులను ఒకే చోట స్థిరపరచమని ప్రోత్సహించింది. ఆహారాన్ని వెతకడానికి బదులుగా, కుటుంబాలు సారవంతమైన భూములు, నీటి వనరుల దగ్గర శాశ్వత గృహాలను నిర్మించాయి. నైలు, సింధు, టైగ్రిస్ -యూఫ్రటీస్ వంటి నదుల పక్కన గ్రామాలు బయటపడ్డాయి, ఇక్కడ నేల గొప్పది, నీరు సమృద్ధిగా ఉంటుంది. ప్రారంభ సాధనాలు – త్రవ్వడం కర్రలు, చెక్క నాగలి, కొడవలి – ప్రాథమిక సాగును ప్రారంభించారు. కొన్ని సంఘాలు స్లాష్-అండ్-బర్న్ వ్యవసాయాన్ని అభ్యసించాయి, నేల యొక్క సంతానోత్పత్తి క్షీణించినప్పుడు భూమిని అగ్ని ద్వారా క్లియర్ చేయడం, కదిలించడం. పంటలను పెంచుకోవడం, రక్షించడం అవసరం కూడా నీటిపారుదల రూపాలకు దారితీసింది. ప్రజలు తమ పొలాలను పోషించడానికి ఛానెల్‌లను తవ్వారు, ప్రవాహాలను మళ్లించారు, వర్షపునీటిని నిల్వ చేశారు. ఈ చిన్న ఆవిష్కరణలు తరువాతి నాగరికతలలో పెద్ద ఇంజనీరింగ్ విజయాల కోసం విత్తనాలను విత్తాయి.సామాజిక మార్పు, నాగరికత పెరుగుదల

స్థిరమైన ఆహార సరఫరాతో మిగులు వచ్చింది – ఒక కుటుంబం తినగలిగే దానికంటే ఎక్కువ ధాన్యం. ఇది ప్రతిదీ మార్చింది. కమ్యూనిటీలు ఆహారాన్ని నిల్వ చేయడం ప్రారంభించాయి, ఇది పొరుగువారితో వాణిజ్యానికి దారితీసింది. కొంతమంది ఇప్పుడు వ్యవసాయానికి బదులుగా హస్తకళలు, కుండలు, నేయడం లేదా సాధన తయారీపై దృష్టి పెట్టవచ్చు. నెమ్మదిగా, ప్రత్యేక పాత్రలు, నాయకత్వ నిర్మాణాలు, అభివృద్ధి చెందుతున్న సామాజిక సోపానక్రమాలతో సమాజాలు మరింత క్లిష్టంగా మారాయి. పెద్ద జనాభాను పోషించే సామర్థ్యం నగరాలు, రాష్ట్రాలకు కూడా మార్గం సుగమం చేసింది. మెసొపొటేమియా, సింధు లోయ, పురాతన ఈజిప్ట్ వంటి నాగరికతలు వ్యవసాయ పునాదిపై అభివృద్ధి చెందాయి. రచన వ్యవస్థలు, పాలన మరియు సాంకేతిక పురోగతులు తరచుగా వ్యవసాయం మూలాలు తీసుకున్న చోట అనుసరిస్తాయి.

ప్రారంభ వ్యవసాయం సవాళ్లు లేకుండా లేదు. రైతులు అనూ హ్య వాతావరణం, తెగుళ్ళు, నేల అలసటతో పోరాడవలసి వచ్చింది. అయినప్పటికీ, వారి స్థితిస్థాపకత, ఆవిష్కరణలు – నీటిపారుదల నుండి పంట భ్రమణం వరకు – ఆధునిక వ్యవసాయానికి పునాది వేసింది. నేటి పారిశ్రామిక వ్యవసా యం, వాతావరణ ఆందోళనల యుగంలో, ఈ ప్రారంభ పాఠాలు సంబంధితంగా ఉన్నాయి: స్థిరత్వం, అనుసరణ, భూమి పట్ల గౌరవం ఇప్పుడు ఉన్నంత క్లిష్టమైనవి. శాశ్వత వారసత్వం:ప్రారంభ వ్యవసాయ వ్యవస్థ ఆహారాన్ని పొందడానికి కొత్త మార్గం కంటే ఎక్కువబీ ఇది మానవ పురోగతికి ఉత్ప్రేరకం. ఇది ప్రజలను ఇళ్లను నిర్మించడానికి, సంఘాలను రూపొందించడానికి సంస్కృతిని సృష్టించడానికి అనుమతించింది. ఇది వాణిజ్యం, కళ, విజ్ఞాన శాస్త్రం , పాలనకు దారితీసింది. అనేక విధాలుగా, ఆ మొదటి రైతులు నాటిన విత్తనాలు నేటికీ మన సమాజాలను పోషిస్తున్నాయి.

నేడు ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ ఆరోగ్య స్థితిని ప్రధానంగా కాలుష్య స్థాయిలు జీవవైవిధ్యం తాగినీటి నాణ్యత వంటివి తెలియజేస్తున్నాయి. జల,వాయు భూ కాలుష్యాలు పెరిగిపోతుండడం విశక్షణారహితంగా అడవుల నరికివేత జీవజాతులు అంతరించిపోవడం వంటి కారణాల వల్ల పర్యావరణ ఆరోగ్యం వేగంగా చేనిస్తుంది ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఒక్క వాయు కాలుష్యం వాళ్లనే ప్రపంచ వ్యాప్తంగా ఏటా దాదాపు 70 లక్షల మంది అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతున్నారు. కొంతకాలంగా తీవ్రమైన వాతావరణం మార్పులతో పర్యావరణ ఆరోగ్యం మరింతగా ప్రమాదంలో పడుతుంది. నేడు ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న కారు చర్చిలు తుఫానులు అకాల వర్షాలు విపరీతమైన ఎండల వల్ల పర్యావరణ ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది నీరుడు ఆగస్టులో ములుగు జిల్లా ఎటునాగా రం వన్యప్రాణి అభయారణ్యం తాడుబాయ్ మేడారం అటవీ ప్రాంతంలో సంభవించిన తుఫాను కారణంగా ఎనిమిది వందల ఎకరాలలో పైగా విస్తీర్ణంలో అడవులు నాశనమైనా యి. 85 వేలకు పైగా చెట్లు నేలకూలాయి. అడవుల నరికివేత వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయి. దానివల్ల పకృతి విపత్తులు పోటెత్తుతున్నాయి. గ తేడాది సెప్టెంబర్ లో వియత్నం లో వచ్చిన యాగి తుపాన్ భారీ ప్రాణ ఆస్తి నష్టాన్ని కలుగజేసింది. సుమారు 150 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచాయి. సముద్ర జలాలు మరింతగా వేడెక్కిపోవడం మనం గమనించవచ్చు. ఇటీవల పోర్చుగల్ లో తలెత్తిన కారు స్పిచ్ఛవల్ల 25 వేల ఎకరాల మేర అడవులు కాలిపోయినాయి. వాతావరణం మార్పుల కారణంగా సంభవించిన వేడిమి పొడి పరిస్థితులే కారు చిచ్చుల పెరిగిపోవడానికి ఆజ్యం పోస్తున్నాయి. లాండ్ సెంట్ అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఆహార పంటలు దిగుబడులను అధిక ఉష్ణోగ్రతలు ప్రభావితం చేస్తున్నాయి. 1981- 2010 మధ్యకాలంలో పోలిస్తే 2020లో మొక్కజొన్నలో ఆరు శాతం చేతల కాలపు గోధుమ పంటలు మూడు శాతం సోయాబీన్ 5.4% వరిలో 1.8% మేరా దిగుబడులు తగ్గాయి మానవాళికి పెరుగుతున్న ఆహార భద్రతకు ఈ గణాంకాలు అద్దం పడతాయి. కంటికి కనిపించని సుభక్ష జీవులు మొదలుకొని తిమింగలాలు భారీ వృక్షాల వరకు అన్ని పర్యావరణంలో భాగమే. ఆయా ఆవరణ వ్యవస్థ పేరే కలపాల మూలంగా ఆవరణ వ్యవస్థలో తలెత్తే మార్పుల వల్ల ఎలాంటి విషపరిణామాలు దాపురిస్తాయో కోవిడ్ 19 అనుభవాలు చాటి చెబుతున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పులు వల్ల బిరియా బెస్ట్ నైల్ నైరస్ డెంగు చికెన్ గున్యా జింక మలేరియా తదితర వ్యాధి కారక జీవులు వాటిలో ఐరోపాలో పెరిగాయని లాన్సెంట్ అధ్యయనం వల్ల వెల్లడయింది. భూమిపై సహజంగా జీవ వైవిధ్యం వ్యాపించి ఉన్న ప్రాంతాలలో పోలిస్తే మానవ చర్యల వల్ల అది దెబ్బతిన్న చోట వ్యాధులు అకాల మరణాలు తొమ్మిది రేట్లు ఎక్కువ అని మరో పరిశోధన తెలియజేస్తుంది. జీవుల మనుగడ ప్రమాదంలో పడకుండా పర్యావరణ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన అందరి తప్పనిసరి బాధ్యత. ఇందుకోసం అడవుల పరిరక్షణ చేపట్టాలి పర్యావరణ పరిరక్షణ అవశ్యకతపై ప్రతి ఒక్కరిలో తగిన అవగాహన కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

తెలంగాణ సంస్కృతికి సంప్రదాయాలకు నిలువెత్తు రూపం, నిలువెత్తు నిదర్శనం.. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబం మన బతుకమ్మ పండుగ వాతావరణం.. బతుకమ్మ కవిత రచనలు..

## తెలంగాణ పూల జాతర

# బతుకమ్మ

తెలంగాణ తల్లి ఒడిలో పూసిన పూలదండ,
ఆడవాళ్ల మనసుల్లో వెలసిన బతుకమ్మ పండుగ.
తల్లి జ్ఞాపకం, మమత పరిమళం,
ప్రతి పువ్వులో నిండి ఉన్న జీవన స్ఫూర్తి కలగలిపిన.

గున్నెపువ్వు గులకర్రగా నిలిచి ఆశలతో,
బంతి పువ్వు వెలుగులా మెరిసి భవిష్యత్తుతో.
మల్లెపువ్వు పరిమళంలా చెల్లెలి నవ్వుతో,
గుమ్మడిపువ్వు సిరిసంపదల సందేశమై.

ఆడవాళ్లకు బతుకమ్మ అనుబంధం అమూల్యం,
తల్లి చాటున పూసిన చిగురులా మధురం.
కూతుళ్ల కలలు కడుపుకోతలో దాచుకున్న రహస్యం,
పూల జాతరలో చెలరేగే ఆవేశం, ఆత్మగౌరవం
కోలాటల కేరింతలతో పల్లెలు మ్రోగుతాయి,
జానపద గీతాలతో వీధులు పులకరిస్తాయి.
చెల్లెమ్మల చేతుల్లో బతుకమ్మ పూసుకుంటే,
గుండెల్లో గుబాళించిన భక్తి వెలుగుతాయి.

బతుకమ్మ అంటే పూల జాతర కాదు కేవలం,
అది స్త్రీ హృదయ గాథ, ఆత్మ విశ్వాస జ్ఞాపకం.
అమ్మని స్మరించే త్యాగ గీతం,
తెలంగాణ తల్లికి శిరసువంచే పూల సమర్పణం.

**రైటర్ రాజు**
(యువ కవి – అరుణ రైటింగ్స్)
తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్.



# నిజాం గుండెల్లో భయాన్ని సృష్టించిన వీర యోధుడు బాపూజీ

- మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు

**హయత్‌నగర్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** మన ఆలోచన సాధన సమితి మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు ఆధ్వర్యం లో చేనేత ముద్దుబిడ్డ, స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమ కారులు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి వేడుకలు మాస్ ప్రధాన కార్యాలయం లో దుడుకు గోవర్ధన్ గారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా ఓయూ మాజీ వైస్ ఛాన్స్ లర్ లు ప్రొఫెసర్ శ్రీరామదాసు, రామచంద్రం లు హాజరై బాపూజీ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు మాట్లాడుతూ చేనేత పద్మశాలి కులలే కాక బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తూ ఆదర్శ మంతమైన జీవితాన్ని కొనసాగించారని వారు అన్నారు. ఆనాడు నిజాం వ్యతిరేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొని నిజాం గుండెల్లో భయాన్ని సృష్టించిన వీర యోధుడు, 96 సంవత్సరాల వయసులో తీవ్ర చలిని లెక్క చేయకుండా ఢిల్లీలో దీక్ష చేయడం జరిగిందని వారు తెలిపారు. అటువంటి ఆదర్శ ఉద్యమకారున్ని స్ఫూర్తిగా, నేటి



తరాల బాధ్యత కాబట్టి నేటి సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి కొండా లక్ష్మణ్ బాపూజీ గారి స్ఫూర్తి ఎంతో అవసరం అని వారు పేర్కొన్నారు. ఆ మార్గంలో ప్రయాణించాలని మన ఆలోచన సాధన సమితి (మాస్) ప్రయత్నం చేస్తుందని అలాగే బీసీ కులాలలో చైతన్యం, బీసీ భావజాల వ్యాప్తి జరగాలి దీనికి బీసీ కులాలలో ఉన్న మేధావులు, విద్యావేత్తలు ఉద్యోగులు ముందుకు రావాలి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాస్ గౌరవాధ్యక్షులు, గడ్డం నరసింహ గౌడ్, దొంత ఆనందం, పూస నరసింహ, నేరెళ్ల దేవేందర్, మాస్ సలహా మండలి సభ్యులు ప్రొఫెసర్ తడక యాదగిరి, హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ బురం శంకర్, తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గోషిక యాదగిరి, రాష్ట్ర సచివాలయ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తిరందాసు యాదగిరి, తెలంగాణ లెక్చరర్ ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అమృతం మార్కండేయ, ఎల్.పి.టి మార్కెట్ అధ్యక్షులు కోమటి సత్యనారాయణ, హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్, ఫార్మా డి కంపెనీ యజమాని మిరియాల శేషయ్య, పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్, ఆఫీసర్ అసిస్టెంట్ స్టేట్ ఎలక్షన్ ఆఫీసర్ కుర్రే సత్యనారాయణ, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షులు గోపి రజక,, ఆర్టీసీ రాష్ట్ర బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న హరికిషన్, మాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య, కొంపోజు నరహరి చారి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చుక్కల సత్యనారాయణ గంగపుత్ర, రాష్ట్ర కార్యదర్శి శ్రీగాది కృష్ణయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఆవుల వెంకట యాదవ్, రాష్ట్ర కార్యదర్శి గునిగంటి చంద్రశేఖర్ గౌడ్, సిలువేరు శంకర్, కోశాధికారి నాంపల్లి రవి, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జ్ మహంకాళి సదాశివుడ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద లింగస్వామి గౌడ్, సుంచు శ్రీనివాస్, పద్మశాలి కుల సంఘం నేతలు, మేధావులు, విద్యావేత్తలు, బీసీ ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం ప్రత్యేక కృషి



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహించిన 11 వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల ఫుట్ బాల్ టౌర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహబూబ్ నగర్ ను స్పోర్ట్స్ హబ్ గా అభివృద్ధి చేసుకోవల్సిన అవసరం ఎంతైన ఉందని, జిల్లాలో ఉన్న క్రీడా ప్రేమికులు ఏ క్రీడలను ఎంచుకున్న వారిని ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. క్రీడల్లో గెలుపు ఓటమి సహజమే అని ఓడిన జట్టు మరింత శ్రమించి వచ్చే సంవత్సరం విజయాన్ని సొంతం చేసుకోవాలి అని ఆయన సూచించారు. రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ టౌర్నమెంట్ పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు ఫుట్ బాల్ అసోసియేషన్ జిల్లా బాధ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్.పి.వెంకటేష్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సంజీవరెడ్డి, జి.పి.ఫల్గున, రంగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్ నిర్మూలనకు పోరాడుదాం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** భగత్‌సింగ్ ఆశయ సాధనకై పోరాడుదామని పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు ప్రతాప్, మాస్ లైన్ పార్టీ జిల్లా నాయ కులు యాదగిరి పిలుపుని చ్చారు.భగత్ సింగ్ 118 వ జయంతి సందర్భంగా కోట కొండ గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు ప్రతాప్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు యాద గిరి మాట్లాడుతు దేశం కోసం 29 ఏళ్లకే ఉరి కంబాన్ని ముద్దాడి బ్రిటిష్ వారి గుండె ల్లో వణుకు పుట్టించిన నిజ మైన దేశ స్వాతంత్ర భక్తుడు షహీద్ భగత్ సింగ్ అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని దేశంలో సాగుతున్న అమెరికా సామ్రాజ్యవాదం, గంజాయి మత్తు డ్రగ్స్ లాంటి వాటికి వ్యతిరే కంగా యువత పోరాడాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్ర మంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ డివిజన్ నాయకులు హాజీ, పి వై ఎల్ నాయకులు అంజి జి.మీరు, పివైఎల్ జిల్లా మాజీ నాయకులు ఇస్మాయిల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుభాష్ ,రాజు, జి. వెంకట్ రాములు, మిట్టే కాశీం ,బి.మహమ్మద్ రఫీ, బి. మౌలాలి, జి రాఘవేంద్ర , రామచందర్ పాల్గొన్నారు.

# హాస్టల్ ముందు వర్కర్ల ఆందోళన

- సమస్యలు పరిష్కరించేవరకు ఉద్యమిస్తాం

**మెదక్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీ వైజ్, కాంటినిజెంట్ వర్కర్ల జేఏసి ఆధ్వర్యంలో వర్కర్లు ఆదివారం మెదక్ లోని హాస్టల్ ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా డైలీ వేజెస్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు దొడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ 212 జీవో ను సవరించి 2014 నాటికి ఐదేండ్లు సర్వీస్ ఉన్న వారందరిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు ట్రెజరీ లకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ పెరిగిన పనిభారానికి అనుగుణంగా కార్మికులను పెంచలన్నారు. పూర్తికాలం పనిచేస్తున్న కార్మికులకు పూర్తి వేతనాలు ఇవ్వాలన్నారు. విద్యార్థులతో పాటు కార్మికులకు కూడా రెండు జతల యూనిఫాం, ఐడి కార్డులు ఇవ్వాలన్నారు.కార్మికులకు రూ 10 లక్షల ప్రమాద భీమా కల్పించాలని కోరారు.ఏండ్ల తరబడి అనేక సమస్యలతో సతమతమవుతున్నామని, వేంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం యూనియన్ ప్రధాన కార్యదర్శి జె. సునంద కోశాధికారి ఏ. మాధవి సలహాదారు నూనె శేఖర్ ఉపాధ్యక్షులు డి. సువర్ణ సభ్యులు భూలక్ష్మి,జ్యోతి, పెంటమ్మ,రజిత,కిషన్,సురేష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# గులాబీ దళాలతో దద్దరిల్లిన అచ్చంపేట జనభేరి



**అచ్చంపేట, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** పట్టణంలో టిఆర్ఎస్ పార్టీ జనభేరి సభకు ముఖ్య అతిథిగా హాజరై కేటీఆర్ మాట్లాడుతూ అచ్చంపేట ప్రజలకు ఉన్న సోయి నల్లమల్ల బిడ్డని సీఎం రేవంత్ రెడ్డికి లేదని రేవంత్ రెడ్డి అన్న తమ్ముళ్లే రాష్ట్రాన్ని దోచేస్తున్నారని జిల్లాలో ఉన్న మంత్రి కూడా సోయి లేకుండా మాట్లాడుతున్నాడని సీఎం పుటోకో మాట మాట్లాడుతున్నాడని ఆయన ఒక అపరిచితునిగా ప్రవర్తిస్తున్నాడని ప్రజలను గందరగోలుగానికి గురి చేసే ప్రసంగాలను చేస్తున్నాడని ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని 6 గ్యారంటీల హామీ పత్రాన్ని చూపిస్తూ గడ గడపగడపకు రాఖీ కదులతో కాంగ్రెస్ నేతలను ప్రశ్నించాలని వస్తా రేపటి స్థానికని ఎన్నికల్లో వారు డబ్బు పంచితే తీసుకోవాలని తీసుకున్నాక అప్పు ఇంకా ఉంది మీరే ఇవ్వాలని ప్రజలు నిలదీయాలని స్థానిక ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మీ సత్తా చూపించాలని అచ్చంపేట ప్రజల అభిప్రాయం మేరకే మీ నాయకుడు కేసీఆర్ అచ్చంపేటకు ఒక నాయకుని నియమిస్తారని గుర్తు చేశారు ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్ పూర్తయిన అటు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ను కనీసం 10 శాతం పూర్తి చేయకుండా ఈ ప్రాంత బిడ్డ అని సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టులను ఎందుకు వదిలివేశారని సూటిగా ప్రశ్నించారు మాట ఇచ్చి తప్పించుకుంటున్న ఏ నాయకుడైన అచ్చంపేట నుండి బొంద పెడతామని అందుకు అచ్చంపేట నుండి రాష్ట్రంలో స్థానిక సంస్థల నగర ప్రారంభమైందని కేటీఆర్ ప్రకటించారు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్ నిరంజన్ రెడ్డి లక్ష్మారెడ్డి. ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి జైపాల్ యాదవ్ సభాధ్యక్షుడు మర్రి జనార్దన్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీలు నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శ్రీకాంత్ బీమా పోకల మనోహర్ నరసింహ గౌడ్ పర్వతాలు వేలాదిగా తరలివచ్చిన టీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు వేలాదిమంది పాల్గొన్నారు.

## శరవేగంగా పోచమ్మకుంట చెరువు కట్ట అభివృద్ధి పనులు



**బోడుప్పల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17 డివిజన్,5వ డివిజన్ లకు మధ్య అనుసంధానంగా ఉన్న పోచమ్మ కుంట కట్టపై హెచ్ఎండిఏ నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎండిఏ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి రోడ్డు పనులను పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ మేడిపల్లి నుండి పర్వతాపూర్ వెళ్లే ప్రజలకు ముఖ్యంగా 17వ డివిజన్,5వ డివిజన్ వాసులకు అత్యంత సౌకర్యవంతంగా ఉండేందుకు పోచమ్మ కుంట కట్టను అభివృద్ధి చేసి హెచ్ఎండిఏ నిధులతో నూతన సిసి రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయని హర్షం వ్యక్తం చేస్తూ,రోడ్డు అభివృద్ధిలో ప్రత్యేకంగా సహకరించిన హెచ్ఎండిఏ అధికారులు అప్పారావు ఈ ఈ, వేణుగోపాల్ డి ఈ, రమేష్ ఏఈ,కాంట్రాక్టర్ సూపర్వైజర్ బాలకృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులైన ఏఈ, ఈడీ, కమిషనర్ అలాగే ఇరిగేషన్ అధికారులైన ఏఈ, ఈడీ, ఈ ఈ, తదితరులకు తుంగతుర్తి రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హెచ్ఎండిఏ ఈ ఈ అప్పారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అభివృద్ధి పనులను పర్యవేక్షించిన హెచ్ఎండిఏ ఈ ఈ అప్పారావు మాట్లాడుతూ పోచమ్మ కుంట చెరువు కట్ట అభివృద్ధిలో భాగంగా వేస్తున్న సిసి రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయని,అదేవిధంగా పీర్జాగూడ కార్పొరేషన్ పరిధిలోని పెండింగ్లో ఉన్న పనులను కూడా త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# నేలకొరిగిన పసుపు పంట

- కౌలు రైతు బాధ ఎవరికి చెప్పుకోవాలి
- లక్షా యాభై వేల రూపాయలు పెట్టుబడి నష్టం
- దిక్కుతోచని స్థితిలో రైతు



**కోట్‌పల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** రైతుకు సొంత భూమి ఉండి పెట్టుబడి పెట్టే రైతులకే నేటి కాలంలో పెట్టిన పెట్టుబడి రాక మన అవస్థలు ఎదుర్కొంటుంటారు. కానీ చేసుకోడానికి భూమి లేక వేరే రైతుల భూమిని కౌలు కి వేసుకుని వ్యవసాయం చేసుకునే రైతుల కష్టాలు అగమ్యగోచరం . కోటపల్లి మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలోని అంతమ్మ అనే రైతు పొలాన్ని ఎన్నారం గ్రామానికి చెందిన రైతు కౌలుకు వేసుకుని సర్వే నెంబర్ 40 లో ఎకరం వరకు పసుపు పంటను వెయ్యడం జరిగింది ఈ పసుపు పంట మంచి ఎదుగుదల ప్రారంభమయ్యే సమయానికే అకాల వర్షాలు ముంచెత్తి సర్వనాశనమైంది ఉన్న డబ్బులన్నీ ఇప్పటి వరకు దాదాపు లక్ష యాభై వేల రూపాయలు పంట పెట్టుబడికి పెట్టుకున్నాను ఇప్పుడు పెట్టీ పెట్టుబడి పాయె ఎదిగి చేతికొచ్చే పంటా పాయె ఇప్పుడు ఏం చెయ్యాలని లబోదిబోమంటున్న రైతు ఆ రైతు ఈ రైతు గోసను చూసిన చుట్టుపక్కల రైతులు సైత ప్రభుత్వం నుండి ఏదైనా పంట నష్ట పరిహారం కింద మండల, గ్రామ స్థాయి వ్యవసాయ అధికారులు ఈ రైతు పట్ల వారు పెట్టిన పెట్టుబడిని దృష్టిలో ఉంచుకుని నష్టానికి తగినవిధంగా ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందేలా ప్రయత్నం చేస్తే బాగుంటదినీ పలువురు కొనియాడారు.

## పూజలతో మానసిక ప్రశాంతత



**అల్వాల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** దేవుళ్లను పూజించడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం అల్వాల్ లోతుకుంటలో బాని సంఘం ఆధ్వర్యంలో దుర్గామాత పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో దుర్గామాత వేడుకలు కన్నుల పండుగలా జరుగుతున్నాయని, ఉత్తర-దక్షిణ భారతీయ సంస్కృతుల సమ్మేళనంగా ఈ వేడుకలు నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఐదు రోజులపాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో బాని సంఘం సభ్యులు బాబీ, కార్యనిర్వాహక అధికారి ఆశిష్, బోస్, బీజేపీ నాయకులు చింతల మాణిక్యరెడ్డి, మల్లికార్జున్ గౌడ్, కార్తీక్ గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- విశిష్ట వ్యక్తులకు ఘనంగా సన్మానం
- పలువురు బిజెపి నేతలు

**తాండూరు, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** సమాజంలో విశిష్ట వ్యక్తులను గుర్తించి, వారందరినీ ఒకే వేదిక పైకి తీసుకుని దేశ అభివృద్ధి ప్రగతి పథంలో భాగస్వామ్యం చేయాలని సంకల్పమే బిజెపి లక్ష్యమని బిజెపి నేతలు పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ దేశ ప్రధానమంత్రి మోడీ జన్మదిన ఉత్సవాలలో భాగంగా పార్టీ చేపట్టిన సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం తాండూర్ పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో విశిష్ట వ్యక్తుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర గుప్తా హాజరయ్యారు.ఈ సందర్భంగా తాండూరు నియోజకవర్గంలో వివిధ రంగంలో ఉత్తమ సేవలందిన వారిని బిజెపి పార్టీ గుర్తించి, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో సుమారు 50 మంది విశిష్ట వ్యక్తులకు సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నేతలు మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ, పథకాలు ప్రపంచ దేశాలకు సైతం విస్తరించాయని అన్నారు. సమాజంలో విశిష్ట సేవలు చేస్తున్న వ్యక్తులనందరిని ఏకధాటి పైకి తీసుకుని వచ్చి దేశ అభివృద్ధి లో విశిష్ట వ్యక్తులు భాగస్వామం కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి. మాజీ అధ్యక్షులు సదానంద రెడ్డి.సీనియర్ బిజెపి నాయకులు మనోహర్ , పెద్దింటి నవీన్ కుమార్, బాలి శివ కుమార్ , జిల్లా ప్రధాన కార్యదర్శిపటేల్ విజయ్ కుమార్. గాజుల శాంతు కుమార్,



సుదర్శన్ గౌడ్, ఉపాధ్యక్షులు సాయిరెడ్డి నరేందర్ రెడ్డి. ఉపాధ్యక్షులు జుంటుపల్లి వెంకటేష్, కార్యదర్శి బొప్పి శ్రీహరి, ఓబీసీ మోర్చా జహిర్ అబ్బాస్, మైనారిటీ మోర్చా ఘనపూర్ వెంకటయ్య సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
29 సెప్టెంబర్ 2025

# భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత అవినీతిపై ఉద్యమించాలి

సిద్దిపేట, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : విప్లవ వీర కిశోరం, భారత స్వాతంత్ర్య సమర యోధుడు షాహిద్ భగత్ సింగ్ పోరాట పటిమ స్ఫూర్తిగా తీసుకుని నేటి విద్యార్థి,యువకులు పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై ఉద్యమించాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు.. ఆదివారం రోజున సిద్దిపేట జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా జయంతిని పురస్కరించుకొని సీపీఐ పార్టీ నాయకులతో కలిసి భగత్ సింగ్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ భగత్‌సింగ్ నూనూగు మీసాల యుక్త వయసులో బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే అలుపెరుగని పోరాటం చేసి ఉరికంబన్నీ సైతం నవ్వుతూ ముద్దాడి ప్రాణత్యాగం చేసిన గొప్ప విప్లవకారుడని అన్నారు..12 ఏళ్ల వయస్సులో గాంధీ చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమానికి ఆకర్షితుడై 23 ఏళ్ల వయస్సు లో దేశం కోసం అమరుడు అయ్యారని,భగత్ సింగ్ చరిత్ర ను పాఠ్య పుస్తకాల్లో చేర్చి బాతరాలకు ఆయన ఉద్యమ స్ఫూర్తి తెలియజేయాల్సిన ఈ బీజేపీ ప్రభుత్వం చరిత్రను




వక్రీకరిస్తుందని, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ ముష్కరుల బానిసలుగా ఉన్న దేశ ద్రోహులను దేశ భక్తులగా చేపుతుందని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరులను దేశ ద్రోహులు గా చిత్రీకరణ చేస్తుందని మండిపడ్డారు. కులాల మధ్య,మతాల మధ్య విద్వేషాలను రెచ్చ గొడుతూ రాజకీయాలు చేస్తుందని, భగత్‌సింగ్ మతోన్మాదం ఈ దేశానికి చాలా ప్రమాదకరమైనదని నాడే చెప్పారని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా పౌరసత్వ చట్టం, సిఏఏ అమలు చేస్తూ ప్రజలను మతాలవారీగా విడదీసి ఎన్నికల్లో లబ్ది పొందాలని బిజెపి ప్రయత్నం చేస్తుందని,ఈ మతోన్మాద ఆలోచనలు తిప్పి కొట్టాలని అన్నారు. భగత్ సింగ్ ఈ దేశంలో కుల ,మత ,పేద ,ధనిక తారతమ్యాలు లేకుండా బ్రతకాలంటే సోషలిజమే మార్గమని చెప్పారన్నారు. ఆయన పోరాట పటిమను విద్యార్థులు,యువకులు ముందుకు తీసుకెళ్తూ విద్యార్థులు,యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని, బీజేపీ, మోడీ నిజమైన దేశభక్తులైతే భగత్ సింగ్‌కి భారతరత్న ఎందుకు ప్రకటించలేదొ చెప్పాలని,కేంద్ర ప్రభుత్వం భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూభగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు,యువత పోరాడాలనీ ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్ జిల్లా నాయకులు గజభీంకర్ బన్సీలాల్, కర్నాల చంద్రం, వేల్పుల ప్రసన్నకుమార్, మిట్టపల్లి సుధాకర్ రామగళ్ళ నరేష్, కొమ్ముకనకరాజు, పరుశారాం, బాబు, మహేష్, రాజు, స్వామి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి స్వచ్ఛ జలాలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అమీన్‌పూర్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : ప్రతి ఇంటికి స్వచ్ఛ జలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట మైత్రి విల్లాస్ కాలనీలో ఆదివారం ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీటి సరఫరాను ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమీన్పూర్ మున్సిపాలిటీ తో పాటు నూతనంగా మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల పరిధిలోని కాలనీలకు సైతం స్వచ్ఛ జలాలు అందిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు నూతన రిజర్వాయర్లు నిర్మించినట్లు తెలిపారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సిఐ నరేష్, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, రాజు, శ్రీకాంత్, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ కిరీటి జాతీయ పురస్కారం అందుకున్న బసవరాజప్ప



మల్దకల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : హైదరాబాద్ లో బిర్లా ఆడిటోరియంలో ప్రపంచ తెలుగు,సంస్కృతిసంస్థ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 155వ సాహితీ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది.సాహిత్య సేవ చేసిన కవులకు,రచయితలకు, కళాకారులకు సాహితీ కిరీటి పురస్కారాల ప్రదానోత్సవ నిర్వహించారు.తెలుగుభాష, సంస్కృతీ,కళలు,సాహిత్యం, భావితరాలకు వారసత్వంగా అందించాలని సాహితీ కిరీటి పురస్కారాన్ని మల్దకల్ గ్రామ నివాసిఅధ్యాపకులు,కవి,సుంకరి బసవరాజప్పకి శ్రీ కళావేదిక సంస్థ సి.ఇ.ఓ కత్తిమండ ప్రతాప్,ప్రత్యేక అతిథి తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగాకవి,విమర్శకులు డా,నాళేశ్వరం శంకర్ అందజేశారు.ఈ కార్యక్రమంలోవిమల సాహిత్య వేదిక అధ్యక్షుడు కవి,రచయిత జెల్ది విద్యాధర్, శ్రీనాథుడు వంశీయులు డా, కావూరు శ్రీనివాసశర్మ, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం,కార్యవర్గ సభ్యులు, డా, సతీష్ ఎర్ర, గరిమెళ్ళ రాజేంద్రప్రసాద్,డేబావిజయ్ కుమార్ ,వైకరుణాకర్ రావు, కవులు,రచయితలు, కళాకారుల పాల్గొన్నారు.

# సమాజ సేవలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరం

- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 15 మంది దివ్యాంగులకు త్రిచక్ర సైకిళ్ళ పంపిణీ

అమీన్పూర్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : సమాజ సేవలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం మరింత పెరగాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం అమీన్పూర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. డొనేట్ కార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అందించిన 15 త్రిచక్ర సైకిళ్లను. ఎమ్మెల్యే చేతుల మీదుగా దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు అండగా నిలుస్తూ డొనేట్ కార్ట్ స్వచ్ఛంద సంస్థ త్రిచక్ర సైకిళ్లు అందించడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. గతంలో నియోజకవర్గ పరిధిలోని 500 మంది దివ్యాంగులకు ఐదు కోట్ల రూపాయల సొంత నిధులతో యాక్టివా వాహనాలు అందించామని గుర్తు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ దివ్యాంగులకు సముచిత ప్రాధాన్యత



అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ జ్యోతి రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.


## రాష్ట్రస్థాయి జెట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డుకు ఎంపికైన గిరిబాబు



నంగునూరు, సెప్టెంబరు 28 (జనం సాక్షి) : జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ అందించే రాష్ట్ర స్థాయి జెట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డుకు సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెందిన దేవులపల్లి గిరిబాబు ఎంపికయ్యారు. సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురవన్నపేట ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుని (ఎస్జీటీ)గా పనిచేస్తున్న దేవులపల్లి గిరిబాబు సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్,డిగ్రీ చదివిన అనంతరం సురవరం ప్రతాపరెడ్డి(పూర్వ పొట్టి శ్రీరాములు) తెలుగు విద్యాలయం నుంచి థియేటర్ ఆర్ట్స్ లో పీజీ చేశారు. రంగ స్థలం, టీ వీ కళాకారుడిగా ప్రసిద్ధి చెందారు. పలు లఘు చిత్రాల్లో నటించారు. టీటీసీ చదివి ఎస్జీటీ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. కళాకారుడిగా ప్రసిద్ధి చెందిన గిరిబాబు విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలను కళలను మేళవించి ఆకర్షణీయంగా బోధిస్తున్నారు. ఉత్తమ బోధనతో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. గిరిబాబు బోధన చేస్తున్న పాఠ్యాంశాల వీడియోలు యూట్యూబ్ లో విశేష ఆదరణ పొందాయి. ఈ వీడియోలను పరిశీలించిన హైదరాబాద్ లోని జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ గిరిబాబును జెట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు – 2025 కు ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 50 మంది ఉపాధ్యాయులను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 29 వ తేదీన సికింద్రాబాద్ లోని హరిహర కళాభవన్ లో ఈ పురస్కారాన్ని అందివ్వనున్నారు.

# సింగూర్ బ్యాక్‌వాటర్‌తో ప్రమాదకరంగా చీకూర్తి - చాల్కి వంతెన

- 24 గంటలకు పైగా నిలిచిన రాకపోకలు
- వేలాది ఎకరాల్లో నీట మునిగిన పంటలు



న్యాల్‌కల్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : తెలంగాణ – కర్ణాటక సరిహద్దు, సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, చీకూర్థి – చాల్కి లోతట్టు వంతెన పెను ప్రమాదకరంగా మారింది. సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తో పాటు కర్ణాటక, మండలంలోని వివిధ ప్రాంతాల నుండి భారీగా వచ్చిన వరద ఉధృతి వంతెనపై దాదాపు ఐదారు అడుగుల ఎత్తులో వరదనీరు వచ్చిచేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శుక్రవారం రాత్రి అతిభారీ వర్షం, శనివారం కురిసిన వర్షంతో పాటు సింగూరు ప్రాజెక్టు (మంజీరా నది) బ్యాక్ వాటర్ భారీగా వచ్చిచేరడంతో మండలంలోని కాకిజనవాడ, అమీరాబాద్, చాల్కి, చీకూర్తి, హుస్సేన్ నగర్, ముర్తుజాపూర్, రాఘవపూర్, తదితర గ్రామాల్లోని మంజీరా నది పరివాహక ప్రాంతంలోని వేలాది ఎకరాల్లో పలు పంటలు నీటమునిగాయి. ప్రధానంగా రైతులు, కౌలు రైతులు సాగుచేసిన పత్తి, కంది, సోయాబీన్, తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వంతెనపై భారీగా వరద నీరు వచ్చి చేరడంతో బీదర్, జహీరాబాద్, నారాయణఖేడ్, న్యాల్ కల్, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, వాహన చోదకుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరద ఉధృతిని తెలుసుకున్న స్థానిక ఎస్సై సుజిత్, ఇన్చార్జి తహసిల్దార్ రాజిరెడ్డి పర్యవేక్షణలో భద్రతను ఏర్పాటు చేశారు. వేలాది ఎకరాల్లో వివిధ రకాల పంటలు నీట మునగడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే పరిశీలించి ఆదుకోవాలని బాధిత రైతులు వాపోయారు.

## దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ స్ఫూర్తి కావాలి



వనపర్తి టౌన్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : దేశ స్వాతంత్రం, సమసమాజ ఆశయం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రజల కోసం పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. వనపర్తి సిపిఐ ఆఫీస్ వద్ద షాహిద్ భగత్ సింగ్ 118 వ జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి శివ తదితరులు మాట్లాడారు. 23 ఏళ్ల వయసులో స్వాతంత్రం కోసం భగత్ సింగ్ పోరాడారన్నారు. బ్రిటీష్ పార్లమెంటులో పొగ బాంబులు వేసి స్వాతంత్రం నా జన్మ హక్కు అని నినదించిన అసమాన ధైర్యశాలి భగత్సింగ్ అన్నారు. క్షమాపణ కోరితే ప్రాణం పిచ్చి పెడతామని బ్రిటిషర్లు కోరిన, కుటుంబ సభ్యులు అభ్యర్థించిన ఆయన క్షమాపణ కోరని ఆయన ధైర్యం స్వాతంత్రంపై ఆయన చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు.ఇంక్విలాబ్ జిందాబాద్ అన్న ఆయన నినాదం ఇప్పటికి దేశ ప్రజల గుండెల్లో ధ్వనిస్తూనే ఉందన్నారు. బ్రిటిష్ వాళ్ళను తరిమికొట్టిన ఆయన సమసమాజ ఆశయం నెరవేరలేదని దేశంలో నిరుద్యోగం దారిద్ర్యం పేదరికం ఉన్నాయన్నారు. ప్రజలు ఎన్నో సమస్యలతో బాధపడుతూ ఉన్నారని వాటి పరిష్కారానికి పోరాడాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, గోపాల్, గోపాలకృష్ణ, జయమ్మ శిరీష జయ శ్రీ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలి

- డ్రగ్స్ గంజాయి వ్యతిరేక సమాజాన్ని నిర్మిద్దాం
- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్


నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : జిల్లా కేంద్రంలో స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో షాహిద్ భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరహరి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారు మాట్లాడుతూ భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలని, భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 27న జన్మించారనీ అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్ట్ విప్లవకారుడు, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడారు.లాహోర్ కుట్ర కేసులో భాగంగా అసెంబ్లీలో బాంబు విసిరి, బ్రిటిష్ పాలకులచే 23 మార్చి 1931న ఉరితీయబడ్డారు. విద్యార్థులు చదువుకునే దశలో అంతటి సంకల్పంతో విద్యారంగంలో ముందుకు వెళ్లాలని, యువత భగత్ సింగ్ ఆశయాలతో ముందుకు సాగాలి




మాదకద్రవ్యాల పై వ్యతిరేకంగా పోరాడాలి అని అన్నారు.ఈ సమాజాన్ని డ్రగ్స్ వ్యతిరేక సమాజాన్నిగా తీర్చిదిద్దే బాధ్యత ఈ యువత పైన ఉందని వారన్నారు కాబట్టి డ్రగ్స్ నిర్మూలన చేసే కర్తవ్యాన్ని భగత్ సింగ్ తెగువతో యువత తీసుకొని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కృష్ణ, శివ, వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం బీజేపీ పార్టీని బలోపేతం చేయాలి

- రాష్ట్ర బీజేపీ నేత నామాజీ



నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లా లో నూతన బిజెపి కార్యవర్గం పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని బిజెపి రాష్ట్ర సీని యర్ నేత, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్ ఆధ్వర్యంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శులు తిరుపతి రెడ్డి,లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్,బలరాం రెడ్డి లతో పాటు బిజెపి సీనియర్ నేత నాగురావు నామాజీ, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు పి శ్రీనివాసులును శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాగురావు నామాజీ మాట్లా డుతు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అందరూ కలిసి కట్టుగా కృషి చేసి జిల్లాలో బిజెపిని పటిష్టం చేయడానికి కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బిజెపి జెండా ఎగుర వేయాల ని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ ఉపాధ్య క్షుడు మదన్,జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ, నాయకులు ప్రభంజాన్, మోగులప్ప, కిరణ్, సూర్య కాంత,పట్టణ బి జె వై ఎం అధ్యక్షుడు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## సోనీ మొబైల్స్ షాప్ ప్రారంభించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : పెబ్బేరు పట్టణ కేంద్రంలోని సుభాష్ చంద్ర బోస్ చౌరస్తా లో వడ్డె రమేష్ ఏర్పాటు నూతన సోనీ మొబైల్ షాప్ ను మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. వడ్డే రమేష్ బ్రదర్స్ కు శుభాకాంక్షలు తెలిపి, ఆల్ ది బెస్ట్ చెప్పారు. మీ వ్యాపారం రోజు రోజు కి అభివృద్ధి చెందాలని, యువత కూడా గవర్నమెంటు జాబులు అనకుండా వ్యాపారాల్లోకి కూడా రావాలని కోరారు. కార్యక్రమం లో మండల అధ్యక్షులు వనం రాములు టౌన్ అధ్యక్షులు దిలీప్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీసాయినాథ్ వైస్ చైర్మన్ కర్రే స్వామి ఎల్లారెడ్డి గోపిబాబు జగన్నాథం నాయుడు ముఖ్య నాయకులు వడ్డే ఈశ్వర్, రాజశేఖర్, విశ్వరూపం, శంకర్ నాయుడు, వెంకటయ్యపృథ్వీరాజ్ వెంకటేష్ మధు రామచంద్రయ్య మజీద్ వీరస్వామి వీరబోజ సాయిరెడ్డి బలరాం సీను శాంతన్న మన్యం శరత్ బాబు రాములు వేణు శేఖర్ గౌడ్ శివశంకర్ గౌడ్ నరేష్ శేఖరాచారి చెన్నయ్య నగేష్, మోహన్ నాగిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి గోల్డ్ బాలస్వామి గొల్ల బాలస్వామి, బాలగౌడ్ రమేష్ అఖిల్ భారతి పర్వతాలు, వసంత్ సంతోష్ నరేందర్ తోకల అంజి వేణు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రతీకగా అమీన్పూర్ మున్సిపాలిటీ

- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము, టైలర్స్ కాలనీ, వందనపురి కాలనీ, మల్లికార్జున హిల్స్, సృజన లక్ష్మీ నగర్ కాలనీలలో మూడు కోట్ల 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు,. యూజీడి పనులకు ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.. దశాబ్దాల కాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టామని తెలిపారు.. మున్సిపల్ పరిధిలో ఐదు రిజర్వాయర్లు నిర్మించి ప్రతి ఇంటికి స్వచ్ఛ జలాలు అందిస్తున్నట్లు తెలిపారు.. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ



కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలే బీజేపీకి శ్రీరామరక్ష


- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం
- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ప్రధాని మోడీ అభివృద్ధి కార్యక్రమాలే బిజెపికి శ్రీరామరక్ష అని, తెలంగాణ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హాజీపూర్ మాజీ వైస్ ఎంపీపీ బేతు రమాదేవి–రవి ఆధ్వర్యంలో ఆదివారం నాడు పెద్దంపేట మాజీ సర్పంచ్ పెంద్రం ప్రేమ్ సాగర్, దొనబండ మాజీ ఉపసర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ పోలాస నేహాన్య, పెద్దంపేట బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పొట్టల శ్రీనివాస్‌గౌడ్, మాజీ వార్డ్ మెంబర్స్ మోతే బాగ్య శాంతయ్య , నాగవెల్లి శ్రావణ్ కుమార్, దొనబండ, పెద్దంపేట, బుద్ధిపల్లి గ్రామాల నుండి యువకులు, మహిళలలు పెద్ద ఎత్తున బిజెపి పార్టీ లో చేరగా వారికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్, బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ లు బిజెపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దొనబండ గ్రామ స్టేజి వద్ద బిజెపి శ్రేణులు రఘునాథ్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి గ్రామంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ గెలుపు ఖాయం అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రజలు బిజెపి పార్టీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఎన్నికల నిర్వహణ అడ్డుకొనేందుకు వారి దగ్గరి వ్యక్తులతో కోర్టులో కేసులు వేయిస్తున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్ లను బీజేపీ పార్టీ స్వాగతిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ లు తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం స్వామి రెడ్డి, బేతు రవి, రమ దేవి, గాజుల ముఖేష్ గౌడ్, ఎనగందుల కృష్ణ మూర్తి, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, బియ్యాల సతీష్ రావు, మాధవరపు వెంకట రమణ రావు, బొలిశెట్టి అశ్విన్, పట్టి వెంకట కృష్ణ, కమలాకర్ రావు, మడిపల్లి సత్యం, కొట్టి ప్రశాంత, హనుమాండ్ల శ్రీనివాస్, ఐలవేణి సతీష్, బొడ్డు తిరుపతి , తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ ఎఫెక్ట్

## ఆశావహులకు షాక్



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఆశావాహులకు గట్టి షాక్ ఇచ్చాయానే చెప్పవచ్చు. స్థానిక సంస్థల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి ఆశవాహులు ప్రజల్లో తిరిగి రిజర్వేషన్ అనుకూలిస్తే అధికార పార్టీ టికెట్ కొట్టి పదవి పట్టేద్దాం అని చూసిన నాయకులకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయింది. బెల్లంపల్లి నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లోను ఇదే పరిస్థితి నెలకొంది. ఎలాగూ రిజర్వేషన్ అనుకూలించలేదు కనీసం మన తరపున ఇంకా ఎవరైనా పోటీలో దింపి సత్తా చాటుదాం అని చూస్తే వచ్చిన కొత్త కాపు కాస్త ఏకుకు మేకై ఎక్కడ కూర్చుంటాడో అనే భయం ఓవైపు నెలకొంది. సరే రిజర్వేషన్ అనుకూలించలేదు కదా అని సైలెంట్ గా ఉంటే క్యాడర్ చేజారి పోతారేమో అన్న భయం మరోవైపు నెలకొంది. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసినప్పటి నుంచి ముందస్తుగా ప్రజలను, క్యాడర్ ను ఎన్నికలకు సిద్ధం చేస్తే ఇలా జరిగిందేమిటి అని మదనపడుతున్నారు. ఇన్నాళ్లు ఎవరికి ఏం అవసరం వచ్చినా నేనంటే నేనంటూ ముందుకు వెళ్లిన నాయకులు ఇప్పుడు రిజర్వేషన్ అనుకూలించలేదు కదా ఇకముందు కూడా ఇలాగే వెళతారా లేక నాకెందుకులే అని గమ్మునుంటారా అని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ మొత్తం పెద్ద నాయకులం అని చెప్పుకు తిరిగే వారికి షాక్ ఇచ్చిందనే చెప్పాలి. బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, నెన్నెల, బిమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల నాయకులు రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీలో ముందు నుంచి పార్టీని పట్టుకొని ఉన్న నాయకులకు, కొత్తగా పార్టీలోకి వచ్చిన నాయకులకు పొసగడం లేదు. ఈరిజర్వేషన్ల ప్రక్రియ వల్ల ఏం జరగబోతోందో ఎదురు చూడాల్సిందే.



# కోటగుళ్లలో వైద్య కళాశాలల ప్రొఫెసర్ల బృందం పూజలు

**గణపురం, సెప్టెంబర్ 28(జనం సాక్షి):** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో ఆదివారం గాంధీ, కాకతీయ మెడికల్ కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ అనిత, డాక్టర్ మాలతి, డాక్టర్ అనురాధలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# యూరియా కోసం పడిగాపులు ఇంకెన్నాళ్లు?

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (జనంసాక్షి) :** యూరియా కోసం పడిగాపులు ఇంకేన్నాళ్లు అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి మండిపడ్డారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం ఉదయం నుండి బారులు తీరి తోపులాడుకోవడం జరిగిందని తెలిసి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి తెలుసుకొని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులకు పండుగ సంబరం కూడా లేకుండా పోయిందన్నారు. యూరియా బస్తా దొరుకుతుందో లేదోనని ఉదయాన్ని వచ్చి క్యూలైన్లు కడుతూ రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యూరియా కొరత లేకుండా చూడాల్సిన ప్రభుత్వం ఆ వైపు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. జంగేడు పిఏసిఎస్ సెంటర్లో యూరియా బస్తాల కోసం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని, వెయ్యి మంది రైతులకు 5వందల బస్తాలు మాత్రమే వస్తే ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ప్రతి రోజు ఇదే పరిస్థితి ఉందని రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అవగాహన రాహిత్యంతో ప్రభుత్వాలకు దూరదృష్టి లేకపోవడంతో సరైన సమయంలో యూరియా తెప్పించకపోవడం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఫల్యమే అని అన్నారు. ఇప్పటికైనా సీజన్ సమయం ముగుస్తున్నందున అందరికీ ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# తెలంగాణ వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా గుంపెల్లి మునేశ్వర్



**నర్సంపేట. సెప్టెంబర్ 28( జనం సాక్షి) :** తెలంగాణ వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా గుంపెల్లి మునేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆనందం వ్యక్తపరుస్తూ ఏఐటీయూసీ నాయకత్వం మరియు రాష్ట్ర హమాలీ సంఘం నాయకులకు కార్మికులకు ధన్యవాదములు తెలియ జేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుల పట్ల ఏకాగ్రత చిత్తశుద్ధి కృతజ్ఞత భావనతో పని చేస్తానని మాట ఇస్తూ ప్రతి కార్మికునికి ప్రభుత్వం నుండి జీవో ల రూపంలో చెందవలసిన లబ్ది చేరేవరకు పోరాడుతా అని హామీ ఇచ్చారు

# ప్రశాంత వాతావరణంలో దసరా ఉత్సవాలను జరుపుకోవాలి

- ఏసీపీ రవీందర్ రెడ్డి



**నల్లబెల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ప్రశాంత వాతా వరణంలో దసరా ఉత్సవాలను జరుపు కోవాలని నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో రాజకీయ నాయకులతో దసరా ఉత్సవాల నిర్వహణపై మాట్లాడారు. దసరా ఉత్సవాలలో ఎలాంటి గొడవలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గత సంవత్సరం దసరా ఉత్సవాలలో మండల కేంద్రంలో గొడవలు జరిగాయని అలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటరమణ, ఎస్సై గోవర్ధన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిని మహేష్, నాయకులు పూల్ సింగ్ , వేణు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో సద్దుల బతుకమ్మ జరుపుకోవాలి


- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పండుగ వాతావరణంలో సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని కోరుతూ భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలందరికీ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిండిన చెరువులు, పచ్చని పంట పొలాల పక్కన ప్రకృతితో మమేకమై, తొమ్మిది రోజుల పాటు సాగిన ఆడబిడ్డల ఆటాపాటలతో పల్లెలు, పట్టణాలు ప్రత్యేక సాంస్కృతిక వాతావారణాన్ని సంతరించుకున్నాయన్నారు. ఈ సందర్భంగా విజయాలను అందించే విజయదశమిని స్వాగతిస్తూ, తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లేలా, ప్రజలంతా సుఖశాంతులతో జీవించి, దినదినాభివృద్ధి పొందేలా దీవించాలని అమ్మవారిని ఎమ్మెల్యే ప్రార్ధించారు.

# రోడ్డుపై మత్తడి వరద ఉధృతం

- కటాక్షపూర్ పెద్ద చెరువు అలుగుపోయడంతో వాహనదారులకు అంతరాయం
- పోలీసులు సహాయక చర్యలు



**ఆత్మకూరు, సెప్టెంబర్28 (జనం సాక్షి):** మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలు రహదారి రవాణా వ్యవస్థను దెబ్బతీశాయి. ముఖ్యంగా 163వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కటాక్షపూర్ పెద్ద చెరువు మత్తడి రోడ్డుపై చెరువు నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెరువు నీరు మత్తడి రహదారిపైకి చేరుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు దాటే ఈ రహదారి పూర్తిగా ముంపుకు గురవడంతో ప్రయాణికులు ఆగిపోయారు. చిన్న వాహనాలు వెళ్లలేక నిలిచిపోయాయి. దాంతో రెండు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. కొంతమంది వాహనదారులు పరిస్థితిని అంచనా వేసుకోకుండా నీటిని దాటే ప్రయత్నం చేయగా వాహనాలు మధ్యలోనే ఆగిపోవడం వల్ల మరింత ఇబ్బందులు తలెత్తాయి. సమాచారం అందుకున్న ఆత్మకూరు సిఐ సంతోష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. వాహనాలను నియంత్రిస్తూ, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణికులను వెళ్లేలా సలహాలు ఇచ్చారు. మత్తడి రోడ్డుపై అడ్డుకుపోయిన వాహనదారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రయాణికులు ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా రిస్క్ తీసుకోవద్దని, వర్షం కొనసాగుతున్నంత వరకు ఆ మార్గాన్ని ఉపయోగించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో మత్తడి రోడ్డుపై ప్రయాణించకూడదని, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# తుది-శ్వాస వరకూ సమాజ సేవకే..

## ఆర్టీసీ కండక్టర్‌కు గౌరవ డాక్టరేట్



నర్సంపేట సెప్టెంబర్ 28 ( జనం సాక్షి)

నర్సంపేట ఆర్టీసీ కండక్టర్ గోల నకొండ వేణు గౌరవ డాక్టరేట్ సాధించారు. ఉద్యోగంతో పాటు కొన్నేళ్ళ నుండి సామాజిక సేవే ధ్యేయంగా పని చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. అన్నారు నర్సంపేట డిపోలో కరోనా సమయంలో ఓ కార్మికుడు మరణిస్తే ఆ ఘటన తనని కలిచివేసింది. ఇద్దరు చిన్న పిల్లలు కలిగి ఉన్న ఆ కుటుంబానికి బాసటగా నిలవాలనుకున్నారు. భావోద్వేగంతో తక్షణమే బాధ్యత తీసుకొని తోటి ఉద్యోగుల సహాయంతో ముందడుగు వేసి విరాళాలు సేకరించి ఆ కుటుంబానికి అప్పటి డీఎం శ్రీనివాసరావు చేతుల మీదుగా రెండు లక్షల రూపాయల దాకా ఆర్థిక సహాయం చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. అట్టి నగదు సొమ్మును వారి కుమార్తె పెళ్లి అవసరం నిమిత్తం పోస్టాఫీస్ లో ఫిక్స్ డ్ డిపాజిట్ చేసి అందరిచే ప్రశంసలందుకున్నారు. చనిపోయిన ఆర్టీసీ కుటుంబాలు ఎటువంటి ఇబ్బంది పడకూడదని వేణు అప్పుడే బలంగా నిశ్చయించుకున్నారు. అప్పటి నుండి సామాజిక సేవకు అరంగేట్రం చేసి తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ఉన్నంతలో కొంత దానం చేయడం అలవర్చుకుంటే కలిగే తృప్తి, ఆనందం ఎందులోనూ లభించవు అంటారాయన. కరోనా, క్యాన్సర్, గుండెపోటు ఇలా... వివిధ కారణాలతో చనిపోయిన, అనారోగ్యానికి గురైన ఆర్టీసీ కార్మికులకు తోటి ఉద్యోగుల సహాయంతో ఎప్పటికప్పుడు విరాళాలు సేకరించి ఇప్పటి వరకు వారి యొక్క కుటుంబాలకు లక్షల్లో ఆర్థిక సహాయం చేసి తన సేవా గుణాన్ని, మానవత్వాన్ని చాటారు. వరంగల్ జిల్లాలోని నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన ఆర్టీసీ నర్సంపేట డిపో కండక్టర్ గొలనకొండ వేణు గత 17 సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పని చేస్తూ... ఉద్యోగంతో పాటు సామాజిక సేవ చేస్తున్నందున ఆయన సేవలను గుర్తించిన తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ హైదరాబాద్ లోని బాగ్ లింగంపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం గొలనకొండ వేణును ప్రముఖ సినీ నటుడు బాబు మోహన్ గౌరవ డాక్టరేట్ పురస్కారంతో సత్కరించి, సన్మానించారు. టీజీఎస్, ఏపీఎస్ రెండు తెలుగు రాష్ట్రాల ఆర్టీసీలో తొలి సారిగా గౌరవ డాక్టరేట్ అందుకున్న అతి చిన్న వయస్కుడిగా వేణు రికార్డ్ సృష్టించారు.

గొలనకొండ వేణు మాట్లాడుతూ.. సామాజిక సేవా రంగంలో గౌరవ డాక్టరేట్ పొందడం ఎంతో గౌరవ ప్రదంగా ఉందని గొలనకొండ వేణు సోషల్ మీడియా వేదికగా సంతోషం వ్యక్తం చేశారు. తన సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించిన తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సంస్థలో, గురిజాల గ్రామంలో తన ప్రయాణాన్ని ప్రకాశవంతంగా మార్చిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని... ఈ పురస్కారం తనతో పాటు కలిసి నడిచిన ఆర్టీసీ కార్మికులు, గ్రామస్తులు, కుటుంబం, స్నేహితులు, సన్నిహితులు అందరికీ చెందుతుందని పేర్కొన్నారు. గౌరవ డాక్టరేట్ మరింత బాధ్యతను పెంచిందని ఆయన అన్నారు. ఆర్టీసీలోనున్న 40 వేల మంది కార్మిక కుటుంబాలకు భవిష్యత్తులో కేవలం 25 రూపాయలతో “క్రౌడ్ ఫండింగ్” ద్వారా లక్షల్లో ఆర్ధిక సాయం చేసే వినూత్న ఆలోచన ఉన్నట్లు ఆయన మీడియాకు తెలిపారు. దానికి ఆర్టీసీ కార్మికుల సెల్ఫ్ కేర్ టీం” ప్రారంభించి వెబ్ సైట్ ను తెరిచి క్రౌడ్ ఫండింగ్ నిధుల లక్ష్యంతో అది పని చేస్తుందని ఆయన తెలిపారు. అదే విధంగా ఆపదలోనున్న సొంత గ్రామ ప్రజలకు కూడా కేవలం 20 రూపాయాలకే గురిజాల విలేజర్స్ సెల్ఫ్ కేర్ టీం”లి ద్వారా లక్షల్లో ఆర్ధిక సహాయం చేస్తామన్నారు. 73 సంవత్సరాల గురిజాల గ్రామ చరిత్రను ఆధారంగా చేసుకొని త్వరలో పుస్తకం రూపంలో ముందుకు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ పుస్తకం పేరు “గురిజాల చరిత్ర... గుండెల్ని పిండేసింది” అని నామకరణం చేశారు. తన తుది శ్వాస ఉన్నంత వరకు సామాజిక సేవా రంగంలోనే కొనసాగుతానని వేణు తెలిపారు.

నేటి తరానికి స్ఫూర్తి: కె. ప్రసూనలక్ష్మీ, డీఎం, నర్సంపేట డిపో మాట్లాడుతూ ఉద్యోగంతో పాటు సామాజిక సేవ చేసే వారు సమాజంలో అరుదుగా ఉంటారు. తమ డిపోకు చెందిన కండక్టర్ వేణు ఉద్యోగంతో పాటు, సామాజిక సేవా రంగంలో కొనసాగడం అభినందనీయం. అతనికి గౌరవ డాక్టరేట్ రావడం పట్ల అభినందనలు. ఈ పురస్కారంతో ఆర్టీసీ కార్మికులకు వేణు దివిటిలా నిలిచారని, రాబోయే తరాలకు అతని సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. తోటి ఉద్యోగులు, గురిజాల గ్రామస్థులు వేణుకు శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.



# పత్తి పంటలో గొర్ల మేపుతున రైతన్న...!

- పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన..

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 28 (జనం సాక్షి):** పత్తి పంటలో రైతు గొర్లను మేపిన సంఘటన మండలంలోని కోనాపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన పరికి సాంబయ్య తనకున్న 2 ఎకరాలలో పత్తి పంటను సాగు చేశాడు. పత్తి పంట వేసినప్పటినుండి అధిక వర్షాల కారణంగా పత్తి పంట మొత్తం జాలు వారి పోయింది. అంతేకాక పూతకాత లేకుండా పోయింది. దీంతో రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన కూడా కనీసం పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆదివారం పత్తి పంటలో తన గొర్రెలను మేపినట్లు తెలిపాడు. ఈ ఏడాది పత్తి పంటల వల్ల రైతులకు తీవ్ర నష్టం మిగులుతుందే తప్ప లాభం ఉండదని ఆవేదన వ్యక్తం చేశాడు.

## కల్లూరు నుంచి గ్రూప్ వన్‌లో ఇద్దరికి ఉద్యోగాలు



**కల్లూరు, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్ వన్ ఫలితాల్లో కల్లూరు మండలానికి చెందిన ఇద్దరు యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన దొడ్డపనేని సందీప్ జిల్లా రిజిస్టర్, చెన్నూరు గ్రామానికి చెందిన కంచపోగు వంశీ ఎండిఓ ఉద్యోగలు పొంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన దొడ్డపు నేనీ సర్వేశ్వరరావు కుమారుడు సందీప్ ఇల్లందులో ఎస్సైగా పనిచేస్తూ గ్రూప్ వన్ రాయటంతో జిల్లా రిజిస్టర్ ఆఫీసర్ ఉద్యోగం పొందాడు. అదేవిధంగా చెన్నూరు గ్రామానికి చెందిన కంచెపోగు వంశీ ఎండిఓ పోస్ట్ సాధించారు.

## డీఎస్పీగా ఎంపికైన రామడుగు వాసి



**హాలియా, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా అనుముల మండలం రామడుగు గ్రామానికి చెందిన బుసిరెడ్డి రవీందర్ రెడ్డి - గీత దంపతుల కుమారుడు బుసిరెడ్డి శాంతన్ కుమార్ రెడ్డి గ్రూప్-1 లో డీఎస్పీగా ఎంపికయ్యారు. ఈనెల 27వ తేదీన హైదరాబాదులోని శిల్ప కళావేదికలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శాంతన్ కుమార్ నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు శాలువాతో సత్కరించి అభినందించారు. రవీందర్ రెడ్డి ప్రస్తుతం ఏసీపీ సైబర్ క్రైమ్ బ్రాంచ్ సైబరాబాద్ విధులు నిర్వహిస్తున్నారు. శాంతన్ కుమార్ రెడ్డి గ్రూప్-1 కు ఎంపికకావడం పట్ల గ్రామ ప్రజలు,బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## బొప్పారం వాసికి గ్రూపు 2 కొలువు



**ఆత్మకూరు (ఎస్), సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్స్ ఫలితాల్లో మండలం లోని బొప్పారం గ్రామానికి చెందిన బాషపంగు లింగయ్య కనకమ్మలకు ముగ్గురు సంతానం. వారిలో చిన్న వాడు శివాజీ గ్రూప్ 2 ఆఫీసర్ గా ఎంపికయ్యారు. చిన్నప్పటి నుండి ఎంతో కష్టపడి చదవడం వల్ల ఈ విజయం వరించినట్టు ఆయన తెలిపారు. ఇదివరకే ఢిల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తుది పరీక్షకు ఎంపిక అవ్వడం, తెలంగాణ లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం మరియు మున్సిపల్ డిపార్ట్మెంట్ లో గ్రూప్ 4 ఉద్యోగం లాంటి పలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం జరిగింది. శివాజీ కృషి పట్ల కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ క్రికెట్‌కు ఎంపికైన క్రాంతి



**భువనగిరి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** భువనగిరి పట్టణం లోని గణేష్ క్రికెట్ అకాడమీ నుండి రాష్ట్ర ప్రాబబుల్స్ కు ఎంపికైన యాదాద్రి భువనగిరి జిల్లా కు చెందిన పల్లె పాటి క్రాంతికి బికేటి ప్రజాపతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రాంతికి 20, 000 రూపాయలు క్రికెట్ కిట్ ను అందజేశారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిగా డీసీపీ ఆకాంక్ష యాదవ్ పాల్గున్నారు. ఈ సందర్భంగా వారు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రానున్న రోజులు నేషనల్ కి సెలక్ట్ కావాలి అని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఉమ్మడి నల్లగొండ జిల్లా సెక్రటరీ అమీన్ బాబా బికేటి ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ, ఎన్ ఎ స్పోర్ట్స్ చింగిచర్ల కోర కమిటీ సభ్యులు బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు ఎ వి కిరణ్. ఎ వి కేతన్. ఆర్. సతీష్ కోచ్ తదితరులు పాల్గున్నారు.

## హాలియా మున్సిపాలిటీలో మాంసం విక్రయాల నిషేధం





**హాలియా, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** హాలియా మున్సిపాలిటీ పరిధిలోని చికెన్, మటన్, ఫిష్ వ్యాపారస్తులు అక్టోబరు 2న (గురువారం) నాడు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి మాంసం విక్రయం చేయరాదని కమిషనర్ రామదుర్గా రెడ్డి తెలిపారు. స్థానికంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యాపారులు మున్సిపాలిటీ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, ఈ నిర్ణయం విషయమై ముందస్తుగా అన్ని మాంసం విక్రయదారులకు నోటీసులు జారీ చేయబడినవని, అందువలన వ్యాపారస్తులు మున్సిపాలిటీ సూచనలను గౌరవించి మహాత్మా గాంధీ జయంతి రోజున ఎలాంటి మటన్, చికెన్, ఫిష్, బీఫ్, ఎలాంటి మాంసం విక్రయం జరగకుండా సహకరించాలని కోరారు.

## రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




**రామన్నపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** రోడ్డు రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక ఎంజి గార్డెన్ లో జరిగిన రామన్నపేట రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ద్వితీయ మండల మహాసభ అప్పం సురేందర్ అధ్యక్షతన జరిగింది. మహాసభ ముఖ్య అతిధిగా పాషా హాజరై మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం రవాణా రంగాన్ని సంక్షోభంలోని కార్పొరేట్లకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందని, నూతన నిబంధనలతో డ్రైవర్స్ జీవితాలను ప్రశ్నార్థకంగా మారుస్తుందని అన్నారు. ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆరోగ్య భద్రత కల్పించాలని అన్నారు.

### కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలను వెనక్కి తీసుకోవాలి

కార్మికుల హక్కుల కోసం సంఘాలు పెట్టుకోకుండా నియంత్రించే నాలుగు లేబర్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు, జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం, ట్రాన్స్పోర్ట్ వర్కర్స్, డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అప్పం సురేందర్, జిల్లా నాయకులు పల్లె సత్యం, గుండాల బిక్షం, మండల నాయకులు వేముల సైదులు, బైకాని నరసింహ,స్వామి, గాదె పరమేష్,వడ్లకొండ రమేష్,గట్టు నరసింహ, సింగపంగ శ్రీధర్, పైళ్ళ చింటు, మేకల నరసింహ,శిరీషాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీలు చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

- అన్ని పక్షాల ఆమోదంతోనే బీసీ రిజర్వేషన్లు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** వరదలు పోటెత్తుతున్న ఆపత్కాలంలో బిఆర్ఎస్, బిజెపి లు చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. ఆదివారం మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ లతో కలిసి మాట్లాడుతూ పదేళ్లపాటు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ ఎలాంటి అవగాహన లేకుండా జాగ్రత్తలు పాటించకుండా మూసీగేట్లు ఎత్తామని ప్రభుత్వంపై అబాండం వేయటం ఆయన విజ్ఞతకు, అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద ప్రవాహం పోటెత్తిన సందర్భంలో ప్రజలను అప్రమత్తం చేసి, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రజలను తరలించిన తర్వాతనే గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడం జరిగిందన్నారు. ఊహించని వరదతో ఆర్టీసీ బస్టాండ్ నీటి ప్రవాహంలో మునిగినప్పటికీ యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టామని, పరిస్థితినిచక్కదిద్దామన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయంగా బస్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. క్లౌడ్ బరస్టులు జరుగుతూ కనివిని ఎరుగని వరద ప్రవాహం వస్తున్న ఆపత్కాలంలో తప్పుడు ప్రకటనలతో ప్రజలను ఆందోళనకు గురి చేయటం పద్ధతి కాదన్నారు. ఆపత్కాలంలో రాజకీయాలు మానుకొని ప్రజల క్షేమం కోసం ప్రభుత్వానికి మంచి సలహాలు సూచనలు అందజేయాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లపై మాట్లాడుతూ ఎవరికెంతో వారికి అంత రాహుల్ గాంధీ నినాదంతో అన్ని పక్షాల ఆమోదంతో రిజర్వేషన్లు అమలు చేస్తున్నామన్నారు. 42 శాతంబిసి రిజర్వేషన్లకు అన్ని పక్షాల మద్దతు ఉందని స్పష్టం చేశారు. ఇందులో ఏ ఒక్కరికి ప్రయోజనం లేదన్నారు. దీనివలన గతంలో రిజర్వేషన్ల లబ్ది పొందిన ఎస్సీ ఎస్టీ లకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. దీనిపై కొందరు కేసులు వేసినప్పటికీ, కోర్టు పట్ల తమకు గౌరవం ఉందని, తీర్పును స్వాగతిస్తామన్నారు. కోర్టు నిర్ణయాన్ని అనుసరించి ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం బిసి సంఘం ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి, మెహబూబ్ అలీ,డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, దేశిడి శేఖర్ రెడ్డి, గోదాల జానకిరామ్ రెడ్డి, బెజ్జం సాయి, ధనవత్ సిద్దు, తలకొప్పుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐని విధుల నుండి తొలగించి విచారణ చేపట్టాలి

- ఎస్పీని ఆదేశించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- బాధితుడు సాయి సిద్ధు నుండి వివరాలు సేకరణ



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** గిరిజన యువకుడు సాయి సిద్దును పోలీస్ స్టేషన్లో విచక్షణారహితంగా కొట్టిన చిత్రహింసలకు పాల్పడిన వాడపల్లి ఎస్.ఐ.శ్రీకాంత్ రెడ్డిని విధుల నుండి తొలగించి, విచారణ చేపట్టాలని నల్గొండ జిల్లా ఎస్పిని ఆదేశించారు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.దామరచర్ల మండలం కొత్తపేట తండా కు చెందిన గిరిజన యువకుడు ధనావత్ సాయి సిద్దును ఆదివారం కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు, దామరచర్ల తహసిల్దార్ జవహర్లాల్ ల సమక్షంలో సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘటన జరిగిన వివరాలను బాధిత కుటుంబం చైర్మన్‌కు వివరించారు. పోలీస్ స్టేషనుకు తీసుకెళ్ళి కులం పేరుతో దూషిస్తూ చీకటిగదిలో ఎస్.ఐతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్ళు చిత్రహింసలకు గురి చేసారని కన్నీటి పర్యంతమయ్యారు. ఇందుకు స్పందించిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ అమాయకులపై దౌర్జన్యం చేయటం పోలీసులకు తగదన్నారు. ఈ ఘటనకు బాధ్యుడైన ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిని సస్పెండ్ చేసి, ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎస్పీని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని అదుకునేవిధంగా జిల్లా ఇన్ చార్జి మంత్రి,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దృష్టికి తీసుకవెళ్ళుతానన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాము,బాబు నాయక్,జిల్లా శంకర్, న్యాయవాది రవినాయక్, దళిత బహుజన ఫ్రంట్ ( డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్, న్యాయవాది ఎద్దు దివాకర్ తదితరులు పాల్గొన్నారు. మానవ హక్కుల వేదిక బృందం బాధితుడిని కలిసి సంఘటన వివరాలుతెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, నాయకులు రోహిత్, హరికృష్ణ,దిలిప్ ,గురవయ్య, టిఆర్జిఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు ధీరావత్ శ్రీను నాయక్, ప్రకాష్ నాయక్,సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు.ఆదివారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు శాంతినగర్ లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు.అమ్మవారి ఆశీస్సులతో పాడి పంటలతో రైతులు, ప్రజలు అభివృద్ధిపథంలో పయనించాలని అన్నారు.అనంతరం కట్కూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షేక్ బాషామియా, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్,మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం,మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ నాయకులు ఉప్పల ఆనంద్, జూలకంటి జీవన్ రెడ్డి,గుర్రం సత్యనారాయణరెడ్డి, ఆకుల లవకుశ, బత్తుల రమేష్, గాలి సాయి,ముదిరెడ్డి అనిల్,జానీ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 6న చౌటుప్పల్‌లో దివ్యాంగ చేయూత పెన్షన్‌దారుల మహాసభ



**రామన్నపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** దివ్యాంగుల పెన్షన్ రూ 6 వేలకు, వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మరియు అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ 4 వేలకు పెంచాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 6న చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నాలుగు మండలాల చేయూత పెన్షన్ దారుల మహాసభను నిర్వహిస్తున్నట్లు, ముఖ్య అతిథిగా పెన్షన్ దారుల ఆశాజ్యోతి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పాల్గొంటారని ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక రహదారి బంగ్లా లో ఎమ్మార్పీఎస్, వి హెచ్ పి ఎస్, ఎం ఎస్ పి ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్ల చంద్ర స్వామి మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రపదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు పెంచి ఇస్తున్నాడు.కానీ తెలంగాణలో రూ 6 వేలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశాడని అన్నారు.2023 ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్ 6 వేలు , మిగితా చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ 4 వేలకు పెంచుతామని రేవంత్ రెడ్డి బహిరంగంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఎమ్ ఎస్ పి సీనియర్ తొలితరం నాయకులు ఈర్లపల్లి మల్లన్న మాదిగ, ఎమ్మార్ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్ల స్వామి మాదిగ, నాయకులు వంగాల మారయ్య మాదిగ, కాందాల దేవేందర్ మాదిగ, ఈర్లపల్లి రమేష్ మాదిగ, మేడి కృష్ణ మాదిగ, శివగాళ్ల కృష్ణ మాదిగ, నోముల కృష్ణ మాదిగ, నోముల స్వామి మాదిగ, మేడి మల్లేశం మాదిగ, ముత్యాల లింగయ్య మాదిగ, మేడి మత్స్యగిరి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి ఆటోవాలా..కొడుకు ఎంపీడీవో

- సివిల్స్ సాధించడమే లక్ష్యం
- కంచెపోగు వంశీ కృష్ణ



**కల్లూరు, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించాడు. మండల పరిధిలోని చెన్నూరు గ్రామానికి చెందిన కంచ పోగు వంశీకృష్ణ. విద్యకు పేదరికం అడ్డు కాదని కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిరూపించి తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల ప్రకటించిన గ్రూప్ వన్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపీడీవో ఉద్యోగం సాధించారు. మండల పరిధి చెన్నూరు గ్రామానికి చెందిన కంచిపోగు రాములు ఆటో డ్రైవర్‌గా, తల్లి సుశీల వ్యవసాయ కూలిగా పనిచేస్తూ తమ కొడుకు వంశీకృష్ణను ఉన్నత స్థానంలో చూడాలని లక్ష్యంతో కష్టాలను లెక్కచేయకుండా ఉన్నత చదువులు చదివించారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్ వన్ సర్వీసులో 930 ర్యాంకు సాధించి ఎంపీడీవోగా సెలెక్ట్ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈసందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ తన చదువుకు, పోటీ పరీక్షల్లో నా తల్లిదండ్రులతో పాటు నా సోదరుడు నాగరాజు ప్రోత్సాహం సహాయం దోహద పడిందని అన్నారు. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా తాను ముందుకు కొనసాగుతానని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



**బోడుప్పల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 345వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించాలి. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రిజర్వేషన్ కోసం పోరాడుతున్న బీసీలకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించి ప్రత్యేక జీవో జారీ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు, కామగళ్ల బాబు, గరుగుల యాకయ్య, బండారి సాయి, చిల్ల అంజయ్య, యేసు రాజు, రాకేష్, ముక్కెర్ల స్వామి, పాండు, ప్రవీణ్, వాసు, సుశాంత్, జానీ, శ్రీకాంత్, ప్రశాంత్, బద్రి, వెంకట్, సుజయ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# కాటేపల్లి తండాకు మొదటిసారి ఎన్నికలు

- సంతోషంలో తండా ప్రజలు



**పెద్దకొడప్గల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడచిన ఆ గ్రామంలో నేటి వరకు ఎన్నికలు జరగలేదు. కనీసం 2018 సంవత్సరంలోనైన ఎన్నికలు జరుగుతాయని ఆశపడ్డ ఆ గ్రామస్తులకు చేదు అనుభవమే ఎదురయింది. పెద్ద కొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో భాగమైన కాటేపల్లి తాండాను గత ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. తాండలోని ప్రజలంతా బీసీలు ఉన్నారు. 2018 ఎన్నికలలో కాటేపల్లి తాండ గ్రామానికి ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఎన్నికలు జరగలేదు. పలుమార్లు గ్రామస్తులు కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాల ద్వారా తమ గ్రామ సమస్యను తెలుపుకున్నారు. ఇటీవల వెలువడిన గ్రామ పంచాయతీ వార్డుల రిజర్వేషన్ లలో బీసీ రిజర్వేషన్ కల్పించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

### గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం



గతంలో ఎన్నికలు జరగకపోవడంతో గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు విజయవంతంగా జరుపుకొని గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం.

**జేతిలాల్**

### సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు



ఎస్టీ రిజర్వేషన్ వల్ల ఎన్నికలు జరగలేదు. తాండ అభివృద్ధి చెందలేదు. సీఎం రేవంత్ రెడ్డి వల్ల బీసీ రిజర్వేషన్ రావడంతో ఎన్నికలు జరగబోతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు. తండాను అభివృద్ధి చేసుకుంటాం.

**సుధార్ సింగ్**

### బీసీ రిజర్వేషన్ రావడంతో సంతోషంగా ఉంది



బీసీ రిజర్వేషన్ రావడంతో సంతోషంగా ఉంది. ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నాం. తాండ అభివృద్ధికి ఎదురుచూస్తున్నాం. రిజర్వేషన్ వచ్చినందుకు సంతోషంగా ఉంది.

**బార్త్యనాయక్ ప్రేమ్ సింగ్**






భారత్‌లో స్వీడిష్ బ్రాండ్ కారు లాంచ్

## వోల్వో ఈఎక్స్30

**న్యూఢిల్లీ:**స్వీడిష్ కార్ల తయారీ సంస్థ వోల్వో ఇండియన్ మార్కెట్లో ఈఎక్స్30 లాంచ్ చేసింది. కంపెనీ లాంచ్ చేసిన ఈ కొత్త కారు ధర రూ. 41 లక్షలు (ఎక్స్ షోరూమ్).అయితే ఈ కారును అక్టోబర్ 19 కంటే ముందుగా బుక్ చేసుకున్నవారికి కంపెనీ దీనిని రూ. 39.99 లక్షల (ఎక్స్ షోరూమ్) ధరకే అందిస్తుంది.కొత్త వోల్వో ఈఎక్స్30 ఎలక్ట్రిక్ కారు.. క్లోజ్డ్-ఆఫ్ గ్రిల్, స్లిమ్ ఎల్ఈడీ హెడ్‌లైట్లు, డేటైమ్ రన్నింగ్ లైట్లు, రియర్ లైట్లు వంటి వాటితో పాటు.. ఎలక్ట్రిక్ వాహనాల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఏరోడైనమిక్ వీల్స్ వంటివి పొందుతుంది. ఛార్జింగ్ పోర్ట్ వెనుక ఎడమ క్వార్టర్ ప్యానెల్‌పై ఉంది.ఇంటీరియర్ డిజైన్ కలిగిన ఈ కారు.. వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో %ద% ఆపిల్ కార్‌ప్లేతో పాటు గూగుల్ బేస్ట్ సిస్టమ్‌తో పనిచేసే 12.3-అంగుళాల వర్టికల్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్‌ను పొందుతుంది. డాష్‌బోర్డ్ ఫ్రీమ్‌లైన్ డ్రైవర్ ఇంటర్‌ఫేస్, స్టీరింగ్ వీల్ కోసం కొత్త డిజైన్ పొందుతుంది. అంతే కాకుండా 360-డిగ్రీ కెమెరా, మల్టిపుల్ ఎయిర్‌బ్యాగ్‌లు, లేన్ కీపింగ్ అసిస్ట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి ఏడీఏఎస్ ఫీచర్లు కూడా ఈ కారులో ఉన్నాయి.భారతీయ మార్కెట్ కోసం లాంచ్ అయిన కొత్త వోల్వో ఈఎక్స్30 ఎలక్ట్రిక్ కారులో 69 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్ ఉంటుంది. ఇది ఒక ఛార్జ్‌పై 480 కిమీ రేంజ్ అందిస్తుంది. ఇందులోని ఎలక్ట్రిక్ మోటారు 272 హార్స్ పవర్, 343 ఎన్ఎమ్ టార్క్ అందిస్తుంది. దీని టాప్ స్పీడ్ 180 కిమీ/గం కాగా.. ఇది 5.3 సెకన్లలో గంటకు 0 నుంచి 100 కిమీ వరకు వేగవంతమవుతుంది.

మెదడుకు చురుకైన ఆహారం

## మెడిటరేనియన్ డైట్

మెడిటరేనియన్ డైట్ అంటే...పుష్కలంగా పండ్లు, కూరగాయలు, బ్రెడ్, ఇతర ధాన్యాలు, బంగాళదుంపలు, బీన్స్, గింజలు, ఆలివ్ నూనెనే ఎక్కువగా వాడతారు. పాల ఉత్పత్తులు, గుడ్లు, చేపలు వంటివి మెడిటరేనియన్ డైట్ లో మితంగా తీసుకుంటారు. ఈ ఆహారంలో రెడ్ మీట్ కంటే చేపలు, పౌల్ట్రీ ఉత్పత్తులు ఎక్కువగా ఉంటాయి. మొక్కల ఆధారిత ఆహారాలనే ఎక్కువగా తింటారు.రోజువారీ ఆహారంలో కూరగాయలు, లీన్ ప్రొటీన్లు, మంచి కొవ్వు, మరిన్ని.. దశాబ్దాలుగా, మెడిటేరియన్ డైట్ తీసుకోవడం వల్ల మెదడు వృద్ధాప్యాన్ని వాయిదా వేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.గ్రీన్ టీ: ఇది మీ న్యూరాన్లకు శక్తినిస్తుంది: గ్రీన్ టీలో కాటెచిన్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి వాపులను, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి కావలసిన శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు. ఇవి న్యూరోజెనిసిస్‌కు కీలకంగా పనిచేస్తాయి.మెదడు పనితీరును పెంచే మొక్క మన్నా: దీనిని 'డక్ వీడ్' అని కూడా పిలుస్తారు, మన్నా అనేది పాలీఫినాల్స్, బీ12, ముఖ్యం ఆధారిత ప్రోటీన్లతో నిండిన ఒక చిన్న వాటర్ ప్లాంట్. ఇది మెదడు వృద్ధాప్యంతో ముడిపడి ఉన్న కీలక ప్రోటీన్లను నియంత్రించడంలో సహాయ పడుతుంది.చెదును తొలగిస్తుంది, మంచిని జోడిస్తుంది: గ్రీన్-మెడ్ ప్రణాళిక ఆరోగ్యకరమైన పదార్థాలపై మాత్రమే కాదు, ఇది రెడ్ మీట్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లను కూడా తగ్గిస్తుంది, రెండూ వృద్ధాప్యంతో ముడిపడి ఉన్నాయి.

– జనంసాక్షి






## కేపీఐ గ్రీన్‌కు ఎస్‌బీఐ నిధులు

రూ. 3,200 కోట్లకు ఓకే

పీఎస్‌యూ దిగ్గజం ఎస్‌బీఐ నుంచి ఫైనాన్స్ సౌకర్యాన్ని పొందినట్లు పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీ కేపీఐ గ్రీన్ ఎనర్జీ తాజాగా వెల్లడించింది. దీంతో ఎస్‌బీఐ నుంచి రూ.3,200 కోట్ల రుణాన్ని అందుకోనున్నట్లు తెలియజేసింది. సోలార్, హైబ్రిడ్ ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ ప్రాజెక్టులకు ఎస్‌బీఐ రుణాలు సమకూర్చనున్నట్లు తెలియజేసింది.వీటిని గుజరాత్‌లో మొత్తం 1జీడబ్ల్యూపీ సామర్థ్యంతో ఏర్పాటు చేయనుంది. రెండు వ్యూహాత్మక పాజెక్టులకు ఈ రుణ సౌకర్యాలు మద్దతివ్వనున్నట్లు పేర్కొంది. 250 మెగావాట్ల(ఏసీ), 350 ఎండబ్ల్యూపీ(డీసీ) సోలార్ పవర్ ప్రాజెక్టుతోపాటు.. 370 మెగావాట్ల హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు వీటిలో ఉన్నాయి.

## ఒక్క క్లిక్ చాలు.. వెంటనే చేతిలో ఫొటో

**ముంబై:**మునుపటి రోజుల్లో ఫొటో అంటే ఒక్క క్లిక్ చాలు. వెంటనే ఆ ఫొటో చేతిలోనే ఉండేది. వేలకొద్దీ ఫిల్టర్లు, సెల్ఫీ డిలీట్స్, ఎడిట్స్ ఏమీ ఉండేవి కాదు. ఆ మ్యాజిక్‌ను మళ్లీ మన చేతిలో తేవడానికి వచ్చింది – ఇన్‌స్టాక్స్ మినీ ఇవో ప్రీమియం ఎడిషన్!ఇది కేవలం కెమెరా మాత్రమే కాదు, ప్రింటర్ కూడా. ఒక్క క్లిక్‌తో ఫొటో తీయవచ్చు, అదే క్షణంలో ప్రింట్ చేసుకోవచ్చు. పది లెన్స్ ప్రభావాలు, పది ఫిల్మ్ ప్రభావాలు –మొత్తం వంద రకాల మూడ్‌లలో మీ ఫొటోలు తీర్చిదిద్దుకోవచ్చు. రెట్రో లుక్ డిజైన్, డయల్స్‌తో పాత కెమెరా ఫీల్‌కు కొత్త స్పర్శ ఇస్తుంది. అంతేకాదు, డైరెక్ట్ ప్రింట్ ఫీచర్‌తో మొబైల్ నుంచి ఫొటోలు నేరుగా ప్రింట్ చేయవచ్చు. ధర రూ. 19,999. చిన్నప్పటి రోజుల్లో స్కూల్ నుంచి వచ్చి బ్యాగ్ మూలన పడేసి, భోజనం కూడా మరచిపోయి గేమ్ కన్సోల్ ఆన్నేసిన క్షణాలు గుర్తున్నాయా? మారియోలో ప్రిన్సెస్ కోసం పరిగెత్తిన ఆ ఉత్సాహం, కాంట్రాలో లైఫ్ పోయినప్పుడు మనసులో పడిన ఆ బాధ–ఇవన్నీ మళ్లీ నిజం కానున్నాయి. 'బెలోఫ్లీ ఎవి హ్యాండ్‌హెల్డ్ గేమ్ కన్సోల్' అంటే కేవలం ఒక గాడ్జెట్ కాదు, అది 90s నాటి బాల్యపు మజాను తిరిగి మన చేతిలో పెట్టే జాదూ బాక్స్. ఇందులో ఏకంగా 500 క్లాసిక్ గేమ్స్. చేతిలో పట్టుకుని ఆడినా సరే, టీవీకి కనెక్ట్ చేసి పెద్ద స్క్రీన్పై ఆడినా సరే, ఆ పాత రెట్రో ఫీల్ కచ్చితంగా వస్తుంది. రాత్రిళ్లు దుప్పట్లో దాక్కుని, లైట్ ఆఫ్ చేసి ఆడిన ఆ సీక్రెట్ మజాను కూడా ఇది మళ్లీ జ్ఞాపకం చేస్తుంది. ధర కేవలం రూ.758 మాత్రమే! అప్పటి రోబో పెట్!:ప్రస్తుత పిల్లలు ఆడుతున్న ఆర్టిఫిషియల్ రోబో ఫ్రెండ్స్, డిజిటల్ టాయ్స్ కంటే బెటర్‌గా అప్పట్లో ఒక నిజమైన డిజిటల్ ఫ్రెండ్ ఉండేది. అది అప్పటి అందరి ఫేవరెట్ పెట్-టమాగొచ్చి! అప్పట్లో అది కేవలం ఒక గేమ్ కాదు, నిజంగా మనకున్న డిజిటల్ పెట్ ఫ్రెండ్. దానికి తిండి పెట్టాలి, స్నానం చేయించాలి, బయటికి తీసుకెళ్లాలి, ఆటలు ఆడించాలి–ఇవన్నీ మన బాధ్యతే! ఇప్పుడా పెట్ కొత్త కలర్ స్క్రీన్, టచ్ బటన్స్, కెమెరా, గేమ్స్ అన్నీ కలిపి మరింత అప్‌డేట్ అయి మన చేతిలోకి వచ్చేసింది–బాండై అమెరికా టమాగొచ్చి పిక్స్ –స్టై పర్పుల్ ఎడిషన్! ఇందులో మీరు మీ పెట్‌తో సెల్ఫీలు తీయొచ్చు, వంటలు చేయించవచ్చు, ఫ్రెండ్స్ టమాగొచ్చి లతో కలిసి డేట్స్‌కి వెళ్లొచ్చు, గిఫ్టులు మార్చుకోవచ్చు. పదిహేడుకు పైగా గేమ్స్‌లో ఆడి పాయింట్స్ సంపాదించి, మీ పెట్‌కి కావలసిన ఫర్నిచర్, ఫుడ్, యాక్సెసరీస్ కొనిపెట్టొచ్చు. ధర రూ.9,831.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.00 | ₹ 5.02 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,05,850 (22 క్యారెట్లు) | ₹ 1,15,480 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్


₹ 1,59,000

## 'వెండి కాయిన్స్ ఆర్డర్ చేస్తే.. నూడుల్స్ వచ్చాయి'

**న్యూఢిల్లీ:**డెలివరీ యాప్స్ అందుబాటులోకి వచ్చిన తరువాత దాదాపు షాపుకు వెళ్లి కొనుగోలు చేసేవారి సంఖ్య బాగా తగ్గింది. కిరాణీమీర దగ్గర నుంచి బంగారం వరకు ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తున్నారు.ఇలా కొనుగోలు చేసే సమయంలో కొన్ని సార్లు మోసపోతున్నారు. పెట్టే ఆర్డర్ ఒకటైతే.. వచ్చే డెలివరీ ఇంకొకటి అవుతుంది. తాజాగా ఇలాంటి ఘటనే ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది."వెండి కాయిన్స్ ఆర్డర్ చేశాను. కానీ నాకు మ్యాగీ నూడుల్స్,



హల్దీరామ్ ప్యాకెట్లు డెలివరీ అయ్యాయి. అంతే కాకుండా నాకు వచ్చిన డెలివరీలో ఒక పౌచ్ కూడా ఉంది. దానికి సీల్ చేసి ఉంది. డెలివరీ భాగస్వామి ఆ సీల్ ఓపెన్ చేయలేదని అన్నారు. మొత్తం ఆర్డర్ తీసుకోలేదని క్యాన్సిల్ చేయండి.. అని డెలివరీ బాయ్ నాకు రెండు ఆప్షన్స్ ఇచ్చారు. 40 నిమిషాల తరువాత నేను పౌచ్ ఓపెన్ చేసాను. అందులో సిల్వర్ కాయిన్స్ ఉన్నాయి. కానీ 999 ప్యూర్ సిల్వర్ కాదు. అవి 925 స్టెర్లింగ్ సిల్వర్" అని వినీత్ అనే ఎక్స్ యూజర్ సోషల్ మీడియాలో స్విగ్గీ హర్రర్ స్టోరీ అని పోస్ట్ చేశారు.నాకు వచ్చిన డెలివరీలో మ్యాగీ నూడుల్స్, హల్దీరామ్ ప్యాకెట్లను డెలివరీ ఏజెంటే తీసుకొమన్నారు. నేను వాటిని ఆర్డర్ చేయలేదు. కాబట్టి అవి నాకు వద్దని వినీత్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్స్ చేస్తున్నారు. దీనిపై స్విగ్గీ కూడా స్పందించింది.వినీత్ మరో ట్వీట్ చేస్తూ.. ఈ సారి స్విగ్గీ నాకు స్వచ్ఛమైన వెండి నాణేలను డెలివరీ చేసింది, దానికి సంబంధించిన ఫోటోలను షేర్ చేశారు. ఆర్డర్ ఐడీని షేర్ చేయమని స్విగ్గీ కోరింది. వినీత్ తన ఆర్డర్ ఐడీ షేర్ చేశారు. సమస్యను మా దృష్టికి తీసుకువచ్చినందుకు.. కావలసిన వివరాలను అందించినందుకు స్విగ్గీ వినియోగదారుకు ధన్యవాదాలు తెలిపింది.



## అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం..

ముగ్గురి మృతి!

**వాషింగ్టన్:**అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం రేగింది. నార్త్ కరోలినాలోని అమెరికన్ ఫిష్ కంపెనీ రెస్టారెంట్ సమీపంలో శనివారం రాత్రి (అమెరికా కాల మానం ప్రకారం) కాల్పుల ఘటన చోటు చేసుకుంది ది.ఇందులో ముగ్గురు మృతి చెందగా.. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. అధికా రుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని బోటు నార్త్ కరోలినాలోని సౌత్ పోర్ట్ యాచ్ బేసిన్‌లో ఉన్న అమెరికన్ ఫిష్ కంపెనీ రెస్టారెంట్ వద్దకు వచ్చింది .బోటులోని వ్యక్తి ఒక్కసారిగా రెస్టారెంట్‌పైకి కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. పలువురికి గాయాలైనట్లు సమాచారం. కాల్పుల అనంతరం దుండగుడు అదే బోటులో పారిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఇరాన్ మీద ఆంక్షల పునరుద్ధరణ

ఐరాస నిర్ణయంతో టెహ్రాన్ మరింత కష్టాల్లోకి..

**న్యూయార్క్:**ఇరాన్ అణు కార్యక్రమంపై ఆంక్షలను ఐరాస పునరుద్ధరించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. దీంతో ఇప్పటికే ఆహారం, నిధుల కొరత ఎదుర్కొంటున్న ఆ దేశం మరింత కష్టాల్లోకి జారనుంది. ఆంక్షలను ఆపేందుకు చివరి నిమిషం వరకు ఇరాన్ ప్రయత్నించినా విఫలమైంది. ఐరాస ఆంక్షల ప్రకారం.. ఇరాన్‌కు విదేశాల్లో ఉన్న ఆస్తులను స్తంభింపజేయడం, ఆయుధ డీల్స్‌ను నిలిపివేయడం వంటివి చేయనున్నారు. ఇరాన్ బాలిస్టిక్ మిసైల్ ప్రోగ్రామ్‌పై చర్యలు తీసుకోవడం కూడా ఈ జాబితాలో ఉంది. నిజానికి అక్టోబర్ 18తో ఈ ఆంక్షల శాశ్వతంగా తొలగిపోవాల్సి ఉంది. అయితే గతంలో జరిగిన జాయింట్ కాంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ (జేసీపీవోఏ) ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించింది. దీంతో ఆంక్షలు ఎదుర్కోవాల్సి వచ్చింది. జేసీపీవోఏ ఒప్పందం ప్రకారం.. అందులో సంతకం చేసిన ఏ దేశమైనా అవసరమైతే ఆంక్షలను పునరుద్ధరించవచ్చు. ఈ



నేపథ్యంలో టెహ్రాన్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఐరోపా దేశాల ప్రతినిధులు ఆగస్టులోనే ఐరాసకు వెల్లడించారు. జర్మనీ, యూకే 30 రోజుల క్రితమే ఆంక్షలను పునరుద్ధరించాలని నిర్ణయించాయి. దీనికి తోడు ఈ ప్రక్రియను ఐరాస భద్రతా మండలి వీటో చేయడానికి వీల్లేకుండా డిజైన్ చేశారు. దీంతో చైనా, రష్యా ఈ విషయంలో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడుతూ ఈ ఆంక్షలు ఇరాన్‌కు ఉచ్చుగా అభివర్ణించారు.

## రైలు కూతకు 200 ఏళ్లు

**న్యూఢిల్లీ:**బ్రిటన్లో సరిగ్గా 200 ఏళ్ల క్రితం వినిపించిన రైలుకూత.. ప్రపంచ రవాణారంగ ప్రస్థానాన్నే మార్చేసింది. 1825 సెప్టెంబరు 27న ఆగ్నేయ ఇంగ్లాండులోని షిల్డన్-స్టాక్టన్ మధ్య మొట్టమొదటిసారిగా ఆవిరి ఇంజిన్‌తో 42 కి.మీ. మేర రైలు నడిచింది. అది చాలా స్వల్పదూరమే అయినా తొలుత బ్రిటన్లో, ఆ తర్వాత భారత్ సహా ప్రపంచ దేశాల్లో రైలు రవాణాకు చెప్పుకోదగ్గ మైలురాయిగా నిలిచింది. ఈ చారిత్రక ఘటనకు శనివారంతో సరిగ్గా 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలు, రైల్వే అభిమానులు పెద్దఎత్తున పండుగ చేసుకున్నారు. మొట్టమొదట నడిచిన 'జార్జ్ స్టీఫెన్సన్ లోకోమోషన్ నంబర్ 1'ను మ్యూజియంలో పోలిఉండే రైలింజిన్‌ను పునరుద్ధరించి అదే మార్గంలో మళ్లీ నడిపించారు. ఆ ఆవిరి ఇంజిన్, బొగ్గు నిల్వకు మూడు వ్యాగన్లు, ప్రయాణికుల కోసం ఒకపెట్టె దీనిలో ఉన్నాయి. మొట్టమొదట రైలు ఏ మార్గంలో ఎలా కూతపెట్టిందో అదే మార్గంలో ఇది గమ్యస్థానం చేరుకొంది. దీని మార్గానికి ఇరువైపులా ప్రజలు పెద్దఎత్తున చేరి కేరింతలతో స్వాగతిస్తున్నారు. ఈ రైల్లో ప్రయాణించినవారిలో కింగ్ ఛార్లెస్-3 చిన్న తమ్ముడు ప్రిన్స్ ఎడ్వర్డ్ ఉన్నారు.





## తొక్కిసలాట ఘటనలో కుట్ర కోణం..

మద్రాస్ హైకోర్టుకు టీవీకే

కరూర్ జిల్లాలో టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. దీనిలో కుట్ర కోణం ఉందని, స్వతంత్ర దర్యాప్తు జరపాలంటూ ఆ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ర్యాలీ జరుగుతుండగా రాళ్లు రువ్వడంతో పాటు పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నట్లు టీవీకే తెలిపింది. దీంతో తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు ఆరోపించింది. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ సోమవారం మద్రాస్ హైకోర్టులోని మదురై బెంచ్‌ను ఆశ్రయించనున్నట్లు వెల్లడించింది. ఈ ఘటనపై విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీబీఐకి అప్పగించాలని కోరనున్నట్లు టీవీకే న్యాయవాది అరివళగన్ ఓ వార్తా సంస్థకు చెప్పారు. ఘటనలో కుట్ర కోణం ఉందనేందుకు స్థానిక ప్రజల నుంచి తమకు విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. ర్యాలీలో నిబంధనలను ఉల్లంఘించారంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. గత రెండు నెలలుగా పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించాం.. ఎక్కడా ఇలాంటి ఘటన చోటు చేసుకోలేదన్నారు. కానీ, కరూర్‌లోనే తొక్కిసలాట జరగడంపై సందేహాలు ఉన్నట్లు తెలిపారు.ఈ తొక్కిసలాటలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. 50 మందికి పైగా గాయపడ్డారు. విజయ్ ప్రసంగిస్తుండగా.. కొందరు ఒక్కసారిగా సమీపానికి వచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో ఈ దుర్ఘటన జరిగింది. షెడ్యూల్ ప్రకారం కాకుండా విజయ్ చాలా ఆలస్యంగా ర్యాలీకి రావడం, 10వేల మందికి మాత్రమే అనుమతి ఇవ్వగా అంతకంటే ఎక్కువ మంది అక్కడకు రావడమే కారణమని పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

# నా హృదయం ముక్కలైంది..

- భరించలేని బాధలో ఉన్నా
- తొక్కిసలాట ఘటన.. రూ.20 లక్షలు పరిహారం ప్రకటించిన విజయ్
- విచారణ తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు.. తొక్కిసలాట ఘటనపై సీఎం స్టాలిన్

చెన్నై(జనంసాక్షి):తమిళనాడులోని కరూర్‌లో తన ప్రచారసభలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రముఖ నటుడు, టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "నా హృదయం ముక్కలైంది. నేను భరించలేని బాధ, దుఃఖంలో ఉన్నాను. ఆ బాధ పదాల్లో వర్ణించలేనిది. కరూర్‌లో ప్రాణాలు కోల్పోయిన నా ప్రియమైన సోదరులు, సోదరీమణుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని విజయ్ పేర్కొన్నారు. తమిళనాడు కరూర్‌లో విజయ్ ప్రచార ర్యాలీలో ఈ తొక్కిసలాట ఘటన చోటుచేసుకుంది. ఇందులో 39 మంది ప్రాణాలు కోల్పోగా.. 50 మందికి పైగా గాయపడ్డారు. విజయ్ ప్రసంగిస్తుండగా.. కొందరు ఒక్కసారిగా ఆయనకు సమీపానికి వచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో తొక్కిసలాట జరిగింది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం రావాల్సిన విజయ్.. ఆరు గంటలు ఆలస్యంగా కరూర్‌కు చేరుకోవడం, ఊహించిన దానికంటే ఎక్కువ మంది ప్రజలు ర్యాలీలో



పాల్గొనడమే ఈ ఘటనకు కారణాలుగా తెలుస్తోంది. తొక్కిసలాటపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

**రూ.20 లక్షలు పరిహారం ప్రకటించిన విజయ్**

టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ నిర్వహించిన ప్రచార ర్యాలీ విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఇక్కడ జరిగిన తొక్కిసలాటలో 39 మంది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో విజయ్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.20లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు.కరూర్ ఘటనపై టీవీకే అధికారిక ఎక్స్ ఖాతాలో విజయ్ మరోసారి స్పందించారు. తన హృదయం ఇంకా భారంగానే ఉందన్నారు. తను ఇప్పుడు ఎదుర్కొంటున్న బాధను చెప్పేందుకు కూడా మాటలు రావడం లేదన్నారు. ప్రచార సమయంలో అభిమానుల ముఖాల్లో చూసిన ఆనందం ఇంకా కళ్ల ఎదుట కదలాడుతోందన్నారు. ఆత్మీయులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు విజయ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. తాను ఈ దుఃఖాన్ని పంచుకుంటున్నాను. ఇది తమకు కొలకోలేని నష్టమని, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబానికి రూ.20లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షలు అందిస్తామని ప్రకటించారు. ఈ డబ్బు బాధిత కుటుంబాల బాధను తీర్చదు కానీ, వారిలో ఒకడిగా అండగా నిలబడటం తన కర్తవ్యమని విజయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్నవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

**సినీ నటుల విచారం..**

కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై సినీ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తమని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. భర్తీ చేయలేని నష్టాన్ని, కష్టాన్ని అనుభవిస్తున్న బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో వారి బలం చేకూరాలని కోరుకున్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

**బాధ్యులపై కఠిన చర్యలు..: సీఎం స్టాలిన్**

కరూర్: తమిళనాడులో టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట



చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు.50 మందికి పైగా గాయపడగా వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ విచారణ అనంతరం ఘటన వెనుక నిజానిజాలు బయటపడతాయని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్టాలిన్ పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు.'కరూర్‌లో జరిగిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇప్పటివరకు 39 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర చరిత్రలో ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో ఇంతమంది ప్రజలు మరణించడం ఇదే తొలిసారి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకూడదు. ప్రస్తుతం 51 మంది చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు, గాయపడినవారికి రూ.లక్ష పరిహారం అందిస్తాం' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణకు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్‌ను నియమించినట్లు స్టాలిన్ తెలిపారు. విచారణ అనంతరం నిజానిజాలు బయటపడతాయన్నారు. రాజకీయ ఉద్దేశంతో తాను ఈ వ్యాఖ్యలు చేయడం లేదన్నారు. విచారణలో నిజాలు బయటకు వచ్చాక.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## దుర్గ భవాని అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 28(జనంసాక్షి) :** మండలంలోని నారాయణపూర్ గ్రామంలో యువ చైతన్య మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న శ్రీ దుర్గా భవాని అమ్మవారిని, ఆదివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన వంతు విరాళంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి 5016 రూపాయలను అందజేశారు.నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ దుర్గాభవాని అమ్మవారి దయవల్ల పెద్దపల్లి, నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరారు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను ప్రజలందరూ సంస్కృతి సాంప్రదాయ బద్ధంగా, ఘనంగా జరుపుకోవాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు గుడుగుల సతీష్ తోపాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

## దూళికట్ట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

- ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే విజయ రమణారావు
- రూ12 కోట్లతో దూళికట్ట నుండి ర్యాకల్ దేవుపల్లి వరకు నూతన డబల్ రోడ్డుకు శంకుస్థాపన
- గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది
- గ్రామాలను అనుసంధానం చేస్తూ నూతన బి.టి రోడ్ల సదుపాయం
- అభివృద్ధి, సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ చిత్తశుద్ధి.పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు



**ఎలిగేడు,సెప్టెంబర్ 28(జనంసాక్షి) :** ఎలిగేడు మండలం దూళికట్ట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు.ఎలిగేడు మండలం దూళికట్ట గ్రామంలో రూ. 29 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం రూ. 12 కోట్ల నిధులతో దూళికట్ట నుండి ముప్పిరితోట మీదుగా ర్యాకల్ దేవుపల్లి గ్రామం వరకు నూతన బి.టి డబల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన తదుపరి నూతన ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసి నిర్మాణ పనులు ప్రారంభించి వారందరికీ ప్రొసైడింగ్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ చిత్తశుద్ధితో ఉందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దపల్లి నియోజకవర్గంలో గొప్ప స్థాయిలో నిధులు మంజూరు చేపించి గ్రామాలను అనుసంధానం చేస్తూ మండల కేంద్రాలకు,మండల కేంద్రాలను అనుసంధానం చేస్తూ జిల్లా కేంద్రానికి నూతన రోడ్లను నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కటిగా నెరవేరుస్తుందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి మరింతఅభివృద్ధి సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దుగ్యాల సంతోష్ రావు, మాజీ సర్పంచ్ అర్చనపల్లి వెంకటేశ్వరరావు, మహేశ్వరరావు, తోపాటుఅధికారులు,మండల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మొదటిసారి జరగనున్న ఎన్నికలు

### సంతోషంలో తాండ ప్రజలు



**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడచిన ఆ గ్రామంలో నేటి వరకు ఎన్నికలు జరగలేదు. కనీసం 2018 సంవత్సరంలోనైన ఎన్నికలు జరుగుతాయని ఆశపడ్డ ఆ గ్రామస్తులకు చేదు అనుభవమే ఎదురయింది. పెద్ద కొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో భాగమైన కాటేపల్లి తాండాను గత ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. తాండలోని ప్రజలంతా బీసీలు ఉన్నారు. 2018 ఎన్నికలలో కాటేపల్లి తాండ గ్రామానికి ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఎన్నికలు జరగలేదు. పలుమార్లు గ్రామస్తులు కలెక్టర్ కు ప్రజావాణి ద్వారా, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాల ద్వారా తమ గ్రామ సమస్యను తెలుపుకున్నారు. ఇటీవల వెలువడిన గ్రామ పంచాయతీ వార్డుల రిజర్వేషన్ లలో బీసీ రిజర్వేషన్ కల్పించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



**గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం:**
**జేతిలాల్**
గతంలో ఎన్నికలు జరగకపోవడంతో గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు విజయవంతంగా జరుపుకొని గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం.



**సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు:**
**సుధార్ సింగ్**
ఎస్టి రిజర్వేషన్ వల్ల ఎన్నికలు జరగలేదు. తాండ అభివృద్ధి చెందలేదు. సీఎం రేవంత్ రెడ్డి వల్ల బీసీ రిజర్వేషన్ రావడంతో ఎన్నికలు జరగబోతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు. తండాను అభివృద్ధి చేసుకుంటాం.



**బీసీ రిజర్వేషన్ రావడంతో సంతోషంగా ఉంది:**
**బార్యనాయక్, ప్రేమ్ సింగ్**
బీసీ రిజర్వేషన్ రావడంతో సంతోషంగా ఉంది. ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నాం. తాండ అభివృద్ధికి ఎదురుచూస్తున్నాం. రిజర్వేషన్ వచ్చినందుకు సంతోషంగా ఉంది.

## ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం





- మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బిఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు జిల్లా పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రాష్ట్ర నాయకులు శ్రీ క్యామ్ మల్లేష్ పట్లోల్ల కార్తిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపుతోనే జిల్లా ప్రజల సంక్షేమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని తెలిపారు అనంతరం, శంషాబాద్ హుడా కాలనీలో బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన "కాంగ్రెస్ ప్రభుత్వ బాకీ కార్డు" పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వం ఇంకా పూర్తి చేయని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లారు..

## పూలను, ప్రకృతిని దైవంగా భావించే గొప్ప పండుగ బతుకమ్మ

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్

**హుజురాబాద్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** పూలను దైవంగా భావిస్తూ ప్రకృతిని కాపాడుతూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని,ఎంగిలిపూలతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులు తీరొక్క పువ్వులను పూజిస్తూ జరుపుకుంటారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు పుట్టినిల్లు అని ఇక్కడ జరుపుకునే బతుకమ్మ పండుగ చిన్న,పెద్ద తేడా లేకుండా ప్రతి ఇంట్లో ఆనందంగా జరుపుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని,ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

"హైదరాబాద్ : బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు శుభవార్త. మూసీకి వరద తగ్గడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులను ఎంజీబీఎస్ నుంచి పునరుద్ధరించారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు వెళ్లాల్సిన బస్సులను అధికారులు అందుబాటులో ఉంచారు. అంతర్ రాష్ట్ర సర్వీసులు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో ఆర్టీసీ ప్రయాణికులతో ఎంజీబీఎస్ కిటకిటలాడుతోంది."



## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**ఆర్మూర్,సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 3 వార్డు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పిప్రి వీరేశంకి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యామాద్రి భాస్కర్ చేతుల మీదుగా రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ అరవింద్, స్థానిక ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ప్రత్యేక చొరవతో బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి అందిందన్నారు. చెక్కు పంపిణీలో మాజీ ఎంపిటిసి కర్ణ కృష్ణ గౌడ్,రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ మోహన్ రెడ్డి, ఇతర సభ్యులు ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కాంగ్రెస్ పార్టీవే..

- సుడా పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం
- నగరంలో మిగిలిపోయిన జంక్షన్లను సుందరీకరిస్తాం
- బతుకమ్మ చీరల కోసం బిఆర్ఎస్ ధర్నా చేయడం సిగ్గుచేటు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో విజయం సాధించి తీరుతుందని అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏదో ఒక విధంగా లాభం జరుగుతుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికి మేలు జరిగేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి మోసకాకుండా ప్రజల నెత్తిపై మోయలేనంత అప్పుల భారం మోపిందని విమర్శించారు. 2014 లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నో ఆటు పోట్లు ఎదురుకొన్నామని ఆనాటి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా అరెస్టులు నిర్బంధాలను ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీని కరీంనగర్ లో పార్టీ బలోపేతం కోసం కృషి చేశామనీ 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నో ప్రలోభాల మధ్య కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ చేశారని ఆర్టిసి సమ్మెలో కార్మికులకు మద్దతుగా పోరాటం చేశానని నరేందర్ రెడ్డి గుర్తు చేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షునిగా ఒకవైపు నియంతృత్వ బిఆర్ఎస్ పార్టీకి మతతత్వ బిజెపి పార్టీకి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూనే పార్టీని బలోపేతం చేశామని నరేందర్ రెడ్డి అన్నారు.ఆనాడు మేము ధర్నా చేసి ఆనాటి ప్రభుత్వం తీసుకపోయినా పరిష్కారం కాని సమస్యలను ఇప్పుడు మేము పరిష్కరిస్తున్నామని సుడా చైర్మన్ గా కరీంనగర్ నియోజకవర్గంతో పాటు సుడా పరిధిలో ఉన్న అన్ని నియోజక వర్గాలకు నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఇప్పటికే పది హేను కోట్ల రూపాయలు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టామని రాబోయే రోజుల్లో మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేల సహకారంతో కరీంనగర్ లో గత బిఆర్ఎస్ ప్రభుత్వం వదిలిపెట్టిన పెండింగు పనులన్నీ మరియు పలు కూడళ్లు సుందరీకరణ చేస్తామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జిడి రమేష్, దండి రవీందర్,అనిల్ కుమార్,కుర్ర పోచయ్య,పెద్దిగారి తిరుపతి పాల్గొన్నారు.

## సాంపల్లి తండాను అభివృద్ధి చేస్తా

### నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** సాంపల్లి తండాకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి దంపతులు ఆదివారం డిచ్పల్లి మండలం సాంపల్లి తాండాలోని జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో సాంపల్లి తండావాసులు సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధిస్తే జగదంబ మాతకు ముక్కుపుడక, ఒడిబియ్యం సమర్పిస్తామని మొక్కుకోగా మొక్కును ఎమ్మెల్యే దంపతులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంపల్లి తండాకు కావాల్సిన నిధులు కేటాయిస్తానని, ఇప్పటికే మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. పాఠశాల ప్రహరీగోడ, మహిళా సంఘాల భవనం, అంగన్వాడి భవనం నిర్మాణం కోసం కృషి చేస్తున్నానని హామీ ఇచ్చారు. మహిళలకు పెద్దపీట వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, పంట రుణ మాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు. మంచి పని రిజర్వాయర్ పాత డిజైన్ ప్రకారమే జీవో త్వరలో వస్తుందని తెలిపారు. బిజెపి, టీఆర్ఎస్ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం, ఎస్టీలకు 10 శాతం, ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ కల్పించిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి వినోదిని రెడ్డి, మండల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు కంచెట్టి గంగాధర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యువతే కీలక పాత్ర

### మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య



**కోనరావుపేట సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** నేటి యువత డ్రగ్స్‌కు గంజాయికి దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు.సుద్దాల గ్రామంలో దొబ్బల స్వామి స్మారక మండల స్థాయి వాలిబాల్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నేటి యువతే రేపటి భవిత అని అలాంటి యువత దేశా నిర్మాతలుగా ఎదగాల్సిందిపోయి గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని దీని వల్ల వారి మీద ఆధారపడిన కుటుంబాలు వీధి పాలు అవుతున్నారని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత యువత మీదే ఉందని అన్నారు. క్రీడల ద్వారా మానసిక శారీరక ఉల్లాసం కలుగుతుందని అన్నారు గ్రామంలో తన తండ్రి దొబ్బల స్వామి గారి స్మారక వాలీబాల్ టోర్నమెంట్ ను వారి కుమారులు నిర్వహించడం అభినందనీయ మని అన్నారు అనంతరం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వాహకులు దొబ్బల ప్రవీణ్ మాట్లాడుతూ మా నాన్నగారి దొబ్బల స్వామి స్మారకర్థంగా టోర్నమెంట్ నిర్వహించడం సంతోషంగా ఉందని మన నాన్న కూడా సామాజిక సేవలో ముందు ఉంటూ అనేక సమస్యలను పరిష్కారించిన వ్యక్తి అని అన్నారు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడ జరిగిందని దీనికి మండల వ్యాప్తం గా 20 టీములు రావడం జరిగిందని హెూరాహెూరీగా జరిగినటు వంటి టోర్నమెంట్లో మొదటి విజేతగా సుద్దాల నిలిచిందని రెండవ విజేత మామిడిపల్లి జట్టు నిలిచిందని తెలిపారు ఎట్టి టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కర్రోళ్ల భాస్కర్, మాజీ సర్పంచ్ కచ్చకాయల బాల్ రెడ్డి ,మాజీ విద్యా కమిటీ పాఠశాల చైర్మన్ ఎర్రవెల్లి విజయ్ కుమార్, బి ఆర్ స్ నాయకులు కచ్చకాయల మహేష్, పర్షరం రాకేష్, అన్వేష్, అంజయ్య, కాంగ్రెస్ నాయకులు అవురం సురేష్ ,మాసం జనార్ధన్, నీరటి రవి, బీఎస్పీ నాయకులు నరేష్ ,ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

## ఇల్లందకుంటలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**జమ్మికుంట, సెప్టెంబర్ 28 (జనం సాక్షి):** ఇల్లందకుంట మండల కేంద్రంలో నూర్ భాషా దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు ఎండి రఫీ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్ భాషా దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు రఫీ మాట్లాడుతూ 75 ఏళ్లలో నూర్ భాషా దూదేకుల కులస్తుల అభివృద్ధి కోసం ఎన్ని ప్రభుత్వాలు, ఎంతమంది ముఖ్యమంత్రులు మారిన ఎవరు ప్రత్యేక బడ్జెట్ కేటాయించలేదని మొదటిసారి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 30కోట్ల లోన్ బడ్జెట్ కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మంత్రులకు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి వొడితల ప్రణవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. మైనార్టీ ముస్లింలలో నూర్ భాషా దూదేకుల కులంలో అభివృద్ధికి నోచుకోక బేకరీలలో, సైకిల్ షాపులలో, పరుపులు కుట్టు కుంటూ, బ్యాండ్ మేళం వాయించు కుంటు తమ జీవనం కొనసాగిస్తున్నారని అలాంటి తమ కుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి ఆర్థిక ఎదుగుదలకు కృషిచేసిన ముఖ్యమంత్రికి ఇతర మంత్రులకు రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా నూర్ భాషా దూదేకుల కులస్తులకు ప్రత్యేక బడ్జెట్‌ని కేటాయించి ఆర్థిక ఎదుగుదలకు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ పెద్ది కుమార్ హాజరై మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ని ఏర్పాటు చేసి ద్విచక్ర వాహనాలు ఎలక్ట్రికల్ స్కూటీలు వితంతువులకు ఒంటరి మహిళలకు లోన్ సౌకర్యాన్ని కల్పిస్తూ బాసటగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట కబరస్థాన్ అధ్యక్షుడు హుస్సేన్,నూర్ బాషా దూదేకుల కుల సంఘ రాష్ట్ర నాయకులు అన్వర్ బాబు,లాల్ మమ్మద్,మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు అజ్గర్ పాషా,సిరిసేడు మైనార్టీ సెల్ అధ్యక్షుడు గఫూర్, అక్బర్,అబ్బాస్,అలి, అబ్దుల్ గని, సర్దర్,కలిల్, హకీమ్ పాషా, మాంసబ్ తదితరులు పాల్గొన్నారు.





## హాలో ఆదివాసీ చలో భద్రాచలం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ఆదివాసీ నాయక పోడు సేవా సంఘం కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఆదివాసి 9తెగల ధర్మ యుద్ధం చలో భద్రాచలంలో పాల్గొన్నారు. లంబాడాల తొలగింపుకై భద్రాచలంలో మహా గర్జనకు కామారెడ్డి జిల్లా ఆది వాసి నాయకపోడు కుల పెద్దలు, కుల ప్రజలు పాల్గొన్నారు.మన హక్కుల పరిరక్షణ, మన అస్తిత్వ స్థాపన కోసం అత్యంత కీలకమైన పోరాటానికి సిద్ధం అని తెలియజేశారు. ఎస్టీ జాబితాలో అక్రమంగా చేర్చబడిన లంబాడాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం పట్టణంలో ఈ నెల 28న ఆదివారం చారిత్రక భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ఆదివాసీల అన్ని తెగల సంఘాలు, ప్రజానీకం హాజరయ్యారు.

మన రిజర్వేషన్లు, మన అవకాశాలు దక్కాలంటే, ఈ చట్టబద్ధత లేని లంబాడీల చేరికను అడ్డుకోవాలనీ ప్రతీ ఒక్క ఆదివాసీ నాయక పోడు బిడ్డ ఈ చారిత్రక ఉద్యమంలో పాల్గొన్నారు.మన బిడ్డల భవిష్యత్తు కోసం, తరతరాల వారసత్వాన్ని కాపాడుకోవడం కోసం తప్పక కదలండి మన భాగస్వామ్యంతో ఈ మహా సభను దిగ్విజయంగా పూర్తి చేశారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మొట్ట పెంటయ్య జిల్లా నాయకులు కంది సాయిలు, ముత్యాల సంజీవులు, జమ్ముల శంకర్, పుట్ట శ్రీనివాస్, రవీందర్, సాయిలు, మన్నె రాంగోపాల్, సాయిలు, కాశీరాం, నారాయణ, మొదలగు వారు పాల్గొన్నారు.

## షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడు

- మతోన్మాద శక్తులను ఓడించడమే భగత్ సింగ్ కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వాలి ఉల్లా ఖాద్రి



**వరంగల్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) షహీద్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్ లోని కరీంబాద్ భగత్ సింగ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భగత్ సింగ్ జయంతి వేడుకల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వాలి ఉల్లా ఖాద్రి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వాలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12ఏళ్ళ అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ళ యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్ సింగ్ అని కొనియాడారు. 1907 సెప్టెంబర్ 28న జన్మించిన భగత్ సింగ్ 23 ఏళ్ళ చిరు ప్రాయంలోనే 1931 మార్చ్ 23న తన సహచరులు రాజ్ గురు, సుఖ్ దేవ్ లతో కలిపి ఉరితీయబడ్డారని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావ శీల విప్లవకారులలో భగత్ సింగ్ అగ్రగణ్యుడని, ఈ కారణంగానే షాహీద్ గా దేశ ప్రజలు కొనియాడారని వారు గుర్తు చేశారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్ కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదెళ్ల శరత్ యాకుబ్ పాషా జగదీష్ తదితరులు పాల్గొన్నారు .



## బతుకమ్మ, దసరా పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

### ఎస్సై పి అనిల్ కుమార్

**గంభీరావుపేట సెప్టెంబర్ 28 (జనం సాక్షి ):** ప్రశాంతమైన వాతావరణంలో బతుకమ్మ, దసరా పండుగలు జరుపుకోవాలి అని ఆదివారం రోజున ఎస్సై పి. అనిల్ కుమార్ అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ముందుగా బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలుపుతూ, జంబి వద్ద ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని, జంబి వద్ద ఎలాంటి గొడవలు జరిగిన తమ దృష్టికి తీసుకురావాలని కోరారు, పండుగ పూట తల్లిదండ్రులు మైనర్లకు బైకులు ఇవ్వకూడదని, పండుగ రోజున మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, దుర్గాదేవి నిమజ్జన సమయంలో డీజెలకు అనుమతి లేదని, డీజెల్ పెడితే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పి అనిల్ కుమార్ తెలిపారు.

# పలుపు తాళ్లే ఉరి తాళ్లు

- కాగ్నా నది ఒడ్డున మూగజీవుల మృత్యు ఘోష
- ఊపిరాడక నీటిలో మునిగి పాకలో 45 పశువుల మృతి
- మరో 75 పశువులు సురక్షితం
- దాదాపు 31 లక్షల నష్టం



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 28 (జనం సాక్షి):** పలుపు తాళ్లే ఆ పశువుల పాలిట ఉరి తలయ్యాయి. చీకటి పడగానే పశువులను తాళ్లతో మేకులకు కట్టి వెళ్లగానే అర్ధరాత్రి కాగ్నా రూపం దాల్చడంతో నీటిలో మునిగి ఊపిరాడక పశువులన్నీ ఉన్నచోటే మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే బషీరాబాద్ మండలం జీవనిగీ గ్రామ శివారులోని మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి బావ ప్రతాపరెడ్డి పొలంలో 45 పశువులు నీటిలో మునిగి మృత్యువాత పడ్డాయి. రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు కాగ్నా నది తోపాటు కర్ణాటక రాష్ట్రం చించోలి ప్రాంతంలో మరో నది తోడై ఉగ్రరూపం దాల్చడంతో ప్రతాపరెడ్డి పొలంలో ఉన్న 120 పశువులు గల్లంతయాయని భావించారు. పశువుల పాక పైనుంచి వరద ప్రవాహం అధికంగా ఉండడంతో పశువులు కనిపించకపోవడంతో అన్ని గల్లంతయాయని భావించారు. కానీ ఆదివారం రోజున కాగ్నా వరద ప్రభావం తగ్గడంతో పశువుల పాకలోనే పలుపు వాళ్లకు పశువులు మృతి చెంది విగతగా పడి ఉన్నాయి. 45 పశువులు పాకలోనే నీట మునిగి మృతి చెందాయి. పశువుల మెడకు తాళ్లు బిగించి మేకులకు కట్టు వేయడంతో అవి నీట మునిగి మృతి చెందాయి. పలుపు తాళ్లతో పశువులను మేకులకు కట్టివేసి ఉండకుంటే నీటి ప్రవాహానికి నదిలో కొట్టుకపోయి ఒడ్డుకు చేరి బతుకే వని అధికారులు అంచనాకు వచ్చారు. ప్రతాప్ రెడ్డి పొలంలోని పాకలో దాదాపు 130 పశువులు ఉన్నాయి. 45 మినహాయించి మిగతావన్నీ నది వరద ప్రవాహానికి కొట్టుకపోయి బతికి బయటపడ్డాయి. 45 పశువులు నీటిలో మునిగి చనిపోయిన కారణంగా దాదాపు 31 లక్షల నష్టం వాటిల్లింది. ఒక్కొక్క పశువుకు 70000 చొప్పున అంచనా వేశారు. కాగా ఆదివారానికి కాగ్నా శాంతించింది. నదిలో నీటిమట్టం తగ్గింది. అయినా ఇంకా ఉధృతంగానే ప్రవహిస్తుంది. నదిలో నీటిమట్టం తగ్గిన తర్వాత పాకలోనే పశువులు మృత్యువాత పడిన విషయం బయటపడింది. నదికి ఇరువైపులా ఉన్న పంట పొలాలు నష్టపోయాయి. వరద కారణంగా నేలకోట జరిగి వరద తాకిడికి మరికొన్ని పంటలు నీటిలో కొట్టుకపోయి నష్టం జరిగింది. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగి రైతులకు వాన కడగండ్లు మిగిల్చింది. పూర్తిస్థాయిలో దెబ్బతిన్న పంటను అంచనా వేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందరం ఆశిద్దాం..

# భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్
- డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించిన రంజిత్ రెడ్డికి అభినందన



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ఉన్నతమైన సేవలను అందించి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ,కష్టపడి చదివితే ప్రతిఫలం తప్పక వస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు.ఇటీవల విడుదలైన గ్రూప్ వన్ ఫలితాల్లో 43 వ ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్ గా ఉద్యోగం సాధించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్ పురి కాలనీకి చెందిన అక్కెనపల్లి రంజిత్ రెడ్డి ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎందరో విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన రంజిత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగ నిర్వహణలో మంచి పేరు తెచ్చుకొని ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు , ఈ సందర్భంగా ఉద్యోగం సాధించిన రంజిత్ రెడ్డిని ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సత్కరించారు.

కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ లోని రెయిన్ బో స్కూల్ లో పదవ తరగతి పూర్తిచేసి, నగరంలోని మాసబ్ ట్యాంక్ లోని పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ పూర్తిచేసి,సీబీఐటి కళాశాలలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశారు. కాగా చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉన్న రంజిత్ రెడ్డి తల్లిదండ్రులు కూలిపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉండగా 2022 సంవత్సరంలో తండ్రిని కోల్పోయారు.స్థానిక వైష్ణవి టెక్నో స్కూల్ లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ తల్లి ప్రేరణతో లక్ష్యం సాధించారు రంజిత్ రెడ్డి.జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే గ్రూప్ వన్ కు సంసిద్ధం అవుతూ మొదటి ప్రయత్నంలోనే డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాన్ని సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు.తనను అన్ని విధాలుగా ప్రోత్సహించి,ధైర్యం చెప్పిన వైష్ణవి టెక్నో స్కూల్ చైర్మన్ చెప్యాల నరసింహులు గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్,వైష్ణవీ టెక్నో పాఠశాల చైర్మన్ నరసింహులు గౌడ్ లు కలిసిన వారిలో ఉన్నారు.

## శాకాహారం పాటించడం ద్వారా శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత





### చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

**చేవెళ్ల, సెప్టెంబరు 28 (జనంసాక్షి) :** శాకాహారం పాటించడం ద్వారా శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, శాకాహరం అలావాటుతో ఆరోగ్యవంతమైన జీవితం శాకాహరం అలవాటు చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిందామని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బ్రహ్మర్షి పితామహ పత్రిజి ఆశీస్సులతో పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో కేజీఆర్ గార్డెన్లో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు చేవళ్ల పట్టణ కేంద్రం లోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై అహింసా మెగా శాకాహర ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శాకాహారం అనేది ఆరోగ్యానికి, ఆధ్యాత్మికతకు, ప్రకృ తికి మిత్రం అని చెప్పారు. శాకాహారం పాటించడం ద్వారా శరీరానికి ఆరోగ్యం, మనస్సుకు ప్రశాంతత నిస్తుం దన్నారు. సమాజానికి సమానత్వం కలుగుంతుందన్నారు. పచ్చి కూరగాయు ఆహారం ప్రకృతిని కాపాడుతుంది, భవిష్యత్ తరాలకు శుభ్రమైన వాతావరణాన్ని అందిస్తుందని అన్నారు. మనందరం శాకాహారం అలవాటు చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొలూష్యన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పిరమిడ్ సొసైటి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నడిమోళ్ల శంకర్, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్లు బండారి శైలజాఆగి రెడ్డి, నడిమోళ్ల లావణ్యశంకర్, బీమయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సున్నపు వసంతం, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షురాలు దేవర సమత వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, చేవెళ్ల మున్సిపాల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సొసైటీ సభ్యులు, మహిళలు, ప్రజలు తదితరులు ఉన్నారు.

# కుల మతాలకు దుర్గ మాత శరన్నవరాఉత్సవాలు





భువనగిరి, సెప్టెంబర్ 28(జనం సాక్షి)

భువనగిరి పట్టణ 10వ వార్డు హౌసింగ్ బోర్డ్ భక్త భజన మండలి ఇలియాస్ మహమ్మద్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ 10వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నాక్ ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ 26వ వార్డు కౌన్సిలర్ ఈరపాక నరసింహ 23వ వార్డు కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్ ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ గత 14 సంవత్సరాల నుండి హౌసింగ్ బోర్డ్ కాలనీలో కుల మతాలకు దుర్గ మాత శరన్నవరాఉత్సవాలు ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. భారతదేశంలో లౌకికతత్వానికి భిన్నత్వంలో ఏకత్వంలో సాంప్రదాయ పరిస్థితులను అనుసరించి భువనగిరిలో కూడా దుర్గామాత వద్ద కులాలకు మతాలకు అతీతంగా మైనార్టీ సోదరులు పూజలు నిర్వహించి అన్న ప్రసాద దాతగా నిలవడమే చారిత్రాత్మక విషయం అని ప్రజలందరూ కొనియాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు శీలం క్రాంతి రెడ్డి, బింగి నరేష్, సందీప్, మల్ల భరత్, శ్రీకాంత్, శివ, తిలక్, సాయి, అఖిల్, మాటూరి బాలేశ్వర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొనడం జరిగింది.





## నవదుర్గ సేవ సమితి పోచమ్మ వాడ ఆధ్వర్యంలో కుంకుమ పూజ!

**రాయికల్ సెప్టెంబర్28 (జనం సాక్షి ):** రాయికల్ మండలం అల్లీపూర్ లోని నవదుర్గ సేవ సమితి పోచమ్మ వాడ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల భాగంగా ఆదివారం రోజున దుర్గా మాత సన్నిధిలో కుంకుమ పూజ కన్నుల పండుగగా నిర్వహించారు. పురోహితులు అంగడి పరమేశ్వర్ ఆధ్వర్యంలో కుంకుమ పూజ నిర్వహించి భక్తులకి కుంకుమ పూజ విశిష్టత గురించి తెలిపారు. పూజా విధానాల ప్రాముఖ్యతను వివరించి, భక్తులను భక్తి సమర్పణతో ఆచరణలో పాల్గొనాలని సూచించారు.వారు మాట్లాడుతూ... హిందువులకు అత్యంత ప్రధాన పండుగలలో విజయ దశమి ఒకటి. దేశవ్యాప్తంగా ఈ పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారు. విజయ దశమి, దసరాగా పిలవబడే ఈ పర్వదినం ముందు తొమ్మిది రాత్రులు దేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. శరన్నవరాత్రుల్లో (దసరా ) అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో రూపంలో అలంకరించి పూజిస్తారు. తొలి మూడు రోజులు పార్వతిగా, తర్వాతి మూడు రోజులు లక్ష్మీగా, చివరి మూడు రోజులు సరస్వతిగా ఆరాధిస్తారు. నవరాత్రుల్లో దేవిని పూజిస్తే పది జన్మల పాపాలు తొలగిపోతాయని ప్రగాఢ నమ్మకం. శరన్నవరాత్రుల్లో నవదుర్గల అలంకారంలో పరాశక్తి దర్శనమిస్తుంది. మహిషాసురుడనే రాక్షసుడి సంహారం కోసం జగన్మాత.. ఆశ్వాయుజ శుద్ధ పాడ్యమి నుంచి యుద్ధం మొదలుపెట్టి.. ఒక్కో రోజులో ఒక్కో అవతారంలో యుద్ధం చేసి.. విజయదశమి రోజున సంహరించారని పురాణణాలు చెబుతున్నాయి.

# సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి తరలిరండి

**రాజేంద్రనగర్, సెప్టెంబర్28(జనంసాక్షి)** దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మాదిరిగా దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మ పండుగను పత్తికుంట హనుమాన్ నగర్ లో నిమజ్జనం కార్యక్రమం ఉంటుందని రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్ పేర్కొన్నారు.

## తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ చీరలేవి

### బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్





**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కరీంనగర్ పట్టణంలోని తెలంగాణ చౌక్ లో బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ మహిళా శ్రేణులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వం తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయకపోవడానికి నిరసిస్తూ.. ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై నిరసన తెలియజేస్తూ.. బతుకమ్మ పాటలను ఆడి పాడారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగకు పంపిణీ చేసిన చీరలను బిఆర్ఎస్ పార్టీ మహిళలు ధరించి వచ్చి నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా నగర బీఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రజానీకాన్నీ అదేవిధంగా మహిళలను , రైతులను ప్రతి ఒక్కరిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని, తెలంగాణ ప్రజలకు అబద్ధపు హామీలను ఇచ్చి గద్దెనెక్కి తెలంగాణ ప్రజలను నైవంచనకు గురిచేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహా కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. మహిళలకు 2500 రూపాయలతోపాటు, కళ్యాణ లక్ష్మి పథకం లో తులం బంగారం, గ్యాస్ సబ్సిడీ, రైతుబంధు, ఎరువులు, ఇలా ఏ విభాగం తీసుకున్న ఏది కూడా పూర్తిగా అమలు చేయలేని చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, ప్రతి బతుకమ్మ పండుగకు మహిళలందరికీ చీరలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ తో పాటు జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు గంది మహేష్ – మాధవి, ఎడ్ల సరిత – అశోక్, గుగ్గిల్ల జయశ్రీ – శ్రీనివాస్, నక్క పద్మ – కృష్ణ, నందెల్లి రమాదేవి, మర్రి భావన – సతీష్, తాటి ప్రభావతి, వాల రమణారావు, కంసాల శ్రీనివాస్, కుర్ర తిరుపతి, దిండిగాల మహేష్, బోనాల శ్రీకాంత్, డివిజన్ల అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమం.. వినూత్నం





- ప్రతీ ఒక్కరినీ ఆలోచింపజేస్తున్న ప్రభుత్వ విప్ 'ఆది' కుమారుడి దాతృత్వం
- శాలువాలను గౌన్లుగా కుట్టించి నిరుపేద చిన్నారులకు పంపిణీ

**వేములవాడ (జనంసాక్షి) :** మానవత్వానికి గౌరవం "అనే పేరుతో సేవా కార్యక్రమంలో భాగంగా శాలువాలను గౌన్లుగా మలిచి నిరుపేద ఆడపిల్లలకు పంపిణీ చేసిన తీరు నియోజకవర్గ ప్రజలను ఆలోచింపజేసింది.వేములవాడ నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తనయుడు ఆది కార్తీక్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. వివిధ సందర్భాల్లో తన తండ్రి ఆది శ్రీనివాస్‌కు వచ్చిన శాలువలను "హానర్ టు హ్యూమానిటీ "మానవత్వానికి గౌరవం అనే పేరుతో చిన్నారుల కోసం గౌన్లుగా కుట్టించి పంపిణీ చేశారు. వేములవాడ పట్టణంలోని పలు కాలనీలలో జరిగిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఆది శ్రీనివాస్ పాల్గొని గౌన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి గౌరవంగా వచ్చిన శాలువలను గౌన్లుగా కుట్టించి పేద పిల్లలకు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. మా కుమారుడు ఆది కార్తీక్ ఆలోచనతోనే ఈ కార్యక్రమం చేపట్టామని, వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఆది కార్తీక్‌ను అభినందిస్తున్నామని అన్నారు. గౌరవార్థం వచ్చిన శాలువలను సేవాభావంతో గౌన్లుగా మలిచి పంపిణీ చేయడం సంతోషంగా ఉందని, వీటిని తయారు చేసే ప్రక్రియలో పలువురికి ఉపాధి లభిస్తోందని, శాలువలు ఉపయోగంలోకి రావడం పట్ల తృప్తి కలుగుతోందని చెప్పారు.

రానున్న రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా ముందుకు తీసుకెళ్తామని, ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ నాయకులు చిలక రమేష్, సాగరం వెంకటస్వామి, పుల్కం రాజు , తోట రాజు, వడిజె మల్లయ్య, కుతాడి రాజే ష్ ,ఉల్లెందుల మల్లయ్య, దేవయ్య ,నరసయ్య, తదితరులు ఉన్నారు.

# ముచ్చటగా మూడోసారి విజయం

- మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా గౌరు శ్రీనివాస్, వెంకటరమణ చౌదరి



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 28(జనం సాక్షి) :** మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ముచ్చటగా మూడోసారి గౌరు శ్రీనివాస్, బోగవెల్లి వెంకటరమణా చౌదరి(బాబి)లు ఎన్నికయ్యారు. ఆదివారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ లో జరిగిన ఎన్నికల్లో మిగిలిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కేఎన్ఎమ్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పందిరి రవీందర్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ నిర్వహించిన ఈ ఎన్నికల్లో సుమారు 90 మంది సభ్యులు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గోళ్ళ రామ్ శేఖర్, సహాయ కార్యదర్శిగా పోలిశెట్టి ధనుంజయ, కోశాధికారిగా గందె రాము, పాలకవర్గ సభ్యులుగా గౌరు శంకర్రావు, నీలా పాపారావు, పోతుగంటి కృష్ణ, మలిగిరెడ్డి మాధవరెడ్డి, రాయిని శ్రీనివాస్, కొమ్మన పట్టాభిరామ్, గుంటి గోపి, ఆతుకూరి గురునాథం లు ఎన్నికయ్యారు. కాగా ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయదశమి రోజు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు గౌరు శ్రీనివాస్,వెంకటరమణ లు మాట్లాడుతూ మిల్లర్స్ సంక్షేమం కోసం కృషి చేస్తామని,ఏలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందు ఉంటామన్నారు. రైతుల సంక్షేమం కోసం, మిర్యాలగూడ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన రైస్ మిల్లర్స్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు ప్రముఖులు మిల్లర్స్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మాజీ అధ్యక్షుడు బండారు కుశలయ్య, గుడిపాటి శ్రీనివాస్,రైస్ మిల్లర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మనీ లెండింగ్ యాక్ట్ రైతులకు శ్రీరామరక్ష

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుండి రైతులను కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం మనీ లెండింగ్ యాక్ట్ ను అమల్లోకి తెచ్చిందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అసలు, వడ్డీ కట్టలేక కొంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు న్నాయని వివరించారు. రాష్ట్రంలో మనీ లెండింగ్ యాక్ట్ 1349 అమలు కావడం లేదని, ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని రెండు నెలల క్రితం ప్రభుత్వానికి ఆధారాలతో లేఖ రాసినట్లు కోదండరెడ్డి తెలిపారు. రైతు కమిషన్ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం మనీ లెండింగ్ యాక్ట్ 1349 ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిందని, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్ జారీ చేసిన ఈ ఉత్తర్వులు రైతులకు శ్రీరామరక్షగా ఉంటాయన్నారు. ప్రధానంగా సన్న చిన్నకారు రైతులు, కౌలు రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చేతులో మోసపోయారని ఇక నుండి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ఆటలు సాగవని స్పష్టం చేశారు.

# గల్ఫ్ వలస జీవులకు బతుకమ్మ లాంటి భరోసా

- దుబాయి బతుకమ్మలో వెన్నెల గద్దర్



హైదరాబాద్ (జనంసాక్షి) : గల్ఫ్ వలసవ జీవులకు బతుకమ్మ లాంటి భరోసా ప్రజాప్రభుత్వం కల్పిస్తోందని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ జి.వెన్నెల అన్నారు. గల్ఫ్ తెలంగాణ ఫోరం (జిటిఎఫ్) ఆధ్వర్యంలో శనివారం రాత్రి దుబాయిలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ జి. వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగిత్యాల మునిసిపల్ తాజా మాజీ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, నిర్మల్ జిల్లావాసి అల్లూరి క్రిష్ణవేణి లు అతిథులుగా హాజరయ్యారు. దుబాయి, షార్జా లలో ఉన్న తెలుగు ప్రవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ తదితర దేశాలకు వలస వెళ్లిన, తెలంగాణ ప్రవాసులకు భరోసా ఇచ్చే సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని వెన్నెల గద్దర్ ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, గల్ఫ్ వలసవ జీవులకు బతుకమ్మ లాంటి భరోసా ఇస్తున్నదని ఆమె అన్నారు. జిటిఫ్ అధ్యక్షులు ఆకుల సురేందర్, తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్ కొట్టాల సత్యం గౌడ్, దుబాయి లోని ఎన్నారై ప్రముఖులు బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కళాకారులు బుర్ర సతీష్, అష్ట గంగాధర్, పూజ నాగేశ్వర్ ఆహుతులను అలరించారు.

## నేడు సరూర్ నగర్ స్టేడియంలో మహా బతుకమ్మ

- గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించే దిశగా 10 వేల మందితో బతుకమ్మ వేడుక
- హాజరుకానున్న మంత్రులు జూపల్లికృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క

హైదరాబాద్ (జనంసాక్షి) : బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో బతుకమ్మ కీర్తిని ప్రపంచానికి చాటేలా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో పదివేల మంది మహిళల సమక్షంలో అతి భారీ స్థాయిలో బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జూపల్లికృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, హాజరుకానున్నారు.

# బెల్లంపల్లి కాంగ్రెస్‌లో ముసలం

- ఎమ్మెల్యే తీరును వ్యతిరేకిస్తున్న సీనియర్లు
- ఎమ్మెల్యే ఓటమికి పనిచేసిన వారిని పక్కన పెట్టుకోవడం ఏంటని ప్రశ్న



బెల్లంపల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ లో ముసలం పుట్టింది. ఇన్నాళ్లుగా ఎమ్మెల్యేలో మార్పు కోసం ఎదురుచూస్తున్న నాయకులు మార్పు రాకపోవడంతో ఎదురు తిరిగే పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే గడ్డం వినోద్ తీరుపై సీనియర్లు తిరగబడ్డారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు నేతృత్వంలో సీనియర్లందరు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా జట్టు కట్టారు. ఎమ్మెల్యే సీనియర్ నాయకులను పట్టించుకోవడం లేదని, బిఆర్ఎస్ పార్టీ నుండి వచ్చిన కొంతమంది వారిని దగ్గర తీసుకొని సీనియర్లను, గెలుపు కోసం కష్టపడ్డ ముఖ్య కార్యకర్తలను దూరం పెడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా వినోద్ గెలవటానికి ఎంతగానో కృషిచేసిన నాయకులను పట్టించుకోవడం లేదన్నారు. పార్టీ విజయానికి ఎవరు కష్టపడ్డారో తెలియకుండా ఎమ్మెల్యే వ్యవహారిస్తున్నాడని అన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీకి అసలు సంబంధంలేని అనామకులకు చేరతీస్తున్నారని ఆరోపించారు. పిఏల పరిపాలన నడుస్తుందని, కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. వీరు చేసే పనులకు ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న ప్రేమ అభిమానం వ్యతిరేకతగా మారి రేపు జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కార్యకర్తలు నాయకులుగా తయారయ్యే అవకాశం కోల్పోతున్నారన్నారు. సీనియర్ నాయకులు సూరిబాబు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను బెల్లంపల్లికి తీసుకువచ్చి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సీనియర్ నాయకులకు అందరం కష్టపడి ఎమ్మెల్యే వినోద్ గారి గెలుపు కోసం సూరిబాబు ఎంతో కష్టపడ్డా ఎమ్మెల్యేగా గెలిచాక ముఖ్యమైన కార్యకర్తలను నాయకులను, వినోద్ గెలుపు కోసం రిస్కు తీసుకున్న సూరిబాబుకు గౌరవం ఇవ్వడం లేదన్నారు. ఎన్నోసార్లు ఎమ్మెల్యే వినోద్ సూరిబాబును అవమానపరిచినారన్నారు. వినోద్ గెలుపుకు కృషి చేసిన సూరిబాబుపై ఇలా ప్రవర్తించడం, ఏమాత్రం విశ్వాసం లేకుండా చూడడం వల్ల కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వినోద్ కష్టపడ్డ సీనియర్ నాయకులను, కార్యకర్తలను గుర్తించాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ మనుగడకే కోలుకోలేని దెబ్బ అని హెచ్చరించారు.

# లంబాడీలు ఈ నేల మూలవాసులే..

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్..
- గిరిజన తెగల మధ్య చిచ్చుపెడుతున్న పాలకులు : మాజీ ఎంపీ మాలోత కవిత
- కుట్ర మానుకోకపోతే ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదు : మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్..



మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): లంబాడీలు వలసదారులు కారని, ఈ నేల మూలవాసులని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మానుకోట పట్టణంలో ఆదివారం లంబాడీల ఆత్మగౌరవ సభ ఘనంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుండి వేలాది మంది బంజారా సమాజానికి చెందిన ప్రజలు సేవాలాల్ జెండాలతో సాంస్కృతి నృత్యాలతో భారీ ఊరేగింపుగా సభ ప్రాంగణాన్ని కిక్కిరిసేలా తరలి వచ్చారు. లంబాడీ ఆత్మగౌరవ సభలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ లంబాడీలు వలసవాదులు కాదు ఈనేలకే మూలవాసులని కొందరు గిరిజన తెగల మధ్య చిచ్చుపెట్టి లంబాడీలను వెనక్కి నెట్టే కుట్రలు చేస్తున్నారని ఇలాంటి విభజన ప్రయత్నాలను లంబాడీ సమాజం ఐక్యతా శక్తితో అడ్డుకోవాలని వారు అన్నారు. మాజీ ఎంపీ మాలోత కవిత మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించే కుట్ర జరుగుతోందని ఇది కేవలం ఒక వర్గాన్ని కాకుండా రాజ్యాంగ స్ఫూర్తినే దెబ్బతీయాలన్న యత్నం పాలకులదని తక్షణమే ఇలాంటి ప్రయత్నాలను విరమించుకోవాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ లంబాడీల హక్కులపై ఎవరైనా మోకరిల్లే ప్రయత్నం చేస్తే ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదు. సమాజ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు అందరం కలసి పోరాటం చేయాలి అని పిలుపునిచ్చారు. ఈసభలో డాక్టర్ జగదీష్ అధ్యక్షతన వహించారు లంబాడిల వేషధారణలతో పాటు గిరిజన నృత్యంలతో అలరించారు. ఈ సందర్భంగా లంబాడి ఆత్మగౌరవ సభలో సేవాలాల్ సేన వ్యవస్థపాక అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే రాష్ట్రంలో లంబాడీలకు ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కొయ్య గోండ్ లంబాడీ సోదరులను చీల్చి విభజించి పాలించు అనే ధోరణిలో కుట్రలు చేస్తున్నరని వారు మండిపడ్డారు. లంబాడీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ లంబాడీలు నీజాం రజాకారుల పాలన నుండి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన జాతిలంబాడీ జాతి అని స్వతంత్రం ముందే లంబాడీలు ఎస్టీలుగా గుర్తింపుపొందారని, ఆదివాసి సోదరుల వెనుక నుంచి నడిపించే దుష్టశక్తుల మాటలు విని అన్నదమ్ముల మధ్య వైరం సృష్టించి వారి సోలాభం కోసం మమ్ముల్ని ఆగం చేస్తున్నార వారు మండిపడ్డారు. లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థపాక అధ్యక్షులు దాసురాం నాయక్, డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుగులోత్ భీమా నాయక్ సామాజిక చైతన్య ఐక్య వేదిక అధ్యక్షులు గుగులోత్ కిషన్ నాయక్ రాందాస్ నాయక్ అంగోత్ బిందు మాలోత్ శ్రీను నాయక్ లంబాడి ఆత్మగౌరవ సభ జేఏసీ నాయకులు బానోత్ రామన్న నాయక్ టీఎస్ టీటీఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ ఈరు నాయక్ బానోత్ కిషన్ నాయక్ రామ్ చందర్ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా నాయకులు గుగులోత్ రవి నాయక్ శంకర్ నాయక్ బాదావత్ శంకర్ ఇస్లావతు లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఇస్తానన్న బతుకమ్మ చీరలెక్కడ...?

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): మహిళలకు ఇస్తానన్న రెండు బతుకమ్మ చీరలు ఎక్కడా అంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాల సంప్రదాయాలను గౌరవిస్తూ రంజాన్ పండగకి రంజాన్ తోఫా, క్రిష్టమస్ పండుగకు క్రిస్మస్ కానుకగా బట్టలు, దసరా పండుగకి బతుకమ్మ చీరలు ఇచ్చి గౌరవిస్తే, కేసీఆర్ ఒక్క చీర ఇచ్చిండు మేము రెండు చీరలు ఇస్తామని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ప్రగాల్భాలు పలికిందని విమర్శించారు. సద్దుల బతుకమ్మ పండుగ సమీపిస్తున్నా ఇప్పటి వరకు మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ ఊసే లేదన్నారు. అధికారులను అడిగితే చీరలు వచ్చినవి, గోదాంలల్లో ఉన్నవి కానీ ప్రభుత్వం నుండి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పుతున్నారని, అంటే ఈ ప్రభుత్వం మహిళలను ఎలా గౌరవిస్తుందో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలోకి రావడానికి మహిళలకు ఈ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసిందని, కాని ఆచరణలో అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు.

## గోదావరి వరద నీటిమట్టాన్ని పర్యవేక్షించాలి


- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : జిల్లాలో కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుండి చేరుతున్న వరదనీటి కారణంగా గోదావరి నది తీరంలో నీటిమట్టం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో గల గోదావరి నది తీరంలో వరదనీటి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలతో కడెం, ఎస్. ఆర్. ఎస్. పి. ప్రాజెక్టుల నుండి వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేసినందున శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి వరద నీటిని విడుదల చేయడం జరిగిందని, ఈ నేపథ్యంలో గోదావరి నదిలో చేరుతున్న వరదనీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోదావరి నది వద్ద మున్సిపల్, పోలీస్ శాఖల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎవరు నదీ తీరానికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, భారీ కేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# అనుకున్నదొక్కటి... అయ్యింది ఒక్కటి!

- ఆశావహులను నిరాశపరిచిన రిజర్వేషన్లు..!
- జెడ్పీ చైర్మెన్, జెడ్పిటిసి, ఎంపీటీసీ, నుంచి సర్పంచ్ వరకు అదేతీరు



**బోల్తా కొట్టిందిలే బుల్బుల్ పెట్టలాఇటీవల ఎన్నికల అధికారులు ప్రకటించిన స్థానిక సంస్థల రిజర్వేషన్ల పట్ల సర్పంచ్ నుండి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు ఆశించిన రాజకీయ పార్టీలకు అభ్యర్థులకు అనుకున్నదొక్కటి అయ్యింది ఒకటి బోల్తా కొట్టిందిలే బుల్బుల్ పిట్టలా ప్రకటించిన రిజర్వేషన్స్ స్థానాలు అభ్యర్థుల మదిలో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి.. శనివారం జిల్లా అధికారులు ప్రకటించిన రిజర్వేషన్ల ప్రక్రియ పరిశీలించిన తర్వాత జడ్పిటిసి ఎంపీటీసీ సర్పంచ్ పదవులకు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో నైరాశ్యం నెలకుంది.ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది.**

వరంగల్ ప్రతినిధి , సెప్టెంబరు 28(జనంసాక్షి): గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ రిజర్వేషన్లు నాయకుల దృష్టంతా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కేంద్రీకృతం అవుతుంది. స్థానిక సంస్థల రిజర్వేషన్లు మరడంతో ఆశావహుల్లో సమీకరణాలు మారాయి. పంచాయతీ ఎన్నికల కన్నా ముందే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిజర్వేషన్ల విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. తాము పోటీ చేయదల్చుకున్న స్థానంలో రిజర్వేషన్ రాకపోవడంతో వివిధ పదవుల కోసం ఆశించిన అభ్యర్థులు నిరాశతో గందరగోళంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. గ్రామ పంచాయతీ, మండలపరిషత్, జిల్లా పరిషత్లకు గత ప్రభుత్వం విడతలుగా వర్తించేలా 2018లో పంచాయతీ రాజ్ రెండు చట్టాన్ని తీసుకొచ్చింది. డిసెంబర్ లో నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లు 2024 ఆమోదం పొందడంతో ఒకే దఫా మాత్రమే రిజర్వేషన్లు అమలు కానున్నాయి. ఫలితంగా ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మారాయి. దీంతో ఎన్నికల్లో పోటీ చేయాలని ఉత్సాహపడిన నేతల్లో కొత్త రిజర్వేషన్లతో అనాసక్తికి గురయ్యారు. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు మారనుండంతో తమ ఆలోచన సరళిని మార్చుకుంటు న్నారు. రిజర్వేషన్ల కేటాయింపుల్లో తొలుత ఎస్టీలకు రిజర్వు స్థానాలు కేటాయించారు. ఎస్టీ తరువాత స్థానంలో ఎస్సీ అనంతరం బీసీకి రిజర్వేషన్లు కేటాయించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీతో సర్పంచుల రిజర్వేషన్లలో మార్పులు ఉన్నాయి. గత పదేన్లుగా ఆయా గ్రామపంచాయతీలోగతంలో రిజర్వేషన్లు రానున్న రిజర్వేషన్లు అంచనా ఉంచుకొని ఎన్నోసహాయ కార్యక్రమాలు నిర్వహించిన నాయకులకు తాము అనుకున్న రిజర్వేషన్ రాకపోవడంతో చాలా నిరాశకు గురయ్యారు. 10సంవత్సరాల కాలంపాటు రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తూ చాలా మంది అభ్యర్థులు ఈసారైనా తమకు సరైన రిజర్వేషన్ వస్తే పోటీ చేసి తమ సత్తా చూపిద్దామనుకున్న తరుణంలో తాము ఊహించని స్థాయిలో రిజర్వేషన్లు వెలువడటంతో అసహనానికి లోనైనట్లు వినికిడి. పది సంవత్సరాల నుండి ప్రజలలో తిరుగుతూ ప్రజలతో మమేకమై చేదోడు వాదోడుగా ఉంటూ సహాయక సహకారాలు అందిస్తూ ఏదో ఒక రిజర్వేషన్ వస్తే ఇందులో పోటీ చేద్దాం అన్న తరుణంలో కనీసం తమకు తగ్గ రిజర్వేషన్ రాకపోవడంతో నిస్పృహలకు లోనయ్యారు. కొత్తగా వెలువడిన రిజర్వేషన్లతో కొత్త ఆశావాహులు గ్రామాలలో సందడి చేస్తున్నారు. నిరాశ, నిస్పృహలతో రిజర్వేషన్ ఆశించిన అభ్యర్థులందరు ఎటు పాలు పోనీ సతిలో ఇటీవల ప్రకటించిన ఆబ్కారి శాఖ ప్రకటించిన బార్ లైసెన్సుల కోసం సన్నద్ధమవుతున్నారు. కొందరు రిజర్వేషన్ ఆశించి గ్రామీణ ప్రాంతాల్లో మండల కేంద్రాల్లో తమకే రిజర్వేషన్ వస్తుందని ప్రకటించుకుని వినాయక చవితి, సద్దుల బతుకమ్మ ఇతర గ్రామీణ వేడుకలు తీరునాళ్ళు సందర్భంగా బ్యానర్ల ద్వారా కటక్ కటౌట్ ద్వారా విరివిగా ప్రచారం చేసుకుని లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. కొందరు అభ్యర్థులు తమ కార్యకర్తలకు థాయిలాండ్ అందిస్తూ దర్జాగా చూసుకుంటూ తమకే ఆశించిన రిజర్వేషన్ వస్తుందని బీరాలు పలికారు. దీంతో శనివారం ప్రకటించిన రిజర్వేషన్లు బుల్బుల్ పిట్ట బోల్తా కొట్టడంతో ఎటు పాల్పోనిస్థితిలో టికెట్లు ఆశించిన అభ్యర్థులు ప్రత్యామ్నాయంగా బార్ లైసెన్సుల వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

## బీసీలు రాజ్యాధికార సాధనకు నడుం బిగించాలి

- మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్




హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీలు రాజ్యాధికార సాధన పోరాటానికి నడుం బిగించాలని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం నాడు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఐఏఎస్ ఆఫీసర్స్ ఇన్స్టిట్యూట్ లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి చిరంజీవులు రచించిన హిస్సా ఇజ్జత్ హుకుమత్ బీసీ రాజ్యాధికార సిద్ధాంతం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయ ఆర్థిక రంగంలో బీసీలు అణిచివేత గురవుతున్నారని వివరాలను గణంకాలతో సహా ఈ పుస్తకంలో పొందుపరిచారని ఆయన తెలిపారు. శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి మాట్లాడుతూ బీసీలు చైతన్య తెచ్చుకోని అధికారం కోసం హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలలో పాటు కులంతో పాటు డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు ఆర్థికంగా ఎదిగే విధంగా కృషి చేయాలని ఆర్థిక రంగంపై దృష్టి సారించాలని ఆయన కోరారు. మాజీ పార్లమెంటు సభ్యులు వి హనుమంతరావు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగ రచన సమయంలో నుంచి ఇప్పటివరకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ డా,,బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు ఉన్న విధంగా రాజ్యాంగంలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల చాలా నష్టపోయామని పేర్కొన్నారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి. ఈశ్వరయ్య మాట్లాడుతూ బీసీలు రాజ్యాంగపరమైన పరిజ్ఞానం పెంచుకొని చట్టబద్ధమైన రిజర్వేషన్లు సాధించేందుకు పోరాటాలు చేయాలని సూచించారు. వకులాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ నేటి తరానికి ఈ పుస్తకం మార్గదర్శకం చేస్తుందని చెప్పారు. జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకం రాజ్యాధికారానికి ఆయుధాలుగా మారుతుందని పేర్కొన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు మాట్లాడుతూ తాను ఎంతో అధ్యయనం చేసి ఈ పుస్తకం రాయడం జరిగిందని బిసిలు ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్ ,అయిలి వెంకన్న గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు గౌడ సంఘాల సమన్వయ కమిటీ,ప్రముఖ రచయిత సంగిశెట్టి శ్రీనివాస్, చామకూర రాజు, కె.వి గౌడ్, గుజ్జ సత్యం, ఎర్రమాద వెంకన్న, దుర్గయ్య గౌడ్, అంబాల నారాయణ గౌడ్ ,చెన్న శ్రీకాంత్, కర్నాటి మనోహర్, బొమ్మ రఘురాం నేత, సింగం నాగేశ్వర్ గౌడ్,లింగేష్ యాదవ్ నకిరెకంటి శ్రీనివాస్, కొండల్ గౌడ్, ఒంటెద్దు నరేందర్, కిరణ్ కుమార్, వసుమతి యాదవ్, గౌలికరు సోనీ, దాసు సురేష్, బైరు శేఖర్, అవ్వారు వేణు, కర్నాటి వెంకటేశం,పెద్ది జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370